
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 09, సంచిక: 70 | శనివారం | 07-02-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## అండర్ 19 ప్రపంచకప్ భారత్‌దే

ఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై ఘన విజయం

జింబాబ్వేలోని హరారే వేదికగా జరిగిన 2026 అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను 100 పరుగుల తేడాతో చిత్తు చేసి, టీమ్ ఇండియా రికార్డు స్థాయిలో ఆరోసారి విశ్వవిజేతగా నిలిచింది.

12

## డొనాల్డ్ ట్రంప్ ముందు మోదీ లొంగారు

- అందుకే అమెరికాతో వాణిజ్య ఒప్పందం
- సన్న, చిన్నకారు రైతులకు రక్షణలేకుండా పోయింది
- సంయుక్త కిసాన్‌మోర్చా విమర్శ
- ఈనెల 12న లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని నిరసిస్తూ ప్రదర్శనలు, ధర్నాలు చేపట్టాలని పిలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 12న జరగనున్న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలను చేపట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపునిచ్చింది. అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందం (‘ఏకపక్ష ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్’) నిరసిస్తూ గ్రామ ,గ్రామాన ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేయాలని ఎస్‌కెఎం నాయకులు తెలిపారు. అమెరికా ముందు ప్రధాని మోదీ లొంగిపోయారని, అందుకే అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నారని, ఈ ఒప్పందం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు రక్షణ లేకుండా పోయిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను, అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందాలను తక్షణమే ఉప సంహరించుకోవాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్, హిమాయత్‌నగర్, మఖ్దూంభవన్‌లోని రాజ్‌హదూర్‌గౌర్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌కెఎం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్లు పశ్యపద్మ, టిసాగర్, వి.ప్రభాకర్, జక్కుల వెంకటయ్య, ఆర్.వెంకట్రాములు, మండల వెంకన్న, కె.కాంతయ్య , ఎస్‌కెఎం రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్, డి.జి.నరేంద్ర ప్రసాద్, బి.రాము మాట్లాడుతూ సి2,ప్లస్ 50 శాతం ప్రకారం పంటల మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని, విత్తన, విద్యుత్ మార్కెట్ బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని తరువాయి 2లో




- నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకెళ్లిన సభ్యులు
- కొనసాగిన వాయిదాల పర్వం
- పార్లమెంట్ వెలుపల నిరసన ప్రదర్శన
- నియంతృత్వాన్ని సహించం, నరేంద్ర సరెండర్, ప్రజాస్వామ్య హత్యను ఆపండి అంటూ నినాదాలు
- లోక్‌సభను సోమవారానికి వాయిదా వేసిన స్పీకర్

# స్తంభించిన పార్లమెంట్

## పలు అంశాలపై విపక్ష ఎంపిల ఆందోళన

**న్యూఢిల్లీ :** భారత్‌–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం, ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవణే విడుదల కాని జ్ఞాపకాల పుస్తకం వివాదాస్పదం సహా పలు అంశాలపై ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపిలు, పార్లమెంట్ ఉభయసభల్లోనూ, వెలుపల తమ ఆందోళనలు కొనసాగించారు. దీంతో శుక్రవారం కూడా లోక్‌సభలో ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై చర్చ చేపట్టలేదు. సభ్యులు విపక్ష సభ్యులు తమ నిరసనను తీవ్రతరం చేయడంతో స్పీకర్ సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు. ఉదయం సభ ప్రారంభం కాగానే చాలా మంది ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. ఈ నేపథ్యంలో తాను సభను నడుపాలని తాను కోరుకుంటున్నానని, ప్రజలు తమ సమస్యలను లేవనెత్తాలని, నినాదాలు చేయకూడదని సభ్యులను ఎన్నుకున్నారని స్పీకర్ అన్నారు. అనంతరం సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం తిరిగి సభ ప్రారంభంగానే ప్రతిపక్ష సభ్యులు సభ వెల్‌లోకి దూసుకెళ్లి నిరసనలు కొనసాగించారు. కార్యకలాపాలకు అధ్యక్షత వహించిన తరువాయి 2లో

మా ప్రశ్నలకు జవాబిచ్చేందుకు

## మోదీకి ధైర్యం లేదు

- ప్రభుత్వం సభను ప్రజాస్వామ్య పద్ధతిలో నడపాలనుకోవడం లేదు
- అబద్ధాలను పదే పదే చెప్పడమే మోదీ పని
- ప్రధానిపై విరుచుకుపడిన మల్లికార్జున ఖర్గే

06

26 నుంచి అసెంబ్లీ

## బడ్జెట్ సమావేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 26వ తేదీ నుంచి జరగనున్నాయి. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సుమారు 15 రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఇప్పటికే మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నెల 11వ తేదీన పోలింగ్, 13వ తేదీన ఫలితాలు, అనంతరం చైర్మన్లు, మేయర్ల ఎన్నిక జరగనుంది.ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన అనంతరం అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందు కోసం ఇప్పటికే శాఖల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్షలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామృష్ణారావు పూర్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం ప్రభుత్వ శాఖాధిపతులతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి బడ్జెట్ సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు.



## చెన్నైలో నిలువెత్తు కార్ల్ మార్క్స్ విగ్రహం

ఆవిష్కరించిన సిఎం ఎం.కె. స్టాలిన్ హాజరైన సిపిఐ, సిపిఎం, ఎండిఎంకె నాయకులు 12

## ఉగాదికి గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్

ఇండస్ట్రీ ప్రభుత్వాన్ని సొంతం చేసుకోవాలి : డిప్యూటీ సిఎం భట్టి 12

హైదరాబాద్ అభివృద్ధికి రెండేళ్లలో

## రూ.20వేల కోట్లు

- జిహెచ్‌ఎంసిలో 27 పట్టణ స్థానిక సంస్థల విలీనం ఓ చరిత్రాత్మక నిర్ణయం
- ‘క్రెడాయ్’ ప్రాపర్టీ ఎగ్జిబిషన్ షో లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు




ప్రజాపక్షం/రంగారెడ్డి

మహానగరం చుట్టు ప్రక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జిహెచ్‌ఎంసి లో విలీనం చేయడం ఓ చరిత్రాత్మక నిర్ణయమని తెలంగాణ డిప్యూటీ సిఎం సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాల వ్యవధిలోనే 20వేల కోట్లు కేటాయించాం, ఇందులో అనేక పనులు పూర్తికాగా మరికొన్ని పనులు ప్రగతిలో ఉన్నాయని,ఈ తరహాలో హైదరాబాదు నగర అభివృద్ధికి నిధులు కేటాయించడం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగలేదని ఆయన చెప్పారు.శుక్రవారం హైదరాబాద్ హైటెక్స్ లో క్రెడాయ్ ప్రాపర్టీ ఎగ్జిబిషన్ షో సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి పరిధిలో 1950.52 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పరిధిలో 12,500 కోట్లు, హెచ్ ఎండిఎ పరిధిలో 4,3365 కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. హైదరాబాదు నగరం తరువాయి 2లో





## నిజామాబాద్ జిల్లా వ్యవసాయానికి మారుపేరు

- జిల్లా రైతుల పోరాటం దేశానికి ఆదర్శణీయం
- బిజెపిని బొంద పెట్టండి.. కాంగ్రెస్‌కు పట్టంకట్టండి
- ఎంపి ధర్మపురి అరవింద్ నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా ఎందుకు చేయలేకపోయారు?
- బర్ధిపూర్ గ్రామంలో జరిగిన ప్రజాపాలన ప్రగతిబాటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలదీత

ప్రజాపక్షం/నిజామాబాద్

‘నిజామాబాద్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉంది. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని దాశరథి ఇక్కడి ఖిల్లా జైలు నుంచి నినదించారు. ఈ జిల్లా వ్యవసాయానికి మారుపేరు. ఇక్కడి వ్యవసాయం చెరుకు, పసుపు, వరి రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శం. రైతు సమస్యలపై పోరాటం ఆదర్శనీయం’ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని బొందబెట్టి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని, జిల్లా అభివృద్ధికి నూటికి నూరుశాతం సహకరిస్తానని హామీనిచ్చారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రూ.700 కోట్లతో పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బర్ధిపూర్‌లో మాజీ పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ సమాధి వద్ద నివాళులర్పించారు. గ్రామంలో ప్రజాపాలన – ప్రగతి బాట సభ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ పాల్గొన్నారు. సభనుద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని, ఇదివరకే సర్వేలు పూర్తయ్యాయన్నారు. అభ్యర్థులు తరువాయి 2లో



## వడ్డీ రేట్లు యథాతథం

ఆర్‌బిఐ కీలక నిర్ణయం

**ముంబయి :** దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా సాగుతుందన్న విశ్వాసంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష అనంతరం గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ఉదయం నిర్ణయాలను వెల్లడించారు. రెపో రేటును 5.25 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణం మధ్య సమతౌల్యం సాధించడమే లక్ష్యమని ఆర్‌బిఐ గవర్నర్ స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రేట్లను మార్చాల్సిన అవసరం లేదని భావించినట్లు తరువాయి 12లో

## ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి

- కనీసం 31 మంది మృతి
- 170 మందికి గాయాలు
- ఖైబర్ ఫక్తూన్క్వాలో 24 మంది ఉగ్రవాదులు హతం

**ఇస్లామాబాద్/ పెషావర్:** పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని టర్లై ప్రాంతంలో ఉన్న ఖదీజతుల్ కుబ్రా మసీదు వద్ద శుక్రవారం నమాజ్ సమయంలో జరిగిన ఆత్మాహుతి దాడిలో కనీసం 31 మంది మరణించగా, సుమారు 170 మంది వరకు గాయపడినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఖైబర్‌ఫక్తూన్వాలో 24 మంది ఉగ్రవాదులను హతమార్చినట్టు పాకిస్తాన్ సైన్యం ప్రకటించింది. కాగా, ఇస్లామాబాద్‌లోని ఇమాంబర్గా వద్ద ప్రార్థనల కోసం పెద్ద సంఖ్యలో భక్తులు చేరిన వేళ ఆత్మాహుతి దాడి జరగడం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, దాడి చేసిన వ్యక్తిని ఇమాంబర్గా గేటు వద్దే భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అయితే అతడు అక్కడే తన వంటిపై ఉన్న పేలుడు పదార్థాలను పేల్చుకున్నాడు. ఈ పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో తరువాయి 12లో



అమెరికా– ఇరాన్ చర్చలకు

## ఒమాన్ మధ్యవర్తిత్వం



**మస్కట్:** ఒమాన్ రాజధాని మస్కట్‌లో ఇరాన్ అణు కార్యక్రమంపై ఇరాన్–అమెరికా మధ్య పరోక్ష చర్చలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ చర్చలకు ఒమాన్ మధ్యవర్తిత్వం వహించింది. ఇరు దేశాల ప్రతినిధులు ఒకేసారి కాకుండా విడివిడిగా ఒమాన్ ఉన్నత దౌత్యవేత్తను కలవడానికి వచ్చారు. తొలుత ఇరాన్ ప్రతినిధుల కాన్వాయ్ మస్కట్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని రాజప్రాసాదానికి చేరుకుంది. కొంతసేపటి తర్వాత వారు తిరిగి హోటల్‌కు వెళ్లారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ఒమాన్ విదేశాంగ మంత్రి బద్ర్ అల్‌బుసైదిను కలిసినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా ధ్రువీకరించింది. ఇరాన్ వాహనాలు వెళ్లిన తరువాతే అమెరికా కాన్వాయ్ రాజప్రాసాదానికి చేరుకుంది. అమెరికా జెండా ఉన్న వాహనం కూడా ఇందులో ఉంది. ఈ కాన్వాయ్ సుమారు గంటన్నర పాటు అక్కడ ఉండి అనంతరం వెళ్లిపోయింది. అనంతరం ఒమాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో, బుసైది వేర్వేరుగా అరఘ్చితో, తరువాయి 12లో

# ట్రంప్ నోట పదేపదే అదే మాట

### భారత్‌–పాక్ యుద్ధాన్ని తానే ఆపినట్టు మరోసారి ప్రకటన



**న్యూయార్క్/వాషింగ్టన్:** భారత్‌–పాక్ దేశాల మధ్య యుద్ధం జరగకుండా తాను అడ్డుకున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఆయన చాలా కాలంగా ఇదే మాట చెప్తున్న విషయం తెలిసిందే. 'ఏడాది కాలంలో నేను ఎనిమిది యుద్ధాలను లేదా యుద్ధ ప్రారంభాలను అడ్డుకున్నాను. కంబోడియా–థాయిలాండ్ లేదా కొసావో–సెర్బియా, పాకిస్తాన్–ఇండియా, ఇజ్రాయెల్–ఇరాన్, ఆర్మేనియా–అజర్‌బైజాన్.. ఇలా ఎన్నో యుద్ధాలను నిలువరించాను' అని నేషనల్ ప్రేయర్ అల్పాహార సమావేశంలో పాల్గొన్న ట్రంప్ వ్యాఖ్యానించారు. అదే విషయాన్ని ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రుత్'లో పోస్టు చేశారు. అమెరికాను సైనిక పాటవాన్ని తాను బలోపేతం చేశానని, ఇప్పుడు ప్రపంచంలోనే తమను మించిన శక్తివంతమైన దేశం లేదని ట్రంప్ అన్నారు. రెండో ప్రపంచ యుద్ధం నాటితో పోలిస్తే వంద రెట్లు అత్యాధునికమైన, శక్తివంతమైన నౌకాదళాన్ని సిద్ధంగా ఉంచినట్టు చెప్పారు.

అదే సమయంలో, అణు యుద్ధాలు జరిగే ప్రమాదం నుంచి ఎన్నో దేశాలను తప్పించానని అన్నారు. పాకిస్తాన్‌తో జరిపిన శాంతి సంభాషణల్లో మూడోవారెవరూ లేరని, ద్వైపాక్షిక చర్చలు జరిగాయని భారత్ స్పష్టం చేస్తుండగా, ట్రంప్ మాత్రం తాను యుద్ధాన్ని నివారించినట్టు పదేపదే ప్రకటించుకుంటున్నారు. ట్రంప్ ప్రకటనలను భారత్ ఖండిస్తునే ఉంది.

# గ్రీన్‌లాండ్‌లో కెనడా, ఫ్రాన్స్ దౌత్యకార్యాలయాలు



**నూక్:** అమెరికా గ్రీన్‌లాండ్‌పై నియంత్రణ సాధించాలన్న ప్రయత్నాల నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెకలొన్నాయి. ఈ నేపథ్యంలోనే కెనడా, ఫ్రాన్స్, గ్రీన్‌ల్యాండ్ రాజధాని నూక్‌లో తమ దౌత్య కార్యాలయాలను ప్రారంభించనున్నాయి. ఈ చర్య ద్వారా నాటో మిత్రదేశమైన డెన్మార్క్‌కు, అలాగే పాక్షిక స్వయంపాలిత ప్రాంతమైన గ్రీన్‌లాండ్‌కు మద్దతు ప్రకటించినట్టుగా భావిస్తున్నారు. ఈ రెండు దేశాలు కాన్సులేట్లను ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందించినట్టు శుక్రవారం అధికారికంగా ప్రకటించయి. కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ నూక్‌కు వెళ్లి కెనడా కాన్సులేట్‌ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు కెనడాకు చెందిన ఆదివాసీ వర్గానికి చెందిన గవర్నర్ జనరల్ మేరీ సైమన్ కూడా పాల్గొననున్నారు. కెనడా అధికారులు ఈ కాన్సులేట్ ద్వారా వాతావరణ మార్పు, ఆర్కిటిక్ భద్రత, అలాగే ఇన్యూట్ ప్రజల హక్కుల వంటి అంశాల్లో గ్రీన్‌లాండ్‌తో సహకారం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. కెనడా ఇప్పటికే 2024లోనే గ్రీన్‌లాండ్‌లో కాన్సులేట్ ప్రారంభిస్తామని హామీ ఇచ్చింది. అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా నవంబర్‌లో జరగాల్సిన ప్రారంభోత్సవం వాయిదా పడింది. కాగా, ఇదే సమయంలో, ఫ్రాన్స్ కూడా గ్రీన్‌లాండ్‌లో తన కాన్సులేట్ జనరల్‌ను ప్రారంభిస్తోంది. జీన్‌నోయెల్ పొయిరియర్ కాన్సుల్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గ్రీన్‌లాండ్‌లో కాన్సులేట్ జనరల్ ఏర్పాటు చేస్తున్న తొలి యూరోపియన్ యూనియన్ దేశంగా ఫ్రాన్స్ నిలవడం గమనార్హం. సంస్కృతి, శాస్త్రం, ఆర్థిక రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయడం, అలాగే స్థానిక అధికారులతో రాజకీయ సంబంధాలను బలపరచడం ఆయన ప్రధాన బాధ్యతలుగా ఉంటాయని తెలిపింది.

## అమెరికా, రష్యా మధ్య ఉన్నత స్థాయి సైనిక చర్చలు!

**కీవ్:** ఉక్రేన్ యుద్ధాన్ని ముగించేందుకు ప్రయత్నాలు సాగుతున్న నేపథ్యంలో, నాలుగు సంవత్సరాలకుపైగా నిలిచిపోయిన ఉన్నత స్థాయి సైనిక చర్చలను అమెరికా, రష్యా తిరిగి ప్రారంభించేందుకు అంగీకరించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత వాషింగ్టన్–మాస్కో మధ్య సంబంధాలు కొంత మెరుగుపడుతున్నాయనే సంకేతంగా ఈ నిర్ణయాన్ని భావిస్తున్నారు. 2021 చివరిలో, ఉక్రేన్‌పై రష్యా పూర్తి స్థాయి దాడికి ముందు, ఇరు దేశాల మధ్య సైనిక సంబంధాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ కొత్త సైనిక సంప్రదింపు వ్యవస్థ స్థిరమైన సైనిక–సైనిక సంబంధాన్ని కొనసాగించేందుకు, దీర్ఘకాలిక శాంతి దిశగా ప్రయత్నాలకు సహకరిస్తుంది అని అమెరికా యూరోపియన్ కమాండ్ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుదాబీలో జరిగిన అమెరికా, రష్యా ఉన్నత స్థాయి సైనిక అధికారుల సమావేశంలో ఈ ఒప్పందం కుదిరింది. అదే సమయంలో, అమెరికా, నాటో యూరోపియన్ కమాండర్ జనరల్ అలెక్సస్ గ్రింకెవిచ్ కూడా అబుదాబీలో ఉన్నారు. అక్కడ ఉక్రేన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా, రష్యా, ఉక్రేన్ అధికారుల చర్చలు రెండో రోజుకు చేరాయి. ఇదిలా ఉండగా, రష్యా ఉక్రేన్ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులను మరింత పెంచింది. పౌరులకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం ద్వారా ప్రజా మద్దతును బలహీనపరచడమే లక్ష్యంగా ఈ దాడులు చేస్తున్నట్లు అంచనా. తూర్పు, దక్షిణ ఉక్రేన్‌లో సుమారు వెయ్యి కిలోమీటర్ల పొడవున ఉన్న ముందు రేఖ వెంబడి తీవ్ర యుద్ధం కొనసాగుతోంది.

## పోర్టుల నిర్వహణపై కోర్టు తీర్పు అమలు చేస్తాం

### పనామా అధ్యక్షుడు ములినో స్పష్టీకరణ



**పనామా సిటీ:** పనామా కాలువ పోర్టుల నిర్వహణకు సంబంధించి హాంకాంగ్‌కు చెందిన కంపెనీతో సాగుతున్న న్యాయపోరాటం మరింత ఉద్రిక్తతకు దారి తీయకూడదని ఆశిస్తున్నట్లు పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో వ్యాఖ్యానించారు. అయితే కోర్టు ఇచ్చిన తీర్పుపై తమ ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని ఆయన స్పష్టం చేశారు. చైనా ప్రభుత్వం నుంచి వచ్చిన హెచ్చరికలకు స్పందిస్తూ, పనామా గౌరవప్రదమైన దేశమనీ, ప్రపంచంలో ఏ దేశం నుంచైనా బెదిరింపులను తాము అంగీకరించేది లేదని ఆయన మీడియా సమావేశంలో అన్నారు. గత వారం పనామా సుప్రీంకోర్టు, పనామా కాలువలోని రెండు కీలక పోర్టుల నిర్వహణకు సంబంధించి హాంకాంగ్‌కు చెందిన సికె హచిసన్ హోల్డింగ్స్ అనుబంధ సంస్థకు ఇచ్చిన రాయితీ ఒప్పందం రాజ్యాంగ విరుద్ధమని తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే.

## 'న్యూ స్టార్ట్' గడువు ముగియడంపై క్రెమ్లిన్ విచారం



**మాస్కో:** రష్యా–అమెరికా మధ్య అణు ఆయుధాల నియంత్రణకు కీలకమైన చివరి ఒప్పందమైన 'న్యూ స్టార్ట్' గడువు ముగియడంపై క్రెమ్లిన్ గురువారం విచారం వ్యక్తం చేసింది. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం ఈ ఒప్పంద పరిమితులను కొనసాగించడాన్ని వ్యతిరేకిస్తూ, మరింత మెరుగైన, ఆధునికమైన కొత్త ఒప్పందం కావాలని ప్రకటించారు. 'న్యూ స్టార్ట్' గడువు ముగియడంతో, అర్ధ శతాబ్దానికి పైగా కొనసాగిన అణు ఆయుధాల పరిమితుల వ్యవస్థ పూర్తిగా కూలినట్టు భావిస్తున్నారు. దీని వల్ల నియంత్రణ లేని అణు ఆయుధ పోటీ మొదలయ్యే ప్రమాదం పెరిగిందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, వాషింగ్టన్ కూడా అంగీకరిస్తే, న్యూ స్టార్ట్ ఒప్పందంలోని పరిమితులను మరో ఏడాది పాటు పాటించేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. అయితే ట్రంప్ ఆ ప్రతిపాదనను పట్టించుకోకుండా, చైనాను కూడా కలుపుకున్న కొత్త ఒప్పందం కావాలని పట్టుబట్టారు. ఈ ప్రతిపాదనను చైనా తిరస్కరించింది. 'న్యూ స్టార్ట్'లో తమకు అనుకూలించే అంశాలు ఏవీ లేవని, ఆ దిశగా సక్రమమైన చర్చ కూడా జరగలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటున్నారు. అందుకే, ఆ ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేసి, దీర్ఘకాలం కొనసాగే విధంగా కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సిన అవసరం ఉందని వాదిస్తున్నారు. ఇలావుంటే, 'న్యూ స్టార్ట్' ఒప్పందం ముగింపు విషయాన్ని చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చర్చించారు. అమెరికా నుంచి ఎలాంటి స్పందన లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ, భద్రతా పరిస్థితిని సమగ్రంగా విశ్లేషించి సమతుల్యమైన, బాధ్యతాయుతమైన విధంగా రష్యా స్పందిస్తుందని క్రెమ్లిన్ సలహాదారు యూరీ ఉషకోవ్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మోదీ లొంగారు

(మొదటి పేజీ తరువాయి)


కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం2005'ను తిరిగి పునరుద్ధరించాలని, సవరించిన 2025 చట్టాన్ని రద్దు చేయాలని, రెండు వందల పనిదినాలను పెంచి, కూలిని రూ.600లకు పెంచాలని, కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లును వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. 202627 కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎరువులపైన సబ్సిడీ తగ్గించిందని, తద్వారా ధరలు పెరుగుతాయని తెలిపారు. రైతు వ్యతిరేక చట్టాలను అమలుచేయబోమని రైతులకు క్షమాపణ చెప్పిన ప్రధాని మోదీ, ఆ మూడు చట్టాలను ఇతర రూపాల్లో అమలు చేస్తున్నారని, రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించారని దుయ్యబట్టారు. అమెరికా వాణిజ్య ఒప్పందం ద్వారా అమెరికా ఉత్పత్తులు విచ్చలవిడిగా సరఫరా అవుతాయని, తద్వారా రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతుందని, వ్యవసాయ రంగం చతికిల పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

పశ్యపద్మ మాట్లాడుతూ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బరితెగించి అమలు చేస్తోందని విమర్శించారు. విద్యుత్ సవరణ బిల్లు అమలు లోనికి వస్తే రైతులకు ఉచిత విద్యుత్ పథకం రద్దవుతుందని, మొటర్లకు మీటర్లను ఏర్పాటు చేస్తారని, ఆ మీటర్ల ఆధారంగా రైతుల నుంచి కూడా బిల్లులను వసూలు చేస్తారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేవలం 2.3 శాతం నిధులను మాత్రమే ప్రతిపాదించిందని, తక్కువ కేటాయింపుల కారణంగా చిన్న, సన్న కారు రైతులు తీవ్ర ఇబ్బందులు గురయ్యే ప్రమాదం ఉన్నదని వివరించారు. కొబ్బరి, గంధం చెట్లు, జీడిపప్పు, కోకోలాంటి ఉత్పత్తులను ఉత్పత్తులను ప్రొత్సహిస్తామని చెప్పినప్పటికీ బడ్జెట్‌లో మాత్రం కేవలం రూ. 360 కోట్లను ప్రతిపాదించారన్నారు. అత్యంత ముఖ్యమైన బిల్లులపైన కేంద్రం పార్లమెంట్‌లో కూడా చర్చించే అవకాశాన్ని కల్పించలేదని విమర్శించారు.

టి.సాగర్ మాట్లాడుతూ అమెరికాకు ఎగుమతి చేసే ఉత్పత్తులపైన 18 శాతం పన్నులను విధిస్తారని, తద్వారా ఎగుమతులు నిలిచిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోందని దుయ్యబట్టారు.

## వ్యవసాయానికి మారుపేరు

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళితే విజయం సాధిస్తారన్నారు. 2023 ఎన్నికల్లో తాను టిపిసిసి అధ్యక్షునిగా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేష్‌కుమార్‌గౌడ్ ప్రచారం నిర్వహించి పార్టీని అధికారంలోకి తీసుకవచ్చామన్నారు. 2029లో సిఎంగా నేను, పిసిసి అధ్యక్షునిగా మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మళ్లీ అధికారంలోకి తీసుకువస్తామన్నారు. నిజామాబాద్ జిల్లా అంటే ప్రత్యేకమైన స్థానముందని, జిల్లాకు అవసరమైన నిధులు మంజూరు చేయడానికి శాయశక్తుల ప్రయత్నం చేస్తామన్నారు. జిల్లాలో వివిధ విద్యాసంస్థల కోసం రూ. 600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఎంపి ధర్మపురి అరవింద్‌ను ఉద్దేశించి తీవ్ర విమర్శలు చేశారు. నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా ఎందుకు చేయలేకపోయాడని ఎద్దేవా చేశారు. కెసిఆర్, హరీష్‌రావును జైల్లో పెట్టి చిప్పకూడు తినిపించాలని ధర్మపురి చెబుతున్నాడని, శాసనసభ్యులు చర్చ పెట్టి కాళేశ్వరాన్ని సిబిఐకి ఇస్తే ఇప్పటివరకు ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఏ బొక్కలో దాక్కున్నాడని మండిపడ్డారు. వారిద్దరిని కిషన్‌రెడ్డి కాపాడుతున్న విషయం అందరికి తెలిసిందేనన్నారు. వారిని ఎప్పుడు అరెస్టు చేస్తారో బిజెపి నాయకులే సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, ఆసియా ఖండంలోనే అతి పెద్ద వ్యవసాయ మార్కెట్ ఉన్న నిజామాబాద్ జిల్లా అన్నారు. ఇప్పటివరకు స్మార్ట్ సిటీ రాకపోవటానికి కారణం బిజెపి నేతలే అని విమర్శించారు. జిల్లాకు 2వ విడతలో ఎయిర్‌పోర్ట్ మంజూరు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. జిల్లాను స్పోర్ట్స్ హబ్‌గా మార్చాలని కోరుతున్నామన్నారు. జిల్లాలో మేయర్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని జిల్లాకు ప్రత్యేకంగా నిధులు తెచ్చి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో, ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ప్రతి ఇంటికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. త్వరలో మిగిలిపోయి అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు. రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, జిల్లాలో ప్రాణహిత ప్యాకేజీ పనులను ముందుకు తీసుకెళుతున్నారు అన్ని విధాలుగా ప్రజలకు మేలు చేసిన కాంగ్రెస్ పార్టీని మున్సిపల్ ఎన్నికల్లో దీవించాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ జిల్లా అందుకే వ్యవసాయ కళాశాల మంజూరు చేశామన్నారు. ఒక రాష్ట్రంలో ఒకే సంవత్సరంలో మూడు వ్యవసాయ కళాశాలలు మంజూరు చేసిన ఘనత సిఎం రేవంత్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నగేష్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మున్సిపాలిటీల అభివృద్ధి

### కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మున్సిపాలిటీలు ఎంతో అభివృద్ధి సాధిస్తున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి వివరించారు. శుక్రవారం రాత్రి షాద్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 9వ వార్డులో బిజెపి అభ్యర్థి ప్యాట అశోక్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. వార్డులో పర్యటిస్తూ ప్రజలకు అభివాదం చేశారు. అదే విధంగా మరికొన్ని వార్డులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించి కమలం గుర్తుకు ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. కేశంపేట రోడ్డు నుండి మొయిన్‌రోడ్డు మీదుగా పరిగి రోడ్డు వరకు రోడ్ షో నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీ ముందుకు సాగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ప్రాణాలను త్యాగం చేసి తెచ్చుకున్న తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందని ఆశిస్తే దోపిడి దొంగల చేతుల్లోకి వెళ్ళిపోయిందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో వారి సొంత వాళ్ళకే పదవులు ఇచ్చి ఇష్టం వచ్చిందన దొచుకున్నారే తప్పా ప్రజలకు చేసిందేమి లేదని అన్నారు. బిఆర్ఎస్‌లో అవినీతి పెరిగిపోవడంతోపాటు ఆహంకారం ఎక్కువ కావడంతోనే ప్రజలు గద్దె దించారని గుర్తు చేశారు. బిఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తుందని, త్వరలోనే ప్రజలకు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా అందినకాడికి దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఈ దుర్మార్గపు పాలన అంతం కావాలంటే ప్రతి ఒక్కరు కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు దేశ ప్రధాని నరేంద్రమోడి ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు మున్సిపాలిటిలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున నిధులు అంధిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంధిస్తున్న ప్రతి పథకంలో కేంద్రం వాటా ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని ప్రజలందరు గమనించాలని సూచించారు. దేశ ప్రజల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని, వాటన్నింటిని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులకు భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, చెంది మహేందర్‌రెడ్డి, కక్కునూరి వెంకటేష్ గుప్త, డాక్టర్ విజయ్‌కుయార్, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మురళి, వంశీ, ప్యాట అశోక్‌కుమార్, క్యామ మహేష్‌తోపాటు వివిధ వార్డుల అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిల్లుల బకాయిలు చెల్లిస్తాం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చేప పిల్లల సరఫరా బిల్లులు చెల్లింపులకు బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ జారీ అయ్యిందని, బిల్లులను 4 వారాల్లోగా చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. టోకెన్ ఇచ్చిన తర్వాత నాలుగు వారాల్లో అందజేస్తామంది. కాబట్టి అధికారులపై దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్లు కొట్టేయాలని కోరింది. దీనిపై స్పందించిన హైకోర్టు, కోర్టు ఎదుట హాజరుకావాలని డిసెంబర్‌లో ఆదేశాలిస్తే ఇప్పుడు బీఆర్‌వో జారీ చేశామని చెబితే ఎలాగని ప్రశ్నించింది. హామీ మేరకు బిల్లుల చెల్లింపులు చేసి అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణ మార్చి 6కు వాయిదా వేసింది. 2023–24 ఏడాది చేప పిల్లల బిల్లులను చెల్లించాలని గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయలేదంటూ శ్రీసాయి ఫిష్ సీడ్స్ కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను జస్టిస్ మాధవీదేవి విచారించారు. బిల్లుల చెల్లింపుల రంగం సిద్ధమైందని ప్రభుత్వ హామీని నమోదు చేశారు. అధికారులు బడ్జెట్ రూపకల్పనలో ఉన్నందున ఉన్నతాధికారుల వ్యక్తిగత విచారణ నుంచి మినహాయింపు ఇచ్చారు.

## స్తంభించిన పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణ ప్రసాద్ టెన్నేటి, ప్రతిపక్షాలు తమ స్థానాల్లో కూర్చుని ప్లకార్డులు పెట్టాలని కోరారు. అందుకు ప్రతిపక్ష సభ్యులు అంగీకరించకపోవడంతో సభను సోమవారానికి వాయిదా వేశారు. అంతకు ముందు స్పీకర్ ఓం బిర్లా ఇలాంటి సభను తాను నిర్వహించలేనని విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుత సమావేశంలో అంతరాయం కారణంగా 19 గంటల 13 నిమిషాలు వృథా అయ్యాయని, సభ్యులు సభను అగౌరవపరుస్తున్నారని స్పీకర్ పేర్కొన్నారు. కాగా, సోమవారం మధ్యాహ్నం నుండి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన ప్రచురించని జ్ఞాపకాల సారాంశాల ఆధారంగా ఒక కథనాన్ని ఉటంకించడానికి చైర్మన్ అనుమతించకపోవడంతో లోక్‌సభలో గందరగోళం నెలకొంది. సభను నడపడానికి అనుమతించాలని నిరసన తెలుపుతున్న సభ్యులను కోరుతూ, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీకి ఒక ప్రశ్న ఉందని బిర్లా అన్నారు. నిరసనలు కొనసాగుతుండగా సమావేశం జరిగిన నాలుగు నిమిషాల లోపు స్పీకర్ సమావేశాన్ని వాయిదా వేశారు. ప్రతిపక్ష సభ్యులు ట్రెజరీ బెంచీలకు వెళ్లవద్దని హెచ్చరిస్తూ నేను అలాంటి సభను నడపలేను అని అన్నారు.

**పార్లమెంట్ వెలుపల ఆందోళన**

అమెరికాతో వాణిజ్య ఒప్పందం, మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే ప్రచురించని జ్ఞాపకాల పుస్తకం చుట్టూ నెలకొన్న వివాదం, ఎనిమిది మంది ఎంపిల సస్పెన్షన్‌పై కాంగ్రెస్, కొన్ని ఇతర ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపిలు శుక్రవారం పార్లమెంట్ భవన సముదాయంలో నిరసన తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల వరకు లోక్‌సభ కార్యకలాపాలు వాయిదా పడిన తర్వాత, ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంట్ మకర ద్వారం వద్ద గుమిగూడి 'నియంతృత్వాన్ని సహించం నరేంద్ర, లొంగిపో, ప్రజాస్వామ్య హత్యను ఆపండి' వంటి నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మిగిలిన కాలానికి సస్పెండ్ అయిన ఎంపిలు, పలువురు ఇతర ఎంపిలు ఈ నిరసనలో పాల్గొన్నారు. వారు భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ 'ఉచ్చు ఒప్పందం' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్‌ను కూడా ప్రదర్శించారు. పార్లమెంట్ భవన సముదాయం నుండి బయలుదేరేటప్పుడు, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై పరోక్ష విమర్శలు చేస్తూ విలేకరులతో ఏది సరైనదని భావిస్తారో అది చేయండి అని అన్నారు. 2020లో భారత్‌చైనా సంఘర్షణ సమయంలో ప్రధాని మోడీ బాధ్యత నుండి తప్పించుకుని, ఆ నిందను జనరల్‌పైకి నెట్టారని నరవణే విడుదల చేయని జ్ఞాపకాల పుస్తకాన్ని ఉటంకిస్తూ గాంధీ బుధవారం ఆరోపించారు. లోక్‌సభలో కాంగ్రెస్ విప్, సస్పెండ్ అయిన ఎంపిలలో ఒకరైన మాణికం ఠాగూర్, ప్రధాని మోదీ వైఫల్యాల అంశంపై ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ప్రధాని మోదీ వెనకడుగు వేశారని, సభకు రావడానికి భయపడుతున్నారని, ఇతర దేశాల ఒత్తిడికి లొంగిపోయారని ఆయన ఆరోపించారు. మాజీ ఆర్మీ చీఫ్ నరవణే ప్రచురించని జ్ఞాపకాల పుస్తకాన్ని ఉటంకించిన ఒక కథనం నుండి రాహుల్ గాంధీని చదవడానికి అనుమతించకపోవడం, రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అనాగరిక ప్రవర్తనకు పాల్పడినందుకు ఎనిమిది మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయడం వంటి వివిధ అంశాలపై కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్ష సభ్యులు గందరగోళం సృష్టించడంతో సోమవారం నుండి సభలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. గురువారం, ప్రధాని సమాధానం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఆమోదించబడింది.

## రూ.20వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులు, ప్రతిభ, జీవన ప్రమాణాల్లో నాణ్యత విషయంలో దేశంలోని నగరాలతోనే మాత్రమే కాదు ప్రపంచంలోని అగ్ర నగరాలతో హైదరాబాద్ మహానగరం పోటీ పడుతుందని డిప్యూటీ సిఎం భట్టి తెలిపారు. హైదరాబాద్ మహానగరం చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయడం ఓ చారిత్రాత్మక నిర్ణయమని డిప్యూటీ సిఎం అభివర్ణించారు.ఈ గొప్ప నిర్ణయం ద్వారా నగరంలోని పౌరులకు ఒకే విధమైన పౌర సేవలు, సమగ్ర ప్రణాళిక, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఒకే అభివృద్ధి దృక్పథం సాధ్యం అయ్యాయి అన్నారు.ప్రస్తుతం హైదరాబాద్ నగరం దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, పెట్టుబడులకు అనుకూలమైన నగరాలలో ఒకటిగా నిలుస్తోంది. ఇది యాదృచ్ఛికంగా జరిగినది కాదు. దశాబ్దాల పాటు సాగిన సంస్థాగత నిర్మాణం, ప్రజాస్వామ్య పాలన,సమగ్ర అభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం నిబద్ధత ఫలితమే ఇది అన్నారు. నగరాభివృద్ధి అనేది న్యాయమైనది, సమతుల్యమైనది,అందరికీ అందుబాటులో ఉండాలనే మా నమ్మకాన్ని మున్సిపాలిటీల విలీనం ప్రతిబింబిస్తుంది తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 కింద, క్యూర్ ప్యూర్ రారే వ్యూహం రాష్ట్ర అభివృద్ధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీని కేంద్రంగా ఉంచుతోందనీ అన్నారు. ఆర్థిక వృద్ధి సామాజిక న్యాయం, సమాన అవకాశాలతో పాటు సాగాలన్న ప్రజా ప్రభుత్వం దీర్ఘకాలిక విశ్వాసానికి ఇది ప్రతిబింబం అన్నారు. హైదరాబాద్ తెలంగాణకు ఉపాధి,ఆవిష్కరణలు, గ్లోబల్ పెట్టుబడుల ప్రధాన ఇంజిన్‌గా కొనసాగుతుంది, అదే సమయంలో అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా చూస్తుంది అని భరోసా ఇచ్చారు. అయితే, మౌలిక సదుపాయాలే గొప్ప నగరాన్ని నిర్మించవు, ప్రజలతో ముఖ్యంగా అత్యంత బలహీన వర్గాలతో నగరం ఎలా వ్యవహరిస్తుందన్నదే దాని గొప్పతనానికి ప్రమాణం అని డిప్యూటీ సిఎం పేర్కొన్నారు. అందుకే 2047 వరకు దృష్టిలో ఉంచుకుని, వరదల భద్రత, వాతావరణ అనుకూలత కోసం ప్రత్యేకంగా లోతట్టు, వెనుకబడిన ప్రాంతాలకు ఉపయోగపడేల సమగ్ర స్టార్మ్ వాటర్ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నాం అన్నారు. అలాగే,యు ఎం టి ఎ ద్వారా సమగ్ర స్పెషియల్ మాస్టర్ ప్లాన్, బ్లూగ్రీన్ మాస్టర్ ప్లాన్, సమగ్ర మొబిలిటీ ప్లాన్‌లను అభివృద్ధి చేస్తున్నాం, అభివృద్ధి క్రమబద్ధంగా, పర్యావరణ బాధ్యతతో, అందుబాటులో ఉండేలా చేయడానికి. ఈ చర్యలు దీర్ఘకాలిక ప్రణాళికలు, సంస్థాగత బలోపేతం, స్థిరమైన అభివృద్ధిపై మా ప్రభుత్వ నిబద్ధతను చాటుతున్నాయి అని డిప్యూటీ సి ఎం గుర్తు చేశారు. దేశంలోనే అత్యంత నివసించదగిన, పెట్టుబడులకు అనుకూలమైన,మంచి పాలనతో కూడిన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యం అన్నారు. మేము కేవలం ఫ్లైఓవర్లు, రహదారులు మాత్రమే నిర్మించడం లేదు. పాలనపై విశ్వాసాన్ని పునర్నిర్మిస్తున్నాం. ప్రజా సంస్థలపై నమ్మకాన్ని పునరుద్ధరిస్తున్నాం. ప్రభుత్వం ప్రజల సేవ కోసమే ఉందన్న భావనను మరలా స్థిరపరుస్తున్నాం అన్నారు.

స్మార్ట్, స్థిరమైన, సమగ్ర, న్యాయసమ్మతమైన భవిష్యత్‌కు సిద్ధమైన హైదరాబాద్‌కు మేము పునాదులు వేస్తున్నాం అని తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు, పౌరులు ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల మార్గనిర్దేశంలో కలిసి హైదరాబాద్‌ను నిజంగా ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుదాం అని డిప్యూటీ సీఎం పునరుద్ఘాటించారు.రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సదాసిద్ధంగా ఉంది, మున్సిపాలిటీ ఎన్నికల బిజీ ఉన్నప్పటికీ తనతో పాటు సీనియర్ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి సైతం ఈ సమావేశానికి హాజరు అయ్యాము అంటే ఈ రంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న ఆసక్తి ఎలాంటిదో స్పష్టం అవుతుందని డిప్యూటీ సిఎం తెలిపారు.

# రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి వేగం

### మూడు హైస్పీడ్ రైలు కారిడార్లకు కేంద్రం ఆమోదం

### 2026-27 బడ్జెట్‌లో తెలంగాణకు రూ.5,454 కోట్ల కేటాయింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పరిశ్రమల విస్తరణ, పట్టణీకరణ వేగంగా కొనసాగుతున్న తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరింత ఊపునిచ్చింది. ప్రస్తుత 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి సగటున రూ.5,454 కోట్ల రైల్వే నిధులు కేటాయించడంతో పాటు, మూడు హైస్పీడ్ రైలు కారిడార్లకు కేంద్రం ఆమోదం తెలిపింది. రాష్ట్ర విభజన తర్వాత 2014 నుంచి తెలంగాణకు రైల్వే రంగంలో నిరంతరంగా అధిక నిధులు అందుతున్నాయని దక్షిణ మధ్య రైల్వే వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో (2009–2014) సగటున రూ.886 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం ఆ కేటాయింపులు ఆరింతలకుపైగా పెరగడం గమనార్హం.

**900కి.మీ కొత్త రైల్వే లైన్లు..** 2014 తర్వాత తెలంగాణలో 900 కిలోమీటర్లకు పైగా కొత్త రైల్వే మార్గాలు నిర్మించగా, 1,115 కిలోమీటర్ల మేర విద్యుదీకరణ పూర్తయ్యింది. దీంతో తెలంగాణ పూర్తిస్థాయి విద్యుదీకృత రాష్ట్రంగా మారింది. పెద్దపల్లి–నిజామాబాద్, జగ్గయ్యపేట–జన్పహాడ్ అక్కనపేట–మెదక్, భద్రాచలం రోడ్ సత్తుపల్లి వంటి కొత్త రైల్వే లైన్లు ప్రారంభమై దూరప్రాంతాలకు రైలు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. సికింద్రాబాద్–మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. కాజీపేట–బల్లార్షా, కాజీపేట–విజయవాడ మూడో లైన్ పనులు తుదిదశకు చేరాయి.

**ఎంఎంటిఎస్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ..** హైదరాబాద్ ఉపనగర రవాణాకు కీలకమైన ఎంఎంటిఎస్ ఫేజ్–2 పూర్తి కావడంతో ప్రయాణికులకు ఉపశమనం లభించింది. రూ.521 కోట్లతో కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే తయారీ యూనిట్ కూడా దాదాపు పూర్తి కావస్తోంది. ఇక్కడ కోచ్‌లు, ట్రైన్ సెట్లు వంటి రోలింగ్ స్టాక్ తయారీ జరగనుంది.

**స్టేషన్‌ల పునర్నిర్మాణం ...** తెలంగాణలో అమృత్ స్టేషన్ పథకం కింద 40 రైల్వే స్టేషన్లు రూ.2,015 కోట్ల అంచనా వ్యయంతో ఆధునీకరణకు గురవుతున్నాయి. బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లతో పాటు చెర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. సికింద్రాబాద్, హైదరాబాద్ ప్రధాన స్టేషన్ల పునర్వికాస పనులు దశలవారీగా కొనసాగుతున్నాయి.

**భద్రత, ఆధునిక రైళ్లు..** రైల్వే భద్రతలో కీలకమైన కవచ్ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ను తెలంగాణలో 627 కి.మీ మేర అమలు చేశారు. మరో 1,242 కి.మీకి కవచ్ 4.0 మంజూరైంది. 2014 తర్వాత 499 రైలు ఫ్లైఓవర్లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 5 జంటల వందే భారత్ ఎక్స్‌ప్రెస్, 3 జంటల అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి.

**మూడు హైస్పీడ రైలు కారిడార్లు..** ఈ బడ్జెట్‌లో తెలంగాణకు అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తూ, హైదరాబాద్ – బెంగళూరు, హైదరాబాద్ – చెన్నై, హైదరాబాద్ – పుణే మధ్య మూడు హైస్పీడ్ రైలు కారిడార్లకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీని ద్వారా హైదరాబాద్ హైస్పీడ్ రైల్ హబ్‌గా మారడంతో పాటు, వాణిజ్యం, సాంకేతికత, ప్రతిభ మార్పిడికి ఊతం లభించనుంది. ఈ రైల్వే పెట్టుబడులు తెలంగాణను అభివృద్ధి చెందిన పారిశ్రామిక రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో కీలకంగా నిలవనున్నాయని దక్షిణ మధ్య రైల్వే సిపిఆర్ఓ ఎ.శ్రీధర్ తెలిపారు.

# కార్పొరేషన్ ఎన్నికలు గుణపాఠం కావాలి

### కొత్తగూడెం గడ్డపై ఎగిరేది ఎర్రజెండానే

### కార్పొరేషన్ అభివృద్ధికి సిపిఐనే దిక్సూచి

### కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎటుచూసినా దారులన్నీ ఎరుపు, పసుపు వర్ణాల శోభితమవుతున్నాయి. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, స్థానిక ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాలు హోరెత్తుతున్నాయి. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 20,57,49,10,58,59,60 డివిజన్లలో నిర్వహించిన భారీ రోడ్ షోలు, బహిరంగ సభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం అభివృద్ధిలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర చిరస్మరణీయమని, బడుగు, బలహీన వర్గాల గొంతుకగా సిపిఐ ఎల్లప్పుడూ నిలబడుతుందని స్పష్టం చేశారు. బస్తీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యల నుంచి సంక్షేమ ఫలాల పంపిణీ వరకు ప్రతీ అంశంపై తాము పోరాడుతామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ పాలనలో పారదర్శకత ఉండాలంటే ఎర్రజెండా అభ్యర్థుల విజయం అనివార్యం అన్నారు. గడిచిన రెండేళ్లలో ఎమ్మెల్యేగా నియోజకవర్గాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానని, ఆదర్శవంతమైన నియోజకవర్గంగా నిలబెట్టేందుకు ప్రభుత్వంతో పోరాడి నిధులు మంజూరు చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యర్థి పార్టీల ప్రలోభాలకు లొంగకుండా నిబద్ధత గల సిపిఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించడం ద్వారా అహంకారులకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి అంటే కేవలం కాంట్రాక్టులు కాదని, సామాన్యుల ముంగిట సంక్షేమ ఫలాలు చేరడం, కార్పొరేషన్ సమగ్రంగా అభివృద్ధి సాధించడమే నిజమైన విజయమని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా నాయకులు దుర్గరాశి వెంకన్న, భూక్యా ధస్రు, వాసిరెడ్డి మురళీ, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, ఎస్‌కె.ఫాహీమ్, అభ్యర్థులు మూడ్ గణేష్, సహేరా మహ్మద్, బోయిన విజయ్ కుమార్, మహ్మద్ అబ్దుల్ సల్మా, కొచ్చెర్ల రాకేష్ కాంత్, ఇమ్రాన్ మహ్మద్, నాయకులు యూసఫ్, తమ్మ నర్సయ్య, పల్నాటి ప్రశాంత్, అస్మత్, జడల ప్రకాష్, అజీజ్, జక్కుల రాములు, కొమారి హనుమంతరావు పాల్గొన్నారు.



# బజార్ల అప్పు పుట్టని వ్యక్తిని నమ్ముకుంటే ఏం లాభం..?

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పులెత్తుకుపోయే దొంగ, ఆయనను ఎవరూ నమ్మడం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇది నామాట కాదు. రేవంత్ రెడ్డే చెప్పారు. నాకు బజార్ల అప్పు పుట్టడం లేదు. నన్ను ఎవరూ నమ్మడం లేదు. ఢిల్లీకిపోతే చెప్పులు ఎత్తుకుపోయే దొంగలా చూస్తున్నారు అని ఆయనే చెప్పారు. మరి అట్లాంటి చెప్పుల దొంగకు మున్సిపల్ ఎన్నికల్లో ఎందుకు ఓట్లేయాలి? బజార్ల అప్పు కూడా పుట్టని వ్యక్తిని నమ్ముకుని ఏం లాభం? నిధులు ఎక్కడి నుండి తీసుకొచ్చి అభివృద్ధి చేస్తారు..? అని ప్రశ్నించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను 6 గ్యారంటీలపై నిలదీయాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ నేతలు వస్తే 10 ఏళ్ల పాలనలో ప్రజలను దోచుకుతిన్నారు. ఎందుకు ఓటేయాలంటూ ప్రశ్నించాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు దుర్శేడ్, గోపాల్‌పూర్, సప్తగిరి కాలనీ ఉస్మానీ అసోసియేట్స్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 4,5, 44,45, 13వ డివిజన్ల బిజెపి అభ్యర్థులు భూపతి రవీందర్, చిందెం హారిక, బండి తార, గడప విజయలక్ష్మీ, రెడ్డవేణ లావణ్యలను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.



# మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిదే విజయం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధిస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో 'వికసిత తెలంగాణ బిజెపి సంకల్ప పత్రం 2026' పేరుతో రూపొందించిన మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రామచందర్ రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ అశోక్ పర్ణామి, రేఖా శర్మ, పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్, సీనియర్ నేతలు జి. వెంకట్ రెడ్డి, కప్పర ప్రసాద్, సి.హెచ్. విఠల్ పాల్గొన్నారు. అనంతరం రాంచందర్ రావు మాట్లాడుతూ 'కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ ఇవ్వలేదని సిఎం రేవంత్ రెడ్డి విమర్శిస్తున్నారు. కేంద్రం ఏ జిల్లాకు ఎంత ఇచ్చిందో మేము లెక్కలతో సహ చెబుతాం, రేవంత్ రెడ్డి తన మార్క్ ఏంటో చెప్పగలరా'? అని సవాల్ విసిరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను పార్టీ కార్యకర్తల్లా వాడుకుంటోందని విమర్శించారు. రామగుండం, మంచిర్యాల వంటి ప్రాంతాల్లో బిజెపి కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని, తప్పుడు కేసులు బనాయిస్తే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కేంద్రంలో బిజెపి సర్కార్ ఉన్న విషయాన్ని మర్చిపోవద్దని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు. ఇంటి పన్ను సహా ఎలాంటి మున్సిపల్ పన్నులను పెంచబోమని మేనిఫెస్టోలో తెలిపారు.

### హైబ్రిడ్ విత్తనాలతో ప్రభుత్వాలను

# శాసిస్తున్న బహుళ జాతి కంపెనీలు

### సాంప్రదాయ విత్తనాలతోనే వారికి చెక్ : కోదండరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బహుళ జాతి కంపెనీలు హైబ్రిడ్ విత్తన వ్యాపారంతో రాష్ట్ర ప్రభుత్వాలను శాసిస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.సాంప్రదాయ విత్తనాలతోనే వాటికి చెక్ పెట్టాలన్నారు. అంతరించి పోతున్న దేశీయ, సాంప్రదాయ విత్తనాలను కాపాడుకుంటూ,వాటి నిర్వహణను కంపెనీలు, కార్పొరేట్ల గుప్పిట్ల నుంచి రైతు అజమాయిషీ లోనికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా. కడ్తాల్ మండలం అన్మాసుపల్లిలోని 'ఎర్త్ సెంటర్'లో సెంటర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్‌సిజిఆర్ , భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ మూడు రోజుల పాటు నిర్వహిస్తోన్న 'తెలంగాణ ద్వితీయ వార్షిక విత్తన పండుగ'కు కోదండరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బహుళ జాతి కంపెనీలు దేశంలో వేల కోట్ల రూపాయలు సంపాదిస్తూ కూడా ఐటి, మార్కెట్ ఫీజు మినహాయింపు పొందుతున్నాయన్నారు. ప్రభుత్వం నిషేధించిన విత్తనాలను కూడా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాయన్నారు. కలుపు మందులు చాలా విష పూరితమని, అయినప్పటికీ ఎరువుల దుకాణాలలో దొరకడం శోచనీయమన్నారు.

మనకు వనరులు, అవకాశం ఉన్నప్పటికీ సాంప్రదాయ విత్తనాలను పండించడం లేదని, ఇప్పటికైనా మేల్కొనకపోతే వాతావరణ మార్పుల దుష్ప్రభావం, మరో వైపు బహుళ జాతి కంపెనీల చేతిలో ఇబ్బందుల తప్పవని కోదండరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిజిఆర్ ప్రెసిడెంట్ లీలా లక్ష్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్, ఆర్‌టిఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి,రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి ,ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, 'నాబార్డ్' చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ భాస్కర్,మాజీ ఎంపి గంగుల ప్రతాప్ రెడ్డి, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ కన్వీనర్ జాకోబ్, జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

### 'విక్షిత్ భారత్ శిక్షా అధిష్టాన్' (విబిఎస్ఎ) బిల్లు -2025ను

# వెంటనే ఉపసంహరించుకోవాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'విక్షిత్ భారత్ శిక్షా అధిష్టాన్' (విబిఎస్ఎ) బిల్లు 2025ను వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పుట్టలక్ష్మ ణ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ బిల్ ద్వారా ఉన్నత విద్య లౌకిక, శాస్త్రీయ స్వభావం దెబ్బతింటుందన్నారు. విబిఎస్ఎ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోకపోతే విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా హైదరాబాద్, హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ప్ల కార్డులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మ ణ్ మాట్లాడుతూ విబిఎస్ఎ బిల్లు ద్వారా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) వంటి సంస్థలను రద్దు చేసి, పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఒకే కమిషన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాలు, విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని నాశనం చేస్తుందని విమర్శించారు. విద్యను ప్రజాహిత సేవగా కాకుండా ప్రైవేట్ వస్తువుగా మార్చే 'నయా ఉదారవాద' విధానంలో భాగమన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను విద్యారంగంలో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో తమ భావజాలాన్ని బలవంతంగా రుద్దుతూ.. విద్యార్థుల మధ్యన చీలికలను తీసుకొస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. ఈ బిల్లును అమలు చేయడం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్‌లలో, సమాన అవకాశాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ బిల్లును వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, రాష్ట్ర సమితి సభ్యులు అన్వర్, సత్య, హరీష్, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శి ఉదయ్, లెనిన్, నాయకులు, రఘు, అనిల్, అరుణ్, సుశాంత్, భాను, అవినాష్, ఫహీమ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# కర్మన్‌ఘాట్‌లో మాంగళ్య షాపింగ్ మాల్

### ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన సినీ నటి శ్రీలీల





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో 2012లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఈ క్రమంలో హైదరాబాద్ నగరంలోని కర్మన్‌ఘాట్ ప్రాంతంలో మాంగళ్య షాపింగ్ మాల్ 28వ శాఖను ఘనంగా ప్రారంభించింది. శుక్రవారం జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి శ్రీలీల ముఖ్య అతిథిగా హాజరై, దీపప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, అక్కడి కలెక్షన్లను పరిశీలించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా రిబ్బన్ కటింగ్ అనంతరం నటి శ్రీలీల మాట్లాడుతూ "కర్మన్‌ఘాట్ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉందని, వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుంది" అని తెలిపారు. ఎల్ బి నగర్ శాసన సభ్యుడు సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభించినందుకు అభినందిస్తూ, దీని ద్వారా ఇక్కడ యువతీ యువకులకు ఉపాధి కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహమూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ "ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే తమ విజయ రహస్యం" అని తెలిపారు.

అలాగే, "తమ స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేస్తూ, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నాం" అని పేర్కొన్నారు.

**బిఆర్ఎస్ ఎమ్మెల్యేల 'అనర్హత'పై**

# 3 వారాల్లోగా తేల్చకుంటే...ఇక 'కోర్టు ధిక్కార చర్యే'

### తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు అల్టిమేటం

### రెండు కేసుల్లో నిర్ణయం తీసుకునే దశలో స్పీకర్ ఉన్నారని సీనియర్ న్యాయవాది సింఘ్వీ వెల్లడి

**న్యూఢిల్లీ :** తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం తుది హెచ్చరిక జారీ చేసింది. 10 మంది భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించడానికి సంబంధించిన మిగిలిన అనర్హత పిటిషన్లపై మూడు వారాల్లోగా నిర్ణయం తీసుకోనట్లయితే కోర్టు ధిక్కార చర్యలు ప్రారంభిస్తామని చెప్పింది. ఎమ్మెల్యేలు దాఖలు చేసిన ధిక్కార పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎ.జి. మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం విచారించిన సందర్భంగా ఈ విషయాన్ని స్పష్టంచేసింది. ఈ కేసులో స్పీకర్ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో జస్టిస్ కరోల్ మాట్లాడుతూ 'దీని గురించి మీరు రీల్స్ చేయవద్దని నేను మిమ్ములను అభ్యర్థిస్తున్నాను. అది మీరు చేయొద్దు. అది ఒక కొత్త ఇండస్ట్రీ'. ఏమి జరుగనుందో అది జరుగుతుంది' అని అన్నారు. అభిషేక్ సింగ్ మాట్లాడుతూ స్పీకర్ ఒక కేసులో నిర్ణయం తీసుకున్నారు.రెండు ఇతర కేసుల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునే దశలో ఉన్నారని సింఘ్వీ చెప్పారు. ఆలస్యానికి లాయర్ సమాధానం వివరిస్తూ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా అన్ని పెండింగ్ అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు మూడు వారాల గడువు కోరారు. భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) శాసనసభ్యుల తరపు న్యాయవాది మాట్లాడుతూ ఇంతకుముందు స్పీకర్‌ను సమయం అడిగినప్పటికీ దీనికి సంబంధించి కేవలం ఒక్క సమావేశం కూడా జరుపలేదన్నారు. మునుపటి విచారణలో స్పీకర్ మూడు వారాల సమయం కోరారని, ఏదైనా పరిణామాలు జరుగుతాయో లేదో చూడటానికి కోర్టు అతడికి రెండు వారాల సమయం ఇచ్చిందని జస్టిస్ కరోల్ చెప్పారు.' స్పీకర్ ఇప్పటికైనా సానుకూల నిర్ణయం తీసుకుంటాడని మేం భావిస్తున్నాం. ఆయన ఈ నిర్ణయం తీసుకునే విషయంలో మళ్లీ వైఫల్యం చెందితే కోర్టు ధిక్కార చర్యలు జారీచేయక తప్పదు' అని ధర్మాసనం తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌కు ఫిరాయించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై రెండు వారాలలో నిర్ణయాన్ని తెలియజేయాలని జనవరి 16న అత్యున్నత న్యాయస్థానం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌ను కోరింది. స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసేందుకు స్పీకర్‌కు రెండు వారాల గడువును ఇచ్చింది. 10మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలన్న తన ఆదేశాలను పాటించనందుకు గత ఏడాది నవంబరు 17న సుప్రీంకోర్టు కోర్టు ధిక్కార నోటీసును జారీచేసిన విషయం తెలిసిందే. గత ఏడాది జులై 31న సుప్రీంకోర్టు ఈ అంశంపై 3నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లపై స్పీకర్‌కు నోటీసులు జారీ చేస్తూ, గతంలో జారీచేసిన ఆదేశాలను పాటించకపోవడాన్ని అత్యున్నత న్యాయస్థానం 'అత్యంత దారుణమైన ధిక్కారం' అని వ్యాఖ్యానించింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి మరో 8 వారాల సమయం పొడిగించాలని కోరుతూ స్పీకర్ కార్యాలయం తరపున దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఒక నోటీసును కూడా జారీ చేసింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కె.టి.రామారావు, పాడి కౌశిక్ రెడి, వివేకానంద్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ల బ్యాచ్‌పై గతేడాది జులై 31న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నుంచి ఈ కోర్టు ధిక్కార పిటిషన్లు వచ్చాయి. రాజ్యాంగంలోని 10 వ షెడ్యూల్ ప్రకారం అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేటప్పుడు స్పీకర్ ఒక ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తారని, తద్వారా స్పీకర్ రాజ్యాంగ ఇమ్మ్యునిటీని అనుభవించే శక్తిని కలిగి ఉండరని కోర్టు పునరుద్ఘాటించింది. ఫిరాయింపు కారణాల వల్ల అనర్హత వేటు విధించే నిబంధనలను 10వ షెడ్యూల్ వివరిస్తుంది.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
అమీన్‌పూర్ సర్కిల్-47, శేరిలింగంపల్లి జోన్.

షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-03/GHMC/AMPR-C-47/2025-26, తేది: 05.02.2026

**NIT No. Engg-03/GHMC/AMPR-C-47/2025-26, తేది: 05.02.2026, పని పేరు:** నెం.1, సందర్భానుసారంగా ప్రాథమిక సౌకర్యాలను కల్పించడం. **అంచనా విలువ/ఇసివి:** రూ.4.00లక్షలు, **డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 06.02.2026న ఉ.10.30గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 09.02.2026న మ.3.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అమీన్‌పూర్ సర్కిల్-47. సెల్ నెం. 7337557234. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అమీన్‌పూర్ సర్కిల్-47, ఎస్‌ఎల్‌పి జోన్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 15044-PP/CL/ADVT/1/2025-26, Date: 06-02-2026



**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

HMDA Act. 2008లోని సెక్షన్ 15 (4) ప్రకారం బహిరంగ ప్రకటన

(G.O.Ms.No.249 MA&UD Dept., తేది: 19.11.2025)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (2008 నాటి చట్టం నెం.8)లోని సెక్షన్ 15లోని సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ, ప్రభుత్వం ఇందుమూలంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ (HMR) కోసం ఉద్దేశించిన MDP-2031లో భూ వినియోగానికి సంబంధించి, సదరు G.O.Ms.No.33 MA, తేదీ: 24.01.2013 ద్వారా ఆమోదించబడిన సెక్షన్ యొక్క సబ్-సెక్షన్ (1) ప్రకారం ఈ క్రింది మార్పును చేస్తుంది.
మేడ్చల్-మల్కాజిగిరి (జిల్లా), మేడ్చల్ (మండలం), రావల్‌కోల్ (గ్రామం)లోని సర్వే నెం.230/Pలో ఉన్న 4046.86 చదరపు మీటర్ల విస్తీర్ణంలో గల స్థలం, ప్రస్తుతం MDP-2031లో పెరి-అర్బన్ వినియోగ జోన్ కోసం కేటాయించబడింది, ఇది G.O.Ms.No.33, MA&UD, తేది:24.01.2013 ద్వారా నోటిఫై చేయబడింది. ఇప్పుడు 'వైట్' కేటగిరీ కింద బస్సుల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి తయారీ వినియోగ జోన్‌గా నియమించబడింది.
పై వివరాలు ఈ క్రింది వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయి
http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in//.

సం/- ప్లానింగ్ అధికారి (RC) HMDA

DIPR R.O. No. : 15068-PP/CL/ADVT/1/2025-26, Date: 06-02-2026



## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**ప్రజాపక్షం/దేవరకొండ:** రాష్ట్ర మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా దేవరకొండ పట్టణంలోని 18వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఉప్పల శ్రీనివాసులు గెలుపును ఆకాంక్షిస్తూ గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ, ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అభ్యర్థులు, మహిళలు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రియాశీలకంగా ఎన్నికల విధుల్లో అధికారులు




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : 2వ సాధారణ పురపాలక ఎన్నికలు 2026లో భాగంగా 11న జరిగే పోచంపల్లి మున్సిపాలిటీ ఎన్నికలలో విధుల్లో పాల్గొనే ఎన్నికల సిబ్బంది అధికారులు క్రియాశీలకంగా సమర్థవంతంగా పనిచేయాలని సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి పునరుద్ఘాటించారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఎల్ఈడి స్క్రీన్ ద్వారా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటరు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు సూచనలు అధికారులు అనుసరించవలసిన ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, రాపర్తి భాస్కర్ జోనల్ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి, ముగ్గురు వ్యక్తుల అరెస్ట్



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలంలోని వాసాలమర్రి గ్రామ శివారులో గల ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు తుర్కపల్లి పిఎస్ఎస్ఐ తక్యుద్దీన్ వారి సిబ్బందితో పేకాట స్థావరం పై దాడి చేసి ముగ్గురు నిందితులు, పెంజెర్ల రాజేందర్,(మేడ్చల్), దేవరి వేణు రాజ్(మేడ్చల్), కోరంపల్లి సతీష్ (కామారెడ్డి)లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. కాశిరెడ్డిపల్లీకి చెందిన మల్లేష్ అనే వ్యక్తి, లక్ష్మణ్ అను వ్యక్తి సహాయంతో వాసాలమర్రి గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రదేశంలో మరికొంత మంది పేకాట రాయుళ్ళతో పేకాటాని ఆర్గనైజ్ చేస్తున్నాడని, వారిని పట్టుకునే క్రమంలో కొంత మంది వ్యక్తులు సంఘటన స్థలం నుంచి పారిపోయారని, పట్టుబడిన వారివద్ద నుండి రూ.2,07,000 నగదు, మూడు కార్లు, రెండు సెట్‌ల పేక ముక్కలు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి అట్టి వ్యక్తులను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఎవరైనా పేకాట ఆడిన, ఆర్గనైజ్ చేసినా, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## విద్యుత్ షాక్‌తో రైతుకు గాయాలు



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం నల్లచలముల గ్రామ పంచాయతీకి చెందిన రైతు లింగాల వెంకటేశ్వర్లు తండ్రి లింగయ్య (58) ఉదయం తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ ఎర్త్ వైరు తగలడంతో షాక్ రావడంతో తీవ్ర గాయాలు కావడంతో రైతును దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం రైతు వ్యవసాయ పొలంలో బోరు మోటార్‌కు కరెంటు సరఫరా కావాటం లేదని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్ళి చూస్తుండగా ఒక్క సారిగా కరెంట్ వైర్లు రైతు చేతికి తగలడంతో తీవ్రగాయాలు అయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్త్ వైర్ లేకపోవడంతో ఈ ఘటన చోటు చేసుకుందని, విద్యుత్ అధికారులు స్పందించి వారి కుటుంబానికి సహాయం చేయాలని అన్నారు.

## కాంగ్రెస్ అంటే కబ్జాలు, కూల్చివేతలే

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కాంగ్రెస్ అంటే కబ్జాలు, కూల్చివేతలేనని బిఆర్ఎస్ అంటే అభివృద్ధి ప్రశాంత వాతావరణం అని ప్రజలే అంటున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గడపగడపకు గులాబీ దండు పేరుతో 16, 18 వార్డుల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆ పార్టీ నుండి కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న రంగినేని ఉపేందర్ రావు, సక్రు నాయక్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన గత రెండేండ్ల కాలంలో గుండాయిజం, గంజాయిజం పెరిగిందన్నారు. వాళ్ళకు ఓటేస్తే అవినీతి, దౌర్జన్యాలను పెంచిన పోషించినట్లేనని హెచ్చరించారు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, ప్రశాంతతకు కేరఫ్‌గా ఉన్న సూర్యాపేటలో నేడు అది కరువైందన్నారు. కెసిఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా ఏంచేశారని ప్రశ్నించారు. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు కాంగ్రెసోళ్ళు వార్డులు పంచుకున్నారని ఎద్దేవా చేశారు. అందుకే కాంగ్రెసోళ్ళకు ఓటు అనే ఆయుధంతో సరైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కెసిఆర్ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు, పార్టీ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, ఎన్నికల ఇంచార్జి ఇస్లావత్ రామచంద్రనాయ పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు దీటుగా నల్లగొండ అభివృద్ధి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 4,5, 21, 20, 41, 47,48 డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మంత్రి రోడ్ షో నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌ను సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తానని తెలిపారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం నల్గొండ మున్సిపల్ అభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదని ధ్వజమెత్తారు.కెసిఆర్ ప్రభుత్వం కుటుంబంలో పదవులు పంచుకున్నారే తప్ప ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు.ఈనెల 11న జరిగే నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో చెయ్యి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే డివిజన్లోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.అదేవిధంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం మద్దతు ప్రకటిస్తూ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,నాయకులు పి.వెంకటరావు,పి.అంజయ్య,ముండ్ల ముత్యాలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఎ హాఫిజ్ ఖాన్,మాజీ మున్సిపల్ చైర్మన్ బురి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, తిప్పర్తి మాజీ జడ్పిటిసి రామ్‌రెడ్డి, కార్పొరేటర్ల అభ్యర్థులు బోగరి వైష్ణవి, జ్ఞానేశ్వరి గణేష్, మహమ్మద్ ఇబ్రహీం, అల్లి సుభాష్, సాయిశ్రీ, వేణుగోపాల్ రెడ్డి, కవిత రమేష్ పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, బిజెపిలకు డిపాజిట్లు కూడా దక్కవు

ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట ఆలేరులో

మిత్రపక్షాలు క్లీన్ స్వీప్ చేస్తాయి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు పడ్డ కష్టాలకు చరమగీతం పాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనకే ప్రజలు పట్టం కడుతున్నారని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్లో ఆయన విపక్షాలపై నిప్పులు చెరిగారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో సిపిఐ, సిపిఎం మిత్రపక్షాలతో కలిసి కాంగ్రెస్ భారీ విజయం సాధించబోతోందని అయిలయ్య ప్రకటించారు. ఆలేరు మున్సిపాలిటీలో 12 వార్డులకు గాను 12 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. యాదగిరిగుట్టలో ఇప్పటికే 10వ వార్డును కాంగ్రెస్ కైవసం చేసుకుందని, మిగతా వార్డుల్లోనూ భారీ మెజారిటీ ఖాయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటికే 70 శాతం మంది ప్రజలు కాంగ్రెస్ వైపు నిలిచారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు లోపాయికారీ ఒప్పందాలతో ఏకమైనా వారికి డిపాజిట్లు కూడా రావని అయిలయ్య ఎద్దేవా చేశారు. 'ధనిక రాష్ట్రం అని చెప్పి పదేళ్లలో సన్న బియ్యం ఇవ్వలేదు, రేషన్ కార్డులు ఇవ్వలేదు, మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించలేదు. ప్రజలను దోచుకున్న బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారు' అని మండిపడ్డారు. యాదగిరిగుట్ట ఆలయ నిర్మాణం పేరుతో భారీగా కమిషన్లు నొక్కేశారని, అభివృద్ధి సాకుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జీవనోపాధిని దెబ్బతీశారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మహిళల ఆత్మగౌరవం పెరిగిందని, ఆటో కార్మికులకు జీవనోపాధి లభించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణంలో 220 ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేయగా, ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. యాదగిరిగుట్ట రింగ్ రోడ్డు విస్తరణలో ఒకటో వార్డులో ఇళ్లు కోల్పోయిన 74 మంది బాధితులకు త్వరలోనే పట్టా సర్టిఫికెట్లు అందిస్తామని వెల్లడించారు.'అధికారంలో లేని మీరు ప్రజలకు ఏం చేయగలరు? అభివృద్ధిని జీర్ణించుకోలేక విమర్శలు చేయడం మానేసి, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా సూచనలు ఇవ్వండి' అని బీఆర్ఎస్ నేతలకు అయిలయ్య హితవు పలికారు. ప్రజలకు అన్యాయం చేసిన వారికి ఓట్లు అడిగే నైతిక అర్హత లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య, బొలగాని సత్యనారాయణ, సత్యం గౌడ్, బంధారపు బిక్షపతి, కళ్లెం కృష్ణ, భరత్ గౌడ్, హేమేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అవినీతికి చరమగీతం

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

మోత్కూరు, తిరుమలగిరి గడ్డపై ఎగిరేది కాంగ్రెస్ జెండానే..

కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని గెలిపించాలి



**ప్రజాపక్షం/మోత్కూరు** : రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అవినీతి పాలనకు ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 11న జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటడం ఖాయమని, తిరుమలగిరి, మోత్కూరు మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరడం చారిత్రక అవసరమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని మోత్కూరు, తిరుమలగిరి మున్సిపాలిటీల్లో నిర్వహించిన ఎన్నికల రివ్యూ సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్, ఎన్నికల ఇంచార్జి బొజ్జు సంధ్య రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎంపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఇందిరమ్మ స్ఫూర్తితో తెలంగాణలో సాగుతున్న ప్రజా పాలనను ప్రజలు మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నారని, ఆరు గ్యారంటీల అమలు తీరు పార్టీ గెలుపుకు సోపానమన్నారు. టిక్కెట్లు దక్కని నాయకులు నిరాశకు గురికావద్దని, పార్టీ నిర్ణయానికి కట్టుబడి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు. వారికి భవిష్యత్తులో పార్టీ పదవుల్లో, అభివృద్ధి పనుల్లో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, అందరూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగి మున్సిపాలిటీలను కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని ఎండగడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు.

## సిఎంఆర్ లక్ష్యాలు పెండింగ్ ఉండొద్దు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కష్టం మిల్లింగ్ రైస్ ( సిఎంఆర్) ఈనెల 28 లోగా చెల్లించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ రైస్ మిల్లర్లను ఆదేశించారు.శుక్రవారం ఆయన తన చాంబర్లో 2024/25 సి ఎం ఆర్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.2024/25 కు సంబంధించిన సిఎంఆర్ లక్ష్యాలను ఎలాంటి పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. 2025/26 రబీ సీజన్ దృష్ట్యా మిల్లర్లు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని, గన్ని బ్యాగులను కార్పొరేషన్‌కు అప్పగించాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి టి.వెంకటేష్,పౌరసరఫరాల డిఎం .బి రామ్ పత్రి, నల్లగొండ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ ,శ్రీనివాస్,భద్రాద్రి ఇంద్రారెడ్డి మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ గౌరు వెంకటేశ్వర్లు,బాబి, తదితరులు హాజరయ్యారు.

## వీరయ్య మరణం సిపిఐకి తీరని లోటు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** చిట్టిగల్ల వీరయ్య మరణం సిపిఐకి తీరని లోటనీ సిపిఐ మోటకొండూరు మండల కార్యవర్గ సభ్యులు పసుల నరసింహ అన్నారు. మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సీనియర్ నాయకులు చిట్టిగల్ల వీరయ్య గత రెండు నెలల నుండి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం 8 గంటలకు తన ఇంటిలో తుది శ్వాస విడిచారు. వీరయ్య మృతదేహానికి సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పసుల నరసింహ, మంచాల రాధమ్మ, బోడిగే సుదర్శన్‌తో కలసి ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు గ్రామ శాఖ కార్యదర్శి పసుల నర్సింహ, మండల సహాయ కార్యదర్శి బొడిగే సుదర్శన్, మహిళా విభాగం మండల కార్యదర్శి, 2వ వార్డు మెంబర్ మంచాల రాధమ్మ, హమాలి సంఘం గ్రామ ఉప అధ్యక్షుడు చిట్టిగల్ల వెంకన్న, సభ్యులు సంగపాక శివమ్మ, అడేపు చంద్రమ్మ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మున్సిపల్ ఎన్నికల విధులకు నియమించబడిన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ కోరారు. ఇందుకుగాను అన్ని మున్సిపాలిటీల లో ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.మునిసిపల్ ఎన్నికల పై శుక్రవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 7,8 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉంటుందని అందువలన ఎన్నికల విధులలో నియమితులైన ఉద్యోగులందరూ ఫామ్ 12 సమర్పించాలని కోరారు.ఓటరు చీటీల పంపిణీలో భాగంగా అన్ని మున్సిపాలిటీలలో 54 చీటీలను పంపిణీ పంపిణీ చేయాలన్నారు.ఈ నెల 13న నిర్వహించే ఓట్ల లెక్కింపుకు కౌంటింగ్ కేంద్రాలలో సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని,కౌంటింగ్ కేంద్రాల వద్ద బారికేడింగ్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే మీడియా కేంద్రం ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ కేంద్రంలో వినియోగించే , కౌంటింగ్ ఏజెంట్ల నియామకం వంటివి ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, నల్లగొండ ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి ,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ,చండూర్ ఆర్‌డిఓలు, మున్సిపల్ కమిషనర్లు మాట్లాడారు.

**ఓట్ల లెక్కింపు సిబ్బంది ర్యాండమైజేషన్**

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సిబ్బంది ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా ఎన్నికల పరిశీలకులు,రాష్ట్ర ఎస్‌సిఈఆర్‌టి డైరెక్టర్ జి.రమేష్ సమక్షంలో జిల్లా కలెక్టర్ జి.చంద్రశేఖర్ ఛాంబర్‌లో నిర్వహించడం జరిగింది.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్,నందికొండ, చండూరు, చిట్యాల, దేవరకొండ, హాలియా, మిర్యాలగూడ మున్సిపాలిటీలలోని 162 వార్డులకు,475 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 20 శాతం రిజర్వ్ తో కలుపుకొని 270 మంది కౌంటింగ్ స్టాఫ్,540 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు ,మొత్తం 810 మంది సిబ్బందికి సంబంధించిన ర్యాండమైజేషన్ ను నిర్వహించడం జరిగింది.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో 56 కౌంటింగ్ టేంటింగ్,16 ఆర్‌ఓ మొత్తం 72 ,నందికొండ మున్సిపాలిటీకి సంబంధించి 12 ఓట్ల లెక్కింపు ,4ఆర్ ఓ ,చండూరు మున్సిపాలిటీకి సంబంధించి 10 కౌంటింగ్ టేంటింగ్, 4 ఆర్ ఓ ,చిట్యాల మున్సిపాలిటీలో 12 కౌంటింగ్ టేంటింగ్ లు, 4ఆర్ ఓ ,దేవరకొండ మున్సిపాలిటీలో 20 కౌంటింగ్ టేంటింగ్ లు ,7ఆర్ వో టే లు ,హాలియా మున్సిపాలిటీలో 12 కౌంటింగ్ టేంటింగ్ లు ,4ఆర్‌ఓ , మిర్యాలగూడ మున్సిపాలిటీకి సంబంధించి 49 కౌంటింగ్ టేంటింగ్ లు ,16 ఆర్ ఓలను ఏర్పాటు చేయనున్నారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి ,ఈడీఎం దుర్గారావు, జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్, ఎన్నికల డిటి విజయ్, తదితరులు ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**18 గుర్తింపు కార్డులలో ఏదో ఒక కార్డును గుర్తింపుగా చూయించాలి**

ఈ నెల 11న నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు, జిల్లాలోని మున్సిపాలిటీలకు జరుగనున్న మునిసిపల్ ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఎన్నికల సంఘం అనుమతించిన 18 గుర్తింపు కార్డులలో ఏదో ఒక కార్డును గుర్తింపుగా చూయించి ఓటు హక్కును వినియోగించుకో వచ్చని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ తెలిపారు.ఆధార్ కార్డ్,పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు,పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు తమ ఉద్యోగులకు జారీ చేసిన ఫోటో ఉన్న సర్వీస్ గుర్తింపు కార్డు, ప్రభుత్వ రంగ బ్యాంకులు ఫోటో ఉన్న గుర్తింపు కార్డు, ఫోటోఉన్న రేషన్ కార్డును పోలింగ్ కేంద్రంలో చూపించి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హాలియా:** కాంగ్రెస్ పార్టీతోనే హాలియా మున్సిపాలిటీ అభివృద్ధి జరుగుతుందని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం ఆయా వార్డుల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఏడవ వార్డులో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న చింతల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ జన సందోహం నడుమ ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి ప్రచారం హోరెత్తింది. చింతల చంద్రారెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం శ్రమిస్తారని మా పార్టీ తరఫున పోటీ చేసిన ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని స్థానికులకు వివరించారు. హాలియా మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. చంద్రారెడ్డి నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తారని చెప్పారు. అలాంటి అభ్యర్థిని ఏడో వార్డు ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఏడవ వార్డు అభ్యర్థి చింతల చంద్రారెడ్డి, చింతల దీప్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, ఆరో వార్డు అభ్యర్థి బొంగరాల యేసు రాజు, వెంపటి శ్రీనివాస్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజాన్ని మార్చేది విద్యార్థులే

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పుస్తకం చదివే విద్యార్థులకే రేపటి సమాజాన్ని మార్చే శక్తి ఉందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ అన్నారు. శుక్రవారం నల్లగొండ మండలంలోని దోమలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పి ఆర్ ఆర్ ఫౌండేషన్ రూపొందించబడిన మెరిట్ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి ఎస్‌పి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజాన్ని మార్చే శక్తి విద్యకే ఉందని అన్నారు. ప్రతిభకు గుర్తింపు లభించినప్పుడే విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. లక్ష్యాన్ని చేరుకోవాలంటే పట్టుదల దృఢ సంకల్పం తప్పనిసరి అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చలం పాండురంగారావు ను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి, రూరల్ ఎస్ఐ సైదా బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ విద్యార్థులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎల్లప్పుడూ ప్రజల పక్షమే

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలపక్షాన నిలిచిన పార్టీ అని, ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం 7వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం, మౌళిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ సౌకర్యాల విస్తరణ వంటి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని చెప్పారు. రానున్న రోజుల్లో పట్టణ అభివృద్ధి మరింత వేగంగా సాగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. 7వ వార్డు అభ్యర్థి పెద్దమామ శ్రీరాములును ఆదరించి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు.



# మా ప్రశ్నలకు జవాబిచ్చేందుకు మోదీకి ధైర్యం లేదు

ప్రభుత్వం సభను ప్రజాస్వామ్య పద్ధతిలో నడపాలనుకోవడం లేదు

అబద్ధాలను పదే పదే చెప్పడం మోదీ పని

ప్రధానిపై విరుచుకుపడిన మల్లికార్జున ఖర్గే



**న్యూఢిల్లీ:** రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధానికి తమ ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేదని, ప్రభుత్వం సభను ప్రజాస్వామ్య పద్ధతిలో నడపాలనుకోవడం లేదని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఖర్గే విలేకరులతో మాట్లాడుతూ 'అబద్ధాలను పదే పదే చెప్పడం' మోదీ పని అని, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు తన 97 నిమిషాల సుదీర్ఘ సమాధానంలో ఆయన ముఖ్యమైన లేదా అవసరమైన విషయం ఏదీ చెప్పలేదని అన్నారు. 'మేము రాష్ట్రపతి ప్రసంగంపై సవరణలు సూచించగా, ప్రధానమంత్రి ఒక్క పాయింట్‌కు కూడా స్పందించలేదు. ఆయన కేవలం 100 సంవత్సరాలు... 75 సంవత్సరాలు... 50 సంవత్సరాల గురించి మాట్లాడుతూనే ఉన్నారు' అని ఖర్గే అన్నారు. 'మాకు నరవణే పుస్తకం దొరికినప్పుడు, అధికారంలో ఉన్నవారికి అది ఎలా దొరకకుండా ఉంటుంది? ఆ పుస్తకం ఇంకా ప్రచురించబడలేదని వారు పార్లమెంటులో చెబుతున్నారు. అది అమిత్ షా అయినా, రాజ్‌నాథ్ సింగ్ అయినా... అందరూ ఆ పుస్తకం లేదని పదే పదే చెబుతూనే ఉన్నారు, కానీ వాస్తవం ఏమిటంటే ఆ పుస్తకం ఉంది' అని కాంగ్రెస్ అధినేత అన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంటులో నరవణే పుస్తకం గురించి మాట్లాడినప్పుడు, ఏదో కారణం చేత అధికార పక్షం మొత్తం అభ్యంతరానికి గురైందని ఆయన అన్నారు. అయితే ముందుగా, సత్యాన్ని వినండి, ఆపై సమాధానం చెప్పండి అని తాను వారికి చెప్పాలనుకంటున్నానన్నారు. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం నరేంద్ర మోదీకి లేదన్నదే నిజం అని ఖర్గే ఉద్ఘాటించారు. తాము సిక్కులను అవమానించామని మోదీ అన్నారు. అంటే, సభ వెలుపల ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సంభాషణను సిక్కులకు అవమానంగా చిత్రీకరించారు అని మండిపడ్డారు. 'కాంగ్రెస్ పార్టీ సిక్కులను ఎంతో గౌరవిస్తుంది; కాంగ్రెస్ ప్రభుత్వంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా, ఆ తర్వాత ప్రధానమంత్రిగా పని చేశారు, కానీ నరేంద్ర మోదీ సిక్కులను, దళితులను, ఆదివాసీలను ఎవరినీ గౌరవించరు. ఇతరులను ఎలా కించపరచాలనేదే నరేంద్ర మోదీ మనసులో ఉన్న ఏకైక విషయం' అని ఆయన ఆరోపించారు. ఆధునిక భారతదేశ నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ రంగాన్ని స్థాపించారు, కానీ మోదీ వాటిని దివాలా తీసే కర్మాగారాలు అని పిలుస్తున్నారని, నెహ్రూపై ప్రధాని చేసిన విమర్శలను ఖండిస్తూ ఆయన అన్నారు. 'దేశంలో ఒక్క గడియారం కూడా తయారుకాని రోజుల్లో, ప్రభుత్వ రంగమే ముందుకు వచ్చింది, కానీ ప్రభుత్వ రంగాన్ని కాపాడటానికి బదులుగా, నరేంద్ర మోదీ దానిని నిర్వీర్యం చేయడానికి పని చేశారు. నరేంద్ర మోదీకి ఎటువంటి సిద్ధాంతం లేదు. దేశాన్ని నడిపించడానికి ఆయనకు ఎటువంటి దార్శనికత లేదు' అని ఖర్గే ఆరోపించారు. ఈ ప్రకటనలు మోదీ మనోధైర్యం దెబ్బతిందని, ఆయనలో మునుపటి ఉత్సాహం తగ్గిపోయిందని చూపిస్తున్నాయని ఖర్గే పేర్కొన్నారు. ప్రధాన మంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ప్రజాస్వామ్యానికి, దేశానికి వ్యతిరేకంగా దుర్భాషలు వాడితే అది మంచిది కాదు. రాహుల్ (గాంధీ) జీ ఎలాంటి ప్రశ్నలు అడుగుతారో, ఏం చెబుతారో, ఎలాంటి వాస్తవాలు బయటపెడతారో అని నరేంద్ర మోదీ భయపడుతున్నారు, అందుకే మోదీ జీ సభలో కూర్చోవడం కూడా లేదు అని ఆయన అన్నారు. 'మాకు నిఘా సమాచారం అందింది, అందుకే రాష్ట్రపతి ప్రసంగానికి లోక్‌సభలో సమాధానం ఇవ్వవద్దని మోదీ జీకి సలహా ఇచ్చామని స్పీకర్ చెబుతున్నారు. మీ నిఘా వ్యవస్థ అంత పటిష్టంగా ఉంటే, పుల్వామా వంటి ఉగ్రవాద దాడుల సమయంలో అది ఎక్కడికి వెళ్లింది? దేశవ్యాప్తంగా మూకదాడులు జరుగుతున్నాయి, ఆదివాసీలు, దళితులపై దాడులు జరుగుతున్నాయి. అప్పుడు ఈ నిఘా సమాచారం ఎక్కడికి పోతుంది?' అని ఖర్గే ప్రశ్నించారు. ఒకేసారి ఐదు రోజుల పాటు పార్లమెంటును స్తంభింపజేయడం ప్రజాస్వామ్య వైఫల్యమని, లోక్‌సభలో ప్రతిష్టంభనకు ప్రభుత్వమే కారణమని ఆయన ఆరోపించారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో సభను నడపడానికి కూడా ఇష్టపడటం లేదని ఆరోపించారు. గత కొన్ని రోజులుగా నరేంద్ర మోదీ కలత చెందుతున్నారు. ఎందుకంటే ఆయనకు సంబంధించిన విషయాలు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బయటపడ్డాయని, ఆ తర్వాత, నరేంద్ర మోదీ ట్రంప్ ముందు లొంగిపోయి వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆయన దేశ రైతులను బలిపశువులను చేశారని ఖర్గే ధ్వజమెత్తారు. మోదీ మన ప్రజలను పేదలను చేస్తూ, అమెరికా రైతులకు సంపదను పెంచుతున్నారని ఖర్గే ఆరోపించారు. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో అంతరాయాలు సృష్టించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ భారత రాష్ట్రపతిని అవమానించిందని ప్రధాని మోదీ ఆరోపించిన ఒక రోజు తర్వాత ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు.

# వృద్ధ మహిళ డిజిటల్ అరెస్ట్..

## రూ. 4.62 కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్లు

**ముంబయి :** దేశ ఆర్థిక రాజధాని ముంబయి మరో డిజిటల్ అరెస్టు స్కామ్ వెలుగు చూసింది. సైబర్ నేరగాళ్ల వలలో పడ్డ 74 ఏళ్ల మహిళ సుమారు 4.62 కోట్లు కోల్పోయింది. బాంబే ఐఐటిలో మెడికల్ ఆఫీసర్‌గా చేసి ఆమె రిటైరైంది. మనీల్యాండరింగ్ కేసులో ఉన్నావని, సిబిఐ అరెస్టు చేస్తుందని ఆమెను బెదిరించినట్లు పోలీసులు వెల్లడించారు. వృద్ధ మహిళను మోసం చేసిన కేసులో నరేంద్ర సిన్హా, గుంజన్ దేవ్‌కుమార్ దినేశ్‌చంద్రను ముంబై వెస్ట్రన్ రీజియన్ సైబర్ సెల్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ నేరగాళ్లకు ఆ మహిళ బ్యాంక్ అకౌంట్లను అందజేసినట్లు ఆ ఇద్దరిపై ఆరోపణలు ఉన్నాయి. బాధిత వృద్ధ మహిళకు తొలుత ఓ వ్యక్తి నుంచి వీడియో కాల్ వచ్చింది. టెలికాశం శాఖ అధికారి అని ఆ వ్యక్తి ఫోన్ చేశాడు. మరో వ్యక్తి ఐపిఎస్ ఆఫీసర్ అని బెదిరించాడు. ఆధార్ కార్డు నెంబర్ ఆధారంగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి 6 కోట్లు కాజేశారని ఆ మహిళను బెదిరించారు. ఇది మనీల్యాండరింగ్ కేసు కిందకు వస్తుందని హెచ్చరించారు. సిబిఐ కేసు నమోదు చేసిందని, త్వరలో అరెస్టు చేస్తారని ఆ వృద్ధురాలిని బెదిరించారు. సైబర్ క్రిమినల్స్ వత్తిళ్లకు భయపడ్డ ఆ మహిళ తన ఎఫ్‌డి, రికరింగ్ డిపాజిట్లను విత్‌డ్రా చేసుకున్నది. సుమారు 4.62 కోట్ల ఎఫ్‌డిలను ఆమె తన ఖాతా నుంచి 2025 అక్టోబర్ నుంచి 2026 జనవరి మధ్య విత్‌డ్రా చేసుకున్నది. ఆ డబ్బును సైబర్ క్రిమినల్స్‌కు ట్రాన్స్‌ఫర్ చేసింది. చీటింగ్ జరిగినట్లు గుర్తించిన ఆ మహిళ తుదకు పోలీసుల్ని ఆశ్రయించింది. ఐటి చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. డబ్బు ట్రాన్స్‌ఫర్ కోసం సిన్హా, దినేశ్‌చంద్రలు పలు అకౌంట్లు ఓపెన్ చేశారు. ఆ డబ్బును సైబర్ క్రిమినల్స్‌కు ఇచ్చి కమీషన్ తీసుకున్నారు.

## జలంధర్ గురుద్వారా వద్ద ఆమ్ ఆద్మీ నేత కాల్చివేత

**న్యూఢిల్లీ :** జలంధర్: ఆమ్ ఆద్మీ పార్టీ నేత లక్కీ ఒబ్రాయ్‌ని హత్య చేశారు. జలంధర్ సిటీలోని మోడల్ టౌన్ లొకాలిటీలో ఉన్న గురుద్వారా వద్ద ఈ ఘటన జరిగింది. గన్‌తో కాల్చి చంపారు. లక్కీ ఒబ్రాయ్‌ని ఫోర్టిస్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తీవ్ర గాయాలు కావడంతో అతను ప్రాణాలు విడిచాడు. గురుద్వారకు రోజువారిలాగానే అతను తన థార్ వాహనంలో చేరుకున్నాడు. వాహనాన్ని పార్క్ చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై కాల్పులు జరిపారు. ఇద్దరు వ్యక్తులు టూవీలర్‌పై వచ్చినట్లు,గురుద్వారాకు ఒబ్రాయ్ రోటీన్‌గా విజిట్ చేస్తుంటారని జలంధర్ కం టోన్మెంట్ ఇంఛార్జీ తియారా తెలిపారు. అతనిక కదలికలు తెలిసిన వ్యక్తులే దాడికి ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

# బొగ్గుగనిలో పేలుడు... ఇద్దరు అరెస్టు

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఎం సంగ్మా హామీ



**షిల్లాంగ్ :** మేఘాలయలో అక్రమ బొగ్గు గనిలో జరిగిన పేలుడులో 18 మంది మరణించిన విషయం విధితమే. అయితే ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. బాధ్యులైన వారిపై తన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి కాన్రాడ్ కె సంగ్మా స్పష్టం చేశారు. ఇద్దరి అరెస్టులతో పాటు, ఈ ఘటనకు సంబంధించి మూడవ వ్యక్తిని కూడా గుర్తించామని, తదుపరి దర్యాప్తు జరుగుతోందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఐ నోంగ్రాంగ్ తెలిపారు. గురువారం తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలోని మారుమూల థాంగ్‌స్కు ప్రాంతంలో ఉన్న అక్రమ గనిలో జరిగిన పేలుడులో 18 మంది మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. గాయపడిన ఎనిమిది మంది గని కార్మికులలో ఏడుగురిని గుర్తించినట్లు మరో పోలీసు అధికారి తెలిపారు. వారిలో నలుగురు నేపాల్‌కు చెందినవారు, ఇద్దరు అసోంకు చెందినవారు, ఒకరు స్థానికుడు అని ఆయన చెప్పారు. వీరందరూ షిల్లాంగ్‌లోని ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని ఆయన తెలిపారు. మృతులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని ఆ అధికారి పిటిఐకి తెలిపారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి ఇద్దరు క్యాబినెట్ మంత్రులను సంఘటనా స్థలాన్ని సందర్శించి, అధికారులను కలిసి సహాయక చర్యలు, సహాయక కార్యక్రమాలు, శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌తో సహా సీనియర్ పోలీసు అధికారులు, గనుల శాఖ అధికారులు ఇప్పటికే సంఘటనా స్థలంలో ఉన్నారని ఆయన చెప్పారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు సంగ్మా తెలిపారు. అక్రమ మైనింగ్ కార్యకలాపాలను సహించేది లేదని హెచ్చరించారు. శాస్త్రీయ మైనింగ్ ప్రారంభం కావడంతో, గని కార్మికులు చట్టబద్ధమైన మైనింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటారని భావిస్తున్నామని, ఇప్పుడు ఆ అవకాశం అందుబాటులో ఉందని, ఇలాంటి సంఘటనలు జరగడానికి అనుమతించబోమని ఆయన అన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ. 3 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మరింత మంది చిక్కుకుని ఉంటారనే భయాల మధ్య, బహుళ ఏజెన్సీలను రంగంలోకి దించి శుక్రవారం ఉదయం 9.55 గంటలకు గాలింపు, సహాయక చర్యలు తిరిగి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) నుండి రెండు బృందాలు, ఒక ప్రత్యేక రెస్క్యూ టీమ్ (ఎస్‌ఆర్‌టి) మరియు జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్) నుండి మూడు బృందాలను సంఘటనా స్థలంలో మోహరించినట్లు ఒక అధికారి తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రాణనష్టంపై విచారం వ్యక్తం చేశారు, మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ దుర్ఘటనతో తాను తీవ్రంగా కలత చెందానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంగమాతో మాట్లాడి, కొనసాగుతున్న సహాయక చర్యలకు కేంద్రం నుండి అన్ని విధాలా మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై మీడియా నివేదికలను మేఘాలయ హైకోర్టు సుమోటోగా స్వీకరించి, అక్రమ మైనింగ్‌లో పాలుపంచుకున్న గనుల యజమానులు, నిర్వాహకులను గుర్తించి అరెస్టు చేయాలని తూర్పు జైంతియా హిల్స్ డిప్యూటీ కమిషనర్ మరియు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసులను ఆదేశించింది. తీసుకున్న చర్యల వివరాలతో ఇద్దరు అధికారులను వ్యక్తిగతంగా హాజరు కావాలని కూడా కోర్టు ఆదేశించింది.

## ఇష్టం లేకుండా ఏ మహిళనూ..

# గర్భం కొనసాగించాలని బలవంతపెట్టలేం

● సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు ● మైనర్‌గా ఉన్నప్పుడు గర్భవతైన అమ్మాయి 30వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించేందుకు అనుమతి ● ఆమె కేసులో గర్భవిచ్ఛిత్తికి నిరాకరించిన బాంబే హైకోర్టు ఆదేశాలను పక్కనపెట్టిన 'సుప్రీం'



**న్యూఢిల్లీ :** అవాంఛిత గర్భధారణకు సంబంధించి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇష్టం లేకుండా ఏ మహిళనూ గర్భం కొనసాగించమని కోర్టులు 'బలవంతం చేయలేవు' అని స్పష్టం చేసింది. 17ఏళ్ల వయసులో మైనర్‌గా ఉన్నప్పుడు గర్భవతి అయిన ఒక అమ్మాయి 30వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించేందుకు అనుమతిని ఇస్తూ సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ అమ్మాయి పొరుగున ఉన్న ఒక అబ్బాయితో రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడు గర్భవతి అయిందని, ఆమె తన గర్భాన్ని వైద్యపరంగా తొలగించాలని కోరిందని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం తెలిపింది. అవసరమైన అన్ని వైద్యపరమైన సురక్షిత చర్యలు చేపట్టిన కారణంగా వైద్యపరంగా ఆ మైనర్ గర్భాన్ని తొలగించాలని ధర్మాసనం ముంబయి జె.జె.హాస్పిటల్‌ను కోరింది. గర్భధారణను కొనసాగించే హక్కు మైనర్ బిడ్డకు ఉందనే వాస్తవాన్ని కోర్టు పరిగణనలోనికి తీసుకుందని, ఆమె కూడా మైనర్ అయినందువల్ల తలెత్తే దురదృష్టకర పరిస్థితి కారణంగా గర్భధారణను ఎదుర్కొంటున్నందున ఇది 'చట్టవిరుద్ధం' అని ధర్మాసనం గమనించింది. ఆ సంబంధం ఇద్దరి మధ్యా ఏకాభిప్రాయంతో జరిగిందా? లేదా వేధింపుల ఫలితంగా జరిగిందా ? అనేది సమస్య కాదని ధర్మాసనం తెలిపింది. బిడ్డ ప్రాణాలకు ఎలాంటి ముప్పులేదని, పూర్తి కాలం అనంతరం తల్లి ప్రసవానికి అనుమతి ఉందని హాస్పిటల్ మెడికల్ బోర్డు ఇచ్చిన నివేదికను అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోనికి తీసుకుంది. తల్లి ఆసక్తిని గమనించాలంటే ఆమె పునరుత్పత్తి స్వయం ప్రతిపత్తికి తగినంత ప్రాధాన్యత ఇవ్వాలని, కోర్టు ఏ స్త్రీని, మైనర్ బిడ్డను కూడా ఆమె ఉద్దేశం లేకపోతే గర్భధారణను పూర్తి చేయమని బలవంతం చేయదని ధర్మాసనం స్పష్టీకరించింది. ఆమె కేసులో గర్భవిచ్ఛిత్తికి నిరాకరిస్తూ బాంబే హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలను 'సుప్రీం' ధర్మాసనం పక్కనపెట్టింది. 'ఇక్కడ మరొక ప్రశ్న తలెత్తుతోంది. ఒకవేళ ఆమె గర్భాన్ని 24వారాలకు తొలగించగలిగితే, 30 వారాలకు ఎందుకు సాధ్యం కాదు? చివరికి ఆమె గర్భాన్ని కొనసాగించాలనుకోవడంలేదు. దీని సారాంశం ఏమిటంటే ఆమె ప్రసవం కోరుకోవడం లేదు. అదే కష్టం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కొన్నిసార్లు గర్భధారణను ముగించాలా ? వద్దా? అని నిర్ణయించుకోవడానికి సమయం పడుతుందని ధర్మాసనం జోడించింది. 'మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటిపి)చట్టం (1971) ప్రకారం నిర్దేశించిన దాని కంటే మించి గర్భస్రావం జరిగే సందర్భాలు చాలానే ఉన్నాయి. మేము అలా చేయమని వైద్యులు అంటున్నారు. అలాంటి వ్యక్తులు ఎక్కడకు వెళతారు?. నకిలీ వైద్యుల వద్దకు , అనధికార వైద్యుల వద్దకు వెళతారు. అది చాలా ప్రమాదకరం' అని ధర్మాసనం తెలిపింది. ఆసుపత్రి ప్రయోజనం కోసం ఆపరేటింగ్ పార్ట్ విడుదలకు సంబంధించిన వివరణాత్మక ఉత్తర్వులు వెలువడతాయని సుప్రీంకోర్టు తెలిపింది.

# మణిపూర్ చురచందపూర్‌లో బంద్

స్తంభించిన జనజీవనం, విద్యాసంస్థలు మూసివేత

ప్రభుత్వం ఏర్పాటులో కుకీ-జో వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు పాల్గొనడంపై నిరసనలు



**చురాచంద్‌పూర్/ఇంఫాల్:** చాలా కాలంగా కల్లోలితంగా ఉన్న మణిపూర్‌లో గత మూడు రో జుల క్రితంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటులో కుకీజో వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు పాల్గొనడాన్ని నిరసిస్తూ రెండు గిరిజన సంస్థలు కుకీ జో ఆధిపత్య ం ఉన్న చురాచంద్‌పూర్ జిల్లాలో సంపూర్ణ బం ద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో జిల్లాలో జనజీవ నం స్తంభించిపోయినట్లు అధికారులు తెలిపా రు. శుక్రవారం ఉదయం బంద్‌కు మద్దతు తెలిపిన వారు కర్రలు కట్టుకుని జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రాంతాల్లో వాహనాలను అడ్డుకున్నారు. మార్కెట్లు మూసివేశారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా హాజరు తక్కువ గా ఉందని వారు తెలిపారు. కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ చురాచందపూర్ యూనిట్ శుక్రవా రం అర్ధరాత్రి నుండి జిల్లాలో 24 గంటల సం పూర్ణ బంద్‌కు పిలుపునివ్వగా, మరో సంస్థ జాయింట్ ఫోరమ్ ఆఫ్ సెవెన్ (జెఎఫ్7) కుకీజో ప్రాంతాలలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు బంద్‌కు పిలుపునిచ్చింది. జిల్లా కేంద్రంలోని తుయిబాంగ్ ప్రాంతంలో బంద్ ప్రభావం మరింత స్పష్టంగా కనిపించింది. జిల్లాలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని, జిల్లా కేంద్రంలోని కీలక ప్రాంతాల్లో అదనపు భద్రతా బలగాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటులో కుకీజో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం మధ్యాహ్నం భారీ బహిరంగ ర్యాలీని నిర్వహిస్తామని కుకీ ఉమెన్ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ కూడా ప్రకటించింది. ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటులో కుకీజో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని చేర్చే ఏ చర్యకైనా తమ తీవ్ర వ్యతిరేకతను తెలియజేయడమే ఈ నిరసన యొక్క లక్ష్యమని పేర్కొంది.తాము ఆమోదయోగ్యం కానివిగా భావించే రాజకీయ పరిణామాలపై కుకీ మహిళల సామూహిక వైఖరిని తెలియజేయడమే ఈ ర్యాలీ ఉద్దేశమని అది తెలిపింది. గురువారం సాయంత్రం, తుయిబాంగ్ అటవీ గేటు సమీపంలో ఒక గుంపుకు, భద్రతా బలగాలకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. రాళ్లు రువ్విన గుంపును చెదరగొట్టడానికి భద్రతా బలగాలు లాఠీచార్జ్ చేసి, బాష్పవాయు గోళాలను ప్రయోగించాయి. ఈ ఘర్షణలు శుక్రవారం ఉదయం 3 గంటల వరకు కొనసాగాయని, ఈ ఘటనలో ఇద్దరు ప్రదర్శనకారులకు గాయాలయ్యాయని అధికారులు తెలిపారు.

# గుంతలో బైక్‌తో పడి వ్యక్తి మృతి

ఢిల్లీ జల్ బోర్డ్ అధికారుల నిర్లక్ష్యం..

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ జల్ బోర్డ్ అధికారుల నిర్లక్ష్యానికి ఒక వ్యక్తి బలయ్యాడు. తవ్వి వదిలేసిన గుంతలో బైక్‌తో సహా పడి అతడు మరణించాడు. విమర్శలు వెల్లువెత్తడంతో ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. ఢిల్లీలోని కైలాష్‌పురిలో నివసించే 25 ఏళ్ల కమల్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రోహిణి బ్రాంచ్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి విధుల తర్వాత బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. కాగా, అర్ధరాత్రి దాటినప్పటికీ కమల్ ఇంటికి చేరుకోలేదు. అతడి ఫోన్ కూడా పనిచేయడం లేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. వారంతా బయటకు వచ్చారు. సమీప ప్రాంతాల్లో కమల్ కోసం వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో శుక్రవారం తెల్లవారుజామున 2.45 గంటల సమయంలో కమల్ సోదరుడు జనక్‌పురి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కూడా కుటుంబ సభ్యులతో కలిసి కమల్ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. మరోవైపు శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో ఒక మహిళ పోలీసులకు ఫోన్ చేసింది. రోడ్డు పక్కన ఉన్న 15 అడుగుల లోతైన గుంతలో బైక్, ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం ఇచ్చింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ప్రమాదవశాత్తు బైక్ ఆ గుంతలో పడటంతో కమల్ మరణించినట్లు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. అయితే, జల్ బోర్డ్



అధికారులు ఆ గుంతను తవ్వి పూడ్చకుండా వదిలేసినట్లు తెలిసింది. దీంతో వారి నిర్లక్ష్యానికి ఒక యువకుడు బలికావడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ పట్టణాభివృద్ధి మంత్రి ఆశిష్ సూద్ దీనిపై దర్యాప్తునకు ఆదేశించారు. ప్రాథమిక దర్యాప్తు తర్వాత బాధ్యులైన ముగ్గురు ఢిల్లీ జల్ బోర్డు అధికారులను సస్పెండ చేశారు. ఇటీవల నోయిడాలో లోతైన నీటి గుంతలో కారుతో సహా పడి ఒక వ్యక్తి మరణించిన సంఘటనను ఇది తలపించింది.

# అఖిల రైల్ హిందీ క్విజ్ పోటీ–2025లో తూర్పు మధ్య రైల్వేకు ప్రథమ బహుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతీయ రైల్వేలో అధికార భాష అయిన హిందీ వినియోగాన్ని మరింత ప్రోత్సహించేందుకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన అఖిల రైల్ హిందీ క్విజ్ పోటీ–2025 ఘనంగా ముగిసింది. ఈ పోటీని సికింద్రాబాద్‌లోని ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (ఐఆర్ఐఎఫ్ఎం) లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైల్వే బోర్డు అదనపు సభ్యురాలు విజి భూమా ముఖ్య అతిథిగా హాజరై, హిందీ భాష ప్రచారంలో ఈ తరహా క్విజ్ పోటీలు వినూత్న ఆలోచన అని ప్రశంసించారు. అలాగే డాక్టర్ వి. సుగుణ, అధికార భాష డైరెక్టర్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ఐఆర్ఐఎఫ్ఎం డైరెక్టర్ జనరల్ అపర్ణా గార్గ్, అదనపు డైరెక్టర్ జనరల్ సిర్రా శాంతి రాజు అధ్యక్షత వహించారు. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే జోన్లు, ఉత్పత్తి యూనిట్ల నుంచి 28 జట్లు, దాదాపు 120 మంది అధికారులు, ఉద్యోగులు ఈ పోటీలో పాల్గొన్నారు. హిందీ మాట్లాడని ప్రాంతాలైన 'సి' కేటగిరీలో ఉన్న సికింద్రాబాద్‌ను వేదికగా ఎంచుకోవడం ద్వారా, నాన్‌హిందీ ప్రాంతాల్లో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఫైనల్‌కు చేరిన ఆరు జట్ల మధ్య ఉత్కంఠభరిత పోటీ జరగగా, తూర్పు మధ్య రైల్వే జట్టు ప్రథమ బహుమతిని గెలుచుకుంది.ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రధాన సిబ్బంది అధికారిగా సిద్ధార్థ్ కాటి, జిఆర్ఎస్ రావు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్‌ప్రభాకర్‌తో సహా ఏడుగురు నక్సలైట్లు మృతి



**గడ్చిరోలి:** మహారాష్ట్రలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. తూర్పు గడ్చిరోలి జిల్లాలో పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత ప్రభాకర్‌తో సహా ఏడుగురు నక్సలైట్లు మరణించగా, కాల్పుల సమయంలో గాయపడిన ఒక పోలీసు జవాను కూడా మృతి చెందాడని అధికారులు శనివారం తెలిపారు. గత మూడు రోజులుగా ఆ ప్రాంతంలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ జరుగుతోంది. తెలంగాణలోని కామారెడ్డికి చెందిన ప్రభాకర్ అలియాస్ లోకేటి చందర్ రావు, మావోయిస్టుల గడ్చిరోలి డివిజన్ కమిటీ, వెస్ట్ సబ్‌జోనల్ బ్యూరో 'కంపెనీ నెం 10'కు ఇన్‌ఛార్జ్‌గా ఉన్నాడని, అతని తలపై రూ. 25 లక్షల రివార్డు ఉందని అధికారులు తెలిపారు. కంపెనీ నెం. 10కి చెందిన మిగిలిన క్యాడర్ల కదలికలు, ఛత్తీస్‌గఢ్ నుండి వచ్చిన గుర్తు తెలియని నక్సలైట్ బృందం గురించి నిఘా వర్గాల సమాచారం అందడంతో, ఈ నెల 3వ తేదీ రాత్రి ఆపరేషన్ ప్రారంభించబడిందని గడ్చిరోలి పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గడ్చిరోలి పోలీసుల ప్రత్యేక నక్సల్ వ్యతిరేక దళమైన సి60కి చెందిన పద్నాలుగు యూనిట్లు నారాయణపూర్–గడ్చిరోలి సరిహద్దులోని ఫోడెవాడ గ్రామం సమీపంలో ఈ ఆపరేషన్‌ను ప్రారంభించాయని ఆ ప్రకటన పేర్కొంది. గురువారం రాత్రి ముగ్గురు నక్సలైట్ల మృతదేహాలను స్వాధీనం చేసుకోగా, శుక్రవారం ఆ ప్రాంతం నుండి మరో నాలుగు మృతదేహాలను వెలికితీశారు. మొత్తం ఏడుగురు మావోయిస్టుల (నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు) మృతదేహాలతో పాటు మూడు ఎక47 రైఫిళ్లు, ఒక ఎస్‌ఎల్‌ఆర్, ఒక .303 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రభాకర్‌తో పాటు, మరణించిన ఇతర మావోయిస్టుల గుర్తింపు ఇంకా నిర్ధారించబడలేదు. జిల్లాలోని అహేరి తహసీల్‌లోని మంద్రాకు చెందిన సి60 జవాన్ దీపక్ చిన్న మాడవి (38), గురువారం సాయంత్రం జరిగిన భారీ కాల్పుల మార్పిడిలో ఇద్దరు మావోయిస్టులను హతమార్చాడని, అయితే అతను కూడా బుల్లెట్ గాయానికి గురై, భామరాగ్‌డ ఆసుపత్రికి తరలించిన తర్వాత మరణించాడని ఆ ప్రకటన తెలిపింది. అతని స్వగ్రామంలో పూర్తి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు ని ర్వహిస్తారని అందులో పేర్కొన్నారు. కిష్టపల్లికి చెందిన మరో జవాన్ జోగా మాడవికి కూడా గురువారం రాత్రి బు ల్లెట్ గాయాలయ్యాయి. అతన్ని గడ్చిరోలికి హెలికాప్టర్‌లో తరలించి చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

# టివికె చీఫ్ విజయ్ పిటిషన్ కొట్టివేత



**చెన్నై :** ప్రముఖ సినీ నటుడు, 'తమిళగ వెట్రి కజగం' పార్టీ అధినేత దళపతి విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆదాయపు పన్ను శాఖ తనకు విధించిన రూ.1.50 కోట్ల భారీ జరిమానాను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. ఐటి శాఖ జారీ చేసిన పెనాల్టీ ఉత్తర్వులు చట్టబద్ధంగానే ఉన్నాయని, నిర్ణీత గడువులోపే ఆ నోటీసులు జారీ అయ్యాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. దీంతో విజయ్ ఇప్పుడు ఆ జరిమానా చెల్లించడం లేదా పై కోర్టులకు వెళ్లడం అనివార్యమైంది. 2015 సెప్టెంబర్‌లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు విజయ్ నివాసంలో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో విజయ్ నటించిన 'పులి' సినిమాకు సంబంధించి కొన్ని కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సినిమా ద్వారా విజయ్ సుమారు రూ.15 కోట్ల అదనపు ఆదాయాన్ని పొందారని, కానీ ఆ మొత్తాన్ని తన ఆదాయపు పన్ను రిటర్నుల్లో చూపించలేదని ఐటీ శాఖ ఆరోపించింది. 201516 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ ఆదాయాన్ని దాచిపెట్టారన్నది ప్రధాన అభియోగం. సోదాల్లో లభించిన ఆధారాల మేరకు ఐటీ శాఖ చర్యలకు ఉపక్రమించింది. లెక్కల్లో చూపని ఆ రూ.15 కోట్ల ఆదాయానికి సంబంధించి, 2022 జూన్ 30న ఒక ఉత్తర్వు జారీ చేసింది. దీని ప్రకారం విజయ్ రూ.1.50 కోట్ల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ విజయ్ 2022లోనే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి బెంచ్, 2022 ఆగస్టు 16న పెనాల్టీ చెల్లింపుపై మధ్యంతర స్టే విధించింది.

# బెంగాల్‌లో కాంగ్రెస్ ఒంటరి పోరాటం

రానున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 294 సీట్లకు ఒంటరిగా పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించటంలో ఆశ్చర్యం లేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఎల్‌ఒపి రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి గులాం అహ్మద్ మీర్‌తో పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో జరిపిన చర్చల్లో ఆ రాష్ట్రంలోని పరిస్థితుల్లో అది తప్ప మరో మార్గం లేదని నిర్ణయానికి వచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కాంగ్రెస్‌ను దరి చేయనీయరు. ఇండియా కూటమి భాగస్వాములుగా కాంగ్రెస్ పార్టీ టిఎంసితో పొత్తు కోరుకున్నా ఆమె కాంగ్రెస్‌ను మరీ జూనియర్ పార్టనర్‌గా ఈసడించుకోవచ్చు. కాబట్టి ఆమెకు దూరంగా ఉండడమే ఆత్మగౌరవం అనుకుని ఉంటారు. మమతను ఎదుర్కొనే ఉద్దేశంతో 2021 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయాల్లో దీర్ఘకాలంగా వైరిపక్షాలైన సిపిఐ(ఎం), కాంగ్రెస్ పొత్తు పెట్టుకుని భంగపడ్డాయి. ఈ పొత్తును ప్రజలు ఘోరంగా తిరస్కరించటంతో ఒక్క సీటు దక్కలేదు. రెండు పార్టీల మధ్య ఓటు బదిలీ జరగలేదు. అందువల్ల ఒంటరిగా పోటీ చేస్తే కనీసం కార్యకర్తలైనా ఉత్సాహంతో పనిచేస్తారని కాంగ్రెస్ నాయకులు భావించి ఉండవచ్చు. ఏది ఏమైనా, బెంగాల్‌లో రాజకీయం టిఎంసి, కాంగ్రెస్ మధ్య ద్విముఖ విభజనలో ఉంది. ప్రజల్లో కూడా ఆ విభజన ఉంది. మమతా బెనర్జీని ఓడించి అధికారం చేజిక్కించుకోవటమే బిజెపి తక్షణ లక్ష్యం. బిజెపి గత ఎన్నికల లాగే ఇప్పుడూ విభజనవాద రాజకీయాలు సహా సర్వశక్తులూ ఒడ్డుతున్నది. బిజెపి పన్నాగాలను సమర్ధవంతంగా తిప్పికొట్టగల ఏకైక శక్తి తమ పార్టీయేనని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హోరాహోరీ పోరాటం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్‌ను ఉపయోగించుకుని పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించటానికి 'సర్' ద్వారా బిజెపి చేస్తున్న ప్రయత్నాన్ని ఆమె ప్రతిఘటిస్తున్న తీరే ఇందుకు నిదర్శనం. లక్షల సంఖ్యలో ప్రజల ఓట్లు తొలగిస్తున్న ఎన్నికల కమిషన్ చర్యలను ఎండగడుతూ, న్యాయవాది కూడా అయిన మమతా బెనర్జీ ఢిల్లీలో ఆందోళన చేశారు, సుప్రీంకోర్టులో స్వయంగా వాదించారు. కాగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే పలు బహిరంగ సభల్లో ప్రసంగించి, మమతా బెనర్జీ అక్రమ చొరబాటుదారులను రక్షిస్తూ, వారిని ఓటు బ్యాంక్ చేసుకున్నారని, చొరబాటుదారులను ఏరివేస్తామని విష ప్రచారం చేశారు. విదేశీ (బంగ్లాదేశ్, మయన్మార్) చొరబాటుదారులు ప్రవేశించకుండా అరికట్టవలసిన బాధ్యత కేంద్రప్రభుత్వానిదేనని, వారిని అరికట్టటంలో విఫలమైన మోదీ పాలన దాన్ని కప్పిపుచ్చుకునేందుకు తమను నిందిస్తున్నారని మమత ఎదురుదాడి చేస్తున్నారు. ఈ రెండు శక్తుల మధ్య జరిగే తీవ్రమైన పోటీలో మరో పార్టీ స్థానం ఆశించటం – ఆంబోతుల కుమ్ములాట మధ్యలో మేకపోతు దూరటం లాగే ఉంటుంది. అయితే రాజకీయ క్షేత్రం ఏ ఒక్క రాజకీయ పార్టీకి శాశ్వతం కాదు. ఈలోపు ప్రతి రాజకీయ పార్టీ తమ రాజకీయ విధానాలను ఓపికగా ప్రజలకు వివరిస్తూ, ప్రజల సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగవలసిందే. అందువల్ల వామపక్ష సంఘటన, కాంగ్రెస్ పార్టీలు కలిసి పోటీ చేసినా, విడివిడిగా పోటీ చేసినా ప్రస్తుతానికి ప్రయోజనం పరిమితంగానే ఉంటుంది. కాంగ్రెస్ నిర్ణయం బెంగాల్ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీలు అనివార్యం చేస్తున్నది.

ఇదిలావుండగా, ముఖ్యమంత్రి రూ.4.06లక్షల కోట్ల రాష్ట్ర తాత్కాలిక బడ్జెట్‌లో మహిళలు, నిరుద్యోగ యువత, గిగ్ కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు ప్రకటించి ఎన్నికల ప్రలోభాలు ప్రారంభించారు. లక్ష్మీ భాండార్ పథకం కింద జనరల్ మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయాన్ని రూ.500లు పెంచి రూ.1500లకు చేర్చారు. ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు మరో రూ.200లు అదనం. ఇందుకు రూ.15వేల కోట్లు కేటాయించారు. ఈ పెంపుదల ఫిబ్రవరి నుంచి అమలులోకి వచ్చింది. బంగ్లార్ యువసాధి పథకం కింద 21–40ఏళ్ల మధ్యవయస్కులైన యువతకు ఐదేళ్లపాటు, లేదా ఉద్యోగం లభించేవరకు – ఏది ముందు అయితే అంతవరకు నెలకు రూ. 1500 వాగ్దానం చేశారు. అంగన్‌వాడీ, ఆషా ఉద్యోగులు, పారవలంటీర్లు, పారా టీచర్లకు రూ.1000 చొప్పున పెంపు చేశారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో ఒకసారి రూ.4వేలు చెల్లిస్తారు. గిగ్ వర్కర్స్‌కు ఆరోగ్య బీమా పథకం ప్రకటించారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు డి.ఎ. 4శాతం పెంచారు. ఇటువంటి ఉచితాలను 'మిఠాయిలు'గా ఒకప్పుడు విమర్శించిన ప్రధానమంత్రి మోదీ ఇవాళ అలా అనే నైతిక హక్కు కోల్పోయారు. ఎందుకంటే ఆయనే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో ఎన్నో గారడీలు చేస్తున్నారు, బిజెపి పాలిత రాష్ట్రాలు మరెన్నో తాయిలాలు ప్రకటిస్తున్నాయి.

దేశ రాజకీయ దృశ్యంలో మహారాష్ట్ర రాజకీయాలు గమనించదగినవి. ఎన్‌సిపినేత, బిజెపి సంకీర్ణ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ జనవరి 28న విమాన ప్రమాదంలో దుర్మరణం పాలైన తదుపరి ఎన్‌సిపిలు రెండూ (అజిత్ పవార్, శరద్ పవార్ గ్రూపులు) ఏకమవుతాయా అన్న ప్రశ్న రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చకు దారితీసింది. అజిత్ పవార్ ఐక్యతను కోరుకున్నారని, రెండు పార్టీల పునరేకీకరణను ప్రకటించటానికి ఫిబ్రవరి 12ను ఆయన ఎంచుకున్నారని శరద్‌పవార్ వెల్లడించటం ఈ చర్చకు ఆధారం. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు బాబాయి–అబ్బాయి పార్టీలు రెండు కార్పొరేషన్స్‌లో కలిసి పోటీ చేసినా ప్రజలు ఆదరించలేదు. జిల్లా పరిషత్ ఎన్నికల నేపథ్యంలో పునరేకీకరణ చర్చకు వచ్చింది. అయితే బిజెపి కౌంటర్ వ్యూహంతో అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్‌ను ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించి ఎన్‌సిపిల పునరేకీకరణను అడ్డుకుందని చెప్పవచ్చు. ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నావీస్ షిండె శివసేనను, అజిత్ ఎన్‌సిపిని ఒకదానికొకటి కౌంటర్ వెయిట్‌లుగా ఉపయోగిస్తున్నారు. కాగా సునేత్ర పవార్ తన కుమారుడు పార్ధపవార్‌ను రాజ్యసభకు పంపే ప్రయత్నంలో ఉన్నట్లు వదంతులు వినిపిస్తున్నాయి. బిజెపి సహాయం లేకుండా అతన్ని రాజ్యసభకు పంపే సంఖ్యాబలం ఎన్‌సిపికి శాసనసభలో ఉంది. అందువల్ల శరద్‌పవార్ ఆశలు నెరవేరకపోవచ్చు.



## ఓమ్ బిర్లా వ్యాఖ్యలు హాస్యాస్పదం

కాంగ్రెస్ ఎంపిలు సభలో ప్రధాని నరేంద్ర మోదీ సీటు వైపు వెళ్లి ఏదైనా ఊహించని చర్యకు పాల్పడవచ్చని తనకు సమాచారం ఉందని బిర్లా చెప్పడం విడ్డూరం. ప్రస్తుత ప్రభుత్వ పాలన వల్ల దేశం ప్రమాదంలో ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ గొప్ప త్యాగాలు చేసి పార్లమెంటుకు జన్మనిచ్చింది. పార్లమెంటులో మోదీకి ప్రమాదం ఉందని ఎవరైనా చెబితే, అది కేవలం చెత్త మాటే. కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలను ఉగ్రవాద దాడులలో కోల్పోయింది. ప్రమాదం గురించి తెలిసినప్పటికీ, వారు ప్రజల మధ్యకు వెళ్లారు. దాడులకు గురయ్యారు. సభ వెల్‌లోకి ఎంపిలు ప్రవేశించడం వల్ల ప్రధానికి ముప్పు వాటిల్లిందని చెప్పడం హాస్యాస్పదం. ఇది ఒక పిరికి ప్రభుత్వం.

– శివసేన (యుబిటి) ఎంపి
సంజయ్ రౌత్



## లద్దాఖ్ భవిష్యత్తును ఢిల్లీ నుంచి నిర్ణయించలేరా?

2019లో భారత ప్రభుత్వం లద్దాఖ్‌కు ఉన్న ప్రత్యేక రాజ్యాంగ రక్షణలను రద్దు చేసినప్పుడు, అభివృద్ధి, అవకాశాలు, సమీకరణ అనే వాగ్దానాలు చేసింది. కానీ ఆ తర్వాత వెలుగులోకి వచ్చింది మాత్రం ఒక పరిచిత కథనే: పర్యావరణ సున్నితత్వాన్ని త్యాజ్యంగా చూడటం, స్థానిక సమ్మతిని అడ్డంకిగా భావించడం, ప్రజాస్వామ్యానికి బదులుగా సైనిక దళాలను ముందుకు తెచ్చింది. లద్దాఖ్ అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న ఖాళీ సరిహద్దు భూమి కాదు. ఇది హిమానీ నదులు, పురాతన వాణిజ్య మార్గాలు, తీవ్ర పరిస్థితుల్లో శతాబ్దాలుగా జీవనాన్ని నిలబెట్టిన స్థానిక జ్ఞాన వ్యవస్థలతో ఆకృతమై ఉన్న ఎత్తైన ఎడారి ప్రాంతం. ఈ భూభాగాన్ని అస్థిరం చేయడం కేవలం ప్రాంతీయ ప్రమాదం కాదు; ఖండస్థాయి ప్రమాదం. 2019 తర్వాత లద్దాఖ్‌లో అభివృద్ధి అంటే భూముల వేగవంతమైన ప్రైవేటీకరణ, ప్రపంచంలోనే అత్యంత వాతావరణ సున్నితమైన ప్రాంతాల్లో పారిశ్రామిక, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల విస్తరణగా మారింది.

2025 ఆగస్టు వర్షపాతం సాధారణ స్థాయికి మించి 930 శాతం పెరిగి, అకస్మాత్తు వరదలు సంభవించాయి. పశువులు, వంతెనలు, ఇళ్లు కొట్టుకుపోయాయి. లద్దాఖ్‌లో విస్తరిస్తున్న రోడ్లు, సొరంగాల జాలంలో సైనికీకరణ– అభివృద్ధి సంగమం స్పష్టంగా కనిపిస్తుంది.1,600కిలోమీటర్లకు పైగా రోడ్డు వెడల్పు చేయబడ్డాయి, కొత్తగా నిర్మించబడ్డాయి. లేహ్, కార్గిల్, శ్రీనగర్‌లను కలిపే జోజిలా సొరంగం, చైనా సరిహద్దు సమీపంలోని సియాచిన్ హిమనదికి సరఫరాలు చేర్చే భారత రక్షణ వ్యూహంలో కీలకమైనది. కానీ తవ్వకాల మలినాలు, నదుల అస్థిరత, కొండచరియల ప్రమాదం వంటి పర్యావరణ వ్యయాలను వ్యూహాత్మక అవసరాలుగా కొట్టిపారేస్తున్నారు.

ఈ పరిస్థితుల్లోనే పర్యావరణ కార్యకర్త, సమాజ నాయకుడు సోనం వాంగ్‌చుక్ 2025 సెప్టెంబర్ 10న నిరాహార దీక్ష ప్రారంభించారు. శాంతికి పిలుపునిచ్చిన వాంగ్‌చుక్‌ను రెండు రోజుల తర్వాత అరెస్ట్ చేసి, 1300కిలోమీటర్ల దూరంలోని జోధ్‌పూర్‌కు తరలించారు. లద్దాఖ్ లేవనెత్తుతున్న ప్రశ్న— సరిహద్దు ప్రాంతాలు అభివృద్ధి చెందాలా వద్దా అన్నది కాదు. పర్యావరణం, ప్రజాస్వామ్యం, స్థానిక జ్ఞానాన్ని చెరిపి వేయకుండా అభివృద్ధి సాధ్యమా అనేది అసలు ప్రశ్న. లద్దాఖ్‌ను ఖాళీ పటములా చూడడం తాత్కాలికంగా వ్యూహాత్మక లక్ష్యాలకు ఉపయోగపడవచ్చు. కానీ దీర్ఘకాలంలో, దేశం ఆధారపడిన పర్యావరణ, సామాజిక, రాజ్యాంగ పునాదులనే దెబ్బతినే ప్రమాదం ఉంది.

డా. ముచ్చుకోట సురేష్ బాబు

# మయన్మార్ మిలిటరీ జుంటాపై భారత్ వ్యూహమేమిటి?



నిత్యా చక్రవర్తి

బంగ్లాదేశ్, నేపాల్, తాజాగా మయన్మార్‌లో తలెత్తుతున్న పరిస్థితిని ఎదుర్కోవడంలో భారత విదేశాంగ విధాన నిర్ణేతలకు అవగాహన లేదు. మయన్మార్‌లో మిలిటరీ జుంటా నిర్వహించిన మూడు దశల సార్వత్రిక ఎన్నికలు జనవరి 25న ముగిశాయి. ఫలితాలు జనవరి 29, 30 తేదీలలో విడుదలయ్యాయి. ఊహించినట్లుగానే, మిలిటరీ అండ కలిగిన యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్మెంట్ పార్టీ (యుఎస్‌డిపి)ఎన్నికలలో రిగ్గింగ్ చేసి గెలుపొందింది. దిగువ సభలోని 263 సీట్లలో 232, ఎగువ సభలోని 157 సీట్లలో 109 స్థానాలలో గెలిచింది.

నూతన అధ్యక్షుడిని, బహుశా ప్రస్తుత జుంటా చీఫ్‌నే ఆ స్థానంలో ఎన్నుకోవడానికి మయన్మార్ కొత్త పార్లమెంట్ మార్చిలో సమావేశమవుతుంది. ఆయన సైన్యం మద్దతు ఉన్న పార్టీ నుండి తన మంత్రులను ఎన్నుకుంటారు. కొత్త ప్రభుత్వం యుఎస్‌డిపి ద్వారా సైనిక పాలనను అధికారికం చేస్తుంది. ఫిబ్రవరి 2021లో జుంటా సూకీ ప్రభుత్వాన్ని తొలగించిన ఐదు సంవత్సరాల తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది. సూకీ అనారోగ్యంతో జైలులో ఉన్నారు. ఆమె పార్టీని నిషేధించారు. చైనాకు విధేయులైన తిరుగుబాటుదారులను బీజింగ్ నిర్వహిస్తోంది, ఎందుకంటే చైనా ప్రభుత్వం అధికారికంగా జుంటా యొక్క USDPకి గుర్తింపు ఇచ్చింది. కొత్త సైనిక ప్రభుత్వ ఏర్పాటులో చైనా మాటచెల్లడం ఖాయం.

బీజింగ్‌కు విధేయులైన తిరుగుబాటు గ్రూపులకు మద్దతు ఇచ్చే చైనా వ్యూహాన్ని పరిశీలించడం ఆసక్తికరంగా ఉంటుంది. అదే సమయంలో తిరుగుబాటుదారులతో తన పరపతిని ఉపయోగించి మయన్మార్ పాలన నుండి రాయితీలను పొందేందుకు జుంటాతో తన సంబంధాలన్నింటినీ కొనసాగించింది. చైనా తన పెట్టుబడులను రక్షించుకుంది. ఆర్మీ జనరల్స్‌లో తన ప్రభావాన్ని విస్తరించింది. ఐదు సంవత్సరాల తర్వాత, మయన్మార్ తిరుగుబాటు ద్వారా అమెరికా, రష్యా సహా ఒకప్పుడు బ్రిటీష్ ఇండియాలో పాత బర్మా (ప్రస్తుత మయన్మార్) భాగంగా ఉన్న భారతదేశాన్ని అణిచివేసి, చైనా అతిపెద్ద లబ్ధిదారుగా నిలిచింది.

తిరుగుబాటుకు ముందు పాలక పార్టీగా ఉన్న సూకీ నేతృత్వంలోని నేషనల్ లీగ్ ఆఫ్ డెమోక్రసీ, ఇతర పౌర సమాజ సంస్థలు, విద్యార్థులతో కలిసి ప్రతిఘటించింది. కానీ ప్రతిఘటన స్వభావం ప్రావిన్స్ నుండి ప్రావిన్స్‌కు మారుతూ ఉంటుంది. చైనాను ఆనుకుని ఉన్న ప్రావిన్స్‌లలో, తిరుగుబాటుదారులకు చైనా సైన్యం సహాయం చేసింది. తద్వారా వారి ఏకీకరణ ప్రక్రియ కు సహాయపడింది.

మయన్మార్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, 2025 డిసెంబర్ నాటికి, 91 టౌన్‌షిప్‌లు పూర్తిగా ప్రతిఘటన దళాల నియంత్రణలో ఉన్నాయి. 144 టౌన్‌షిప్‌లు పాక్షికంగా వారి నియంత్రణ లో ఉన్నాయి. ఎన్నికలు జరిగిన ప్రాంతాలపై సైన్యం పాక్షికంగా నియంత్రణ కలిగి ఉంది. సైనిక బలం క్షీణించడమే కాకుండా, నైతిక స్థైర్యం కూడా చాలా తక్కువగా ఉంది. ఉత్తర షాన్ రాష్ట్రం, రాజధాని చుట్టుపక్కల ప్రాంతాలపై నియంత్రణను తిరిగి పొందడానికి సైనిక పాలన వైమానిక దాడులను తిరిగి ప్రారంభించింది.

తిరుగుబాటు తర్వాత, సైనిక దళాలు డజన్ల కొద్దీ రాజకీయ పార్టీలను క్రమపద్ధతిలో నిషేధించాయి. 30,000 మందికి పైగా రాజకీయ ఖైదీలను నిర్బంధించాయి. 2026 జనవరిలో ప్రభుత్వం 2025 జూలైలో ఆమోదించిన 'ఎన్నికల రక్షణ' చట్టం కింద 400 మందికి పైగా వ్యక్తులపై చట్టపరమైన చర్య తీసుకుంది. ఎన్నికల ప్రక్రియపై దాదాపు అన్ని రకాల విమర్శలను, చట్ట వ్యతిరేక ప్రసంగం, ఓటింగ్‌కు భంగం కలిగించే ఏదైనా కార్యక్రమాన్ని లేదా నిరసనను నిర్వహించటాన్ని చట్టం నేరంగా పరిగణిస్తుంది. మొత్తం కసరత్తు విస్తృతమైన నిఘాకు స్పష్టమైన ఉదాహరణగా నిలిచింది.




2021 ఫిబ్రవరిలో సైనిక దళాల తిరుగుబాటు ప్రారంభం నుండి, చైనా ద్వంద్వ పాత్ర పోషిస్తోంది. ఎందుకంటే, చైనా మయన్మార్ ఎకనామిక్ కారిడార్ (సిఎంఇసి) కింద తన ప్రాజెక్టులను రక్షించుకోవడానికి మిలిటరీ జుంటా మద్దతు చైనాకు అవసరం. చైనా తన ప్రాజెక్టులను రక్షించుకోవడానికి తన సొంత దళాలను కూడా ఉపయోగించుకుంది. వాస్తవానికి చైనా అనుకూల తిరుగుబాటుదారులతో జుంటా సైన్యం ఘర్షణపడుతున్న సమయంలో కూడా తన సైనిక బలగాలను భద్రతా దళాలతో స్వేచ్ఛగా కలవడాన్ని చైనా అనుమతించింది.


*మయన్మార్‌లో జాతీయ ఎన్నికలు జరిగిన తర్వాత కొన్ని వారాల్లోనే సైనిక అనుకూల ప్రభుత్వం ఏర్పడనున్న సమయంలో భారత వైఖరి ఏమిటి? మయన్మార్‌తో భారతదేశానికి 1,643 కి.మీ సరిహద్దు ఉంది. గత ఐదు సంవత్సరాలలో రోహింగ్యా ముస్లింలు, తిరుగుబాటుదారులు సహా మయన్మార్ నుండి మయన్మార్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న భారతదేశంలోని రాష్ట్రాలలో ఆశ్రయం పొందారు. భారతదేశం మయన్మార్‌లో కూడా భారీ పెట్టుబడులను కలిగి ఉంది. ప్రభుత్వరంగం సహా అనేక భారతీయ కంపెనీలు పనిచేస్తున్నాయి.*

మయన్మార్‌లో జాతీయ ఎన్నికలు జరిగిన తర్వాత కొన్ని వారాల్లోనే సైనిక అనుకూల ప్రభుత్వం ఏర్పడనున్న సమయంలో భారత వైఖరి ఏమిటి? మయన్మార్‌తో భారతదేశానికి 1,643 కి.మీ సరిహద్దు ఉంది. గత ఐదు సంవత్సరాలలో రోహింగ్యా ముస్లింలు, తిరుగుబాటుదారులు సహా మయన్మార్ నుండి మయన్మార్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న భారతదేశంలోని రాష్ట్రాలలో ఆశ్రయం పొందారు. భారతదేశం మయన్మార్‌లో కూడా భారీ పెట్టుబడులను కలిగి ఉంది. ప్రభుత్వరంగం సహా అనేక భారతీయ కంపెనీలు పనిచేస్తున్నాయి.

భారతదేశం మద్దతు ఇచ్చే కలడాన్ మల్టీమోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్పోర్ట్ ప్రాజెక్ట్ , ట్రైలేటరల్ హైవే వంటి కనెక్టివిటీ ప్రాజెక్టులు చాలా కీలకమైనవి అయినప్పటికీ, కార్యాచరణపరంగా సమస్యాత్మకంగా ఉండే అవకాశం ఉంది. చైనా ఇటీవల జుంటాతో సహకార ఒప్పందంపై సంతకం చేసింది. అధికారిక సంబంధాలు తెగిపోనప్పటికీ, జుంటాతో కలిసి ఉన్నట్లు గుర్తింపు పొందకూడదని భారతదేశం నైతిక వైఖరిని తీసుకుంటోంది. గత సంవత్సరం చివర్లో భారతదేశం జుంటాయేతర గ్రూపులతో, తిరుగుబాటుదారులలో ఒక భాగంతో సంబంధాలను ఏర్పరచుకోవడానికి ప్రయత్నించింది. కానీ తుది చట్రాన్ని నిర్మించలేదు. ఫలితంగా, ఇప్పుడు చైనాకు అన్ని ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే రాబోయే ప్రభుత్వ మద్దతు, తిరుగుబాటుదారులలో పరపతి కూడా ఉన్నాయి. భారతదేశానికి ఎలాంటి సంబంధాలు లేవు.

పాశ్చాత్య దేశాలు ఎన్నికలను ఇంకా గుర్తించలేదు. కానీ అమెరికా ఇప్పటి వరకు మయన్మార్‌పై అంత ఆసక్తి చూపడం లేదు. కాగా చైనా తన దౌత్య ప్రభావంపరంగా అంతటా వ్యాపించి ఉంది. ఇది భారతదేశానికి స్వాగతించదగిన వార్త కాదు. కొత్త ప్రభుత్వం పనిచేయడం ప్రారంభించిన తర్వాత న్యూఢిల్లీ లోతైన ఆత్మపరిశీలన చేసుకుని ఒక నిర్దిష్ట వ్యూహాన్ని రూపొందించుకోవాలి. భారతదేశానికి భద్రతా పరంగా, వ్యూహాత్మకంగా మయన్మార్ చాలా ముఖ్యమైనది. ఆ దేశం పూర్తిగా చైనా ఒడిలోకి జారిపోకుండా చూడాల్సిన అవసరం న్యూఢిల్లీకి ఉంది.

# పెరుగుతున్న సమ్మె ఆవశ్యకత



వి.యస్.బోస్
మాజీ ప్రధాన కార్యదర్శి
ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి
9391356527

12ఫిబ్రవరి 2026నాడు భారతదేశ వ్యాపితంగా కార్మికులు, ఉద్యోగులు, కర్షకులు తలపెట్టిన సమ్మె ఆవశ్యకత రోజురోజుకి పెరుగుతున్నది. సమ్మె ఆవశ్యకతను గుర్తించిన కార్మికవర్గం తన కర్తవ్యాన్ని నెరవేర్చటానికి పూర్తి ప్రయత్నాలు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నది.

**లేబర్ కోడ్‌లు:** కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దుచేసి వాటిస్థానంలో నాలుగు కోడ్‌లను 2019/2020లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కార్మికవర్గం పోరాటాల ఫలితంగా నేటివరకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా లేబర్ కోడ్‌లు అమలు చేయటంలో వెనుకడుగు వేసింది. మోదీ 3వ సారి ప్రధాని అయిన తర్వాత అహంకారం నెత్తికెక్కి ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నా, కొన్ని రాష్ట్రాలు లేబర్ కోడ్‌లు వద్దన్నా పార్లమెంట్‌లో తనకున్న మందబలంతో లేబర్ కోడ్‌లను అమలు చేయటానికి 2025 శీతాకాలం సమావేశాల్లో కేంద్రం లేబర్ రూల్స్‌ను తయారు చేసి పార్లమెంట్ ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రాలపై అమలుకోసం ఒత్తిడి తెస్తున్నది. అయినా దేశంలో కార్మికవర్గం అడుగడుగునా ప్రభుత్వ దుష్ట ప్రయత్నాలను తిప్పికొట్టటంలో సఫలీకృతమవుతున్నది. లేబర్ కోడ్‌లు రద్దుచేసి 29 కార్మిక చట్టాలను పునరుద్దరించాలనే ఏకైక నినాదంతో మరో మారు సమ్మెకు సిద్ధమవుతున్నది.

కార్మికులకు రాజ్యాంగం ప్రసాదించిన యూనియన్ పెట్టుకునే హక్కును బిజెపి ప్రభుత్వం నిరాకరిస్తున్నది. నిరసన తెలియజేయటానికి చేసే సమ్మె హక్కును కూడా కాలరాస్తున్నది. నాటి బ్రిటీష్ ప్రభుత్వం మోదీ ప్రభుత్వం లాగానే ప్రవర్తిస్తే మన దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చేదో ఆలోచించాల్సిన విషయం. అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న 8గంటల పనిదినాన్ని రద్దుచేసి చికాగో కార్మికుల రక్తతర్పణను అపహాస్యం చేస్తున్నది. ఫ్యాక్టరీ యాక్ట్ ప్రకారం పని ప్రదేశం లో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాల చట్టబద్ధతను తొలగించి యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదిలివేయటం జరుగుతున్నది. పరిశ్రమలు మూసివేయటానికి సౌలభ్యం కలుగజేస్తూ ప్రస్తుతం ఉన్న 100 కార్మికుల సంఖ్యను 300లకు పెంచి యాజమాన్యాలకు పెద్ద వరం ఇవ్వటం జరిగింది. దీనితో యాజమాన్యాలు భస్మాసురిడిలా తాము పొంది న హక్కును కార్మికులపై ప్రయోగించి కార్మికులను బానిసలకన్నా హీనంగా చూసే పరిస్థితి ఏర్పడుతున్నది. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ పేరుతో స్థిరమైన ఉద్యోగాలు లేకుండా కార్మికుల జీవితాలు దినదినగండం నూరేళ్ల ఆయుష్షుగా తయారు చేస్తున్నది. చట్టాన్ని తుంగలో తొక్కి కార్మికులను యాజమాన్యం ఇష్టానుసారం తీసుకోవచ్చును మరియు తొలగించవచ్చును అనే విధానానికి విదేశీ ముద్దుపేరు అయిన హైర్ & ఫైర్ అనే పేరు పెట్టి అదే స్వదేశీ భక్తి అని బిజెపి ప్రభుత్వం చాటుకుంటున్నది.

కాంట్రాక్ట్ చట్ట ప్రకారం 240 రోజులు పనిచేస్తే పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలనే చట్టాన్ని పూర్తిగా మార్చి అలాంటి విధానం లేకుండా చేసి ఏ పనిలోనైనా ఎప్పుడైనా కార్మికులను కాంట్రాక్ట్ విధానంలో పెట్టుకోవచ్చని లేబర్ కోడ్‌ల ద్వారా యాజమాన్యాలకు హక్కును కలుగజేసి దోపిడీ ఆయుధాన్ని వారికి బిజెపి ప్రభుత్వం అందజేసింది. కాంట్రాక్ట్ విధానం, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ వచ్చిన తర్వాత నిలకడైన ఆదాయం, ఉపాధి లేక ఆడ, మగ తేడా లేకుండా యువతియువకులందరు పెళ్ళి చేసుకోవటానికి అయిష్టత చూపుతున్న పరిస్థితి ప్రస్తుతం దేశంలో నెలకొన్నది. ముస్లింల కన్నా ఎక్కువ సంతానం పుట్టించాలని ప్రబోధిస్తున్న బిజెపి ప్రముఖులకు పెళ్ళి, పిల్లలు అంటే విముఖత చూపుతున్న యువతను చూపి ఈ సామాజిక తీరును గమనిస్తే దీనికి పూర్తి బాధ్యత బిజెపి విధానాలే కారణంగా అర్థమవుతుంది.




పిఎఫ్, బోనస్ లాంటి సౌకర్యాలను ఎలాంటి సీలింగ్ లేకుండా కార్మికులందరికి వర్తింప చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తుంటే బోనస్ వదిలేసి కేవలం పిఎఫ్ మాత్రమే 2500 రూపాయలకు పరిమితిని పెంచి బిజెపి తన కార్పొరేట్ నీతిని చాటుకుంది. పిఎఫ్ డబ్బులు ట్రస్ట్‌ల ద్వారా కార్పొరేట్ సంస్థలు వాడుకోవటానికి అవకాశం ఉన్నది. కానీ బోనస్ కేవలం సంవత్సరానికి ఒకసారి కార్మికులకు పూర్తిగా చెల్లించాలి. దీనివల్ల కార్పొరేట్ సంస్థలు బోనస్ డబ్బును వాడుకునే అవకాశం లేదు. అందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పిఎఫ్ పరిధిని పెంచి బోనస్ పరిధిని పెంచకుండా వదిలేసింది. గతంలో నెహ్రూ ప్రభుత్వం నుండి నిర్మించుకొస్తున్న సామాజిక, ఆర్థిక పరిపుష్టి కలుగజేస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ బిజెపి ప్రభుత్వం ఓడరేవులు, ఎయిర్‌పోర్టులు లాంటి వాటిలో అధికభాగం ఆదానీకి దారాదత్తం చేస్తున్నది. ఆత్మనిర్భర్ భారత్ అంటే బిజెపి వారి అర్థం 'భారత ఆత్మను ఆదానీకి అప్పచెప్పటం' అని ప్రజలు అర్థం చేసుకోవాలి. దేశానికి ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధించిన బ్యాంకుల వ్యాపార పరిధిపై ప్రభావం పడే విధంగా విలీనీకరణ విధానాలు అమలు చేస్తూ ప్రైవేటు బ్యాంకులకు మార్గం సులభం చేయటం బిజెపి విధానంగా పెట్టుకుంది. బిజెపి పారిశ్రామిక విధానం అంటే ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయటం, ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించటం, ఆ సంస్థలకు నష్టాలు వస్తే ఆర్థికంగా ఆదుకోవటం, అప్పులు ఇప్పించటం తర్వాత వాటిని రద్దు చేయటంతో ప్రైవేటు సంస్థలకు లాభం అందించటమే విధానంగా ఉంది. మోదీ దుష్ట విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం అలుపెరుగని పోరాటాలు చేస్తున్నది. అందుకే మోదీ ఆశించిన గోల్‌ను 11 సంవత్సరాలు అధికారంలో ఉండి కూడా సాధించలేని పరిస్థితి ఏర్పడింది. మోదీ ఓడిపోవటం ఖాయం. మరోసారి ప్రభుత్వరంగ సంస్థలు భారతదేశానికి వెలుగులు ప్రకాశించటం కూడా తథ్యం. దేశాభివృద్ధికి స్వాతంత్ర్యకాలం నుండి కృషి చేస్తున్న కోల్, ఆయిల్, గ్యాస్ లాంటి అనేక సంస్థలతో పాటు మన దేశానికి రక్షణ కోసం కృషి చేస్తున్న డిఫెన్స్ పరిశ్రమలను, పరిశోధనా సంస్థలను, అంతరిక్ష వ్యవస్థలను, అణు ఇంధన సంస్థల లాంటి ప్రతి వ్యవస్థను ప్రైవేట్‌పరం చేస్తూ దేశభక్తులమని సొంత డబ్బా కొట్టుకోవటం మన దేశంలోనే చెల్లుబాటు అవుతుంది. ఇతర దేశాల్లో ఇలాంటి నీతిమాలిన వ్యవహారాలు చెల్లుబాటుకావు.

కార్పొరేట్ సంస్థలకు, విదేశాలకు ఊడిగం చేసే అన్ని దుష్ట చట్టాలను రద్దు చేయించటమే కాక మన దేశాన్ని, దేశ ప్రజలను దోచుకొని ఆస్తులు పెంచుకుంటున్న కార్పొరేట్ సంస్థల ఆస్తులను జాతీయం చేయాలనే డిమాండ్‌ను కూడా కార్మికవర్గం తమ అజెండాలో ప్రధానంగా ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులకు ఇన్‌కం టాక్స్ స్లాబ్‌ను పెంచలేదు, పెన్షన్ పెంచలేదు, వైద్య సౌకర్యాలు పెంచలేదు కానీ కార్పొరేట్ సంస్థలకు కోరుకున్న విధంగా బడ్జెట్‌లో సౌకర్యాలు కలుగజేశారు. అందుకే కేంద్ర ప్రభు త్వం కార్పొరేట్ ప్రభుత్వంగా ప్రజలు భావిస్తున్నారు. అందుకే కార్మిక, కర్షక వర్గాలు 4 లేబర్ కోడ్‌లను, రైతు వ్యతిరేక చట్టాలను, పోస్టల్ చట్టాన్ని, విద్యా చట్టాన్ని, విద్యుత్ చట్టాన్ని, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్, గ్రామీణ ఉపాధిలో తెచ్చిన కొత్తచట్టం, ప్రభుత్వరంగ సంస్థల అమ్ముకునే బిల్లు, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్, డిఫెన్స్ ఎంప్లాయిస్, ఎషన్షియల్ యాక్ట్ లాంటి అనేక కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలు తెచ్చిన బిజెపి ఈ సమ్మె ద్వారానైనా బుద్ధి తెచ్చుకుంటుందని ఆశిద్దాం.

రైతులు ఒక ప్రక్క తమకు సంకెళ్ళుగా మారిన విధానాలను రద్దు చేయాలని పోరాటం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం తగుదనమ్మా అని యూరప్ దేశాల నుండి అమెరికా నుండి వారి వ్యవసాయ మరియు పాల ఉత్పత్తులు ఎలాంటి టాక్స్ లేకుండా మన దేశంలో అమ్ముకోవటానికి అంగీకరించి మన దేశ రైతుల జీవితాలపై మరో బాంబు పేల్చింది. రైతులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయకపోగా మన రైతులను బికారులుగా చేసి విదేశీ రైతులకు ఎనలేని సౌకర్యాలు కలుగజేస్తూ అమీరులను చేసే ఒప్పందాలు చేసుకోవటం ముమ్మాటికి సహించరానిది. మన దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ బ్యాంకు చేతిలో, పారిశ్రామిక వ్యవస్థ కార్పొరేట్ చేతుల్లో, వాణిజ్య మరియు వ్యాపార వ్యవస్థ అమెరికా చేతిలో పెట్టి మన ప్రభుత్వం చేతగానిదిగా ప్రవర్తిస్తున్నది. అందుకే ప్రస్తుతం దేశంలో సమ్మె అవసరం పెరిగిందని తెలియజేస్తున్నాం.

# మహిళా, శిశు సంక్షేమానికి శుక్రవారం సభ

## ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోండి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ :** మహిళలు, పిల్లల సంక్షేమానికి, అభివృద్ధికి శుక్రవారం సభ ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రామడుగు మండలం తిరుమలాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ జరిగింది. ఈ సభకు హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళల సంక్షేమానికి ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రవేశపెట్టి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శుక్రవారం సభలోను మహిళలు వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందవచ్చని సూచించారు. శుక్రవారం సభ ద్వారా మహిళల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శిశువుల సంరక్షణ, పిల్లల సంపూర్ణ ఎదుగుదలకు పోషకాహారం, వైద్య న్యాయ సలహాలు వంటివి వివరిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు నాలుగుసార్లు ఏ.ఎన్.సి పరీక్షలు, ఖరీదైన టిఫా స్కానింగ్ వంటివి ఉచితంగా చేసి మందులు అందజేస్తారని తెలిపారు. గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలని కోరారు. తిరుమలాపూర్ గ్రామంలో ప్రభుత్వ వైద్య సేవలను ఎక్కువ శాతం మంది వినియోగించుకోవడం మంచి విషయమని తెలిపారు. అనంతరం గర్భిణీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, తహసీల్దారు రాజేశ్వరి, గ్రామ సర్పంచ్ మోడీ రవీందర్, ఉపసర్పంచ్ కట్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

### జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల :** మున్సిపల్ ఎన్నికలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు నిర్వహించే ఆర్వో, ఏఆర్వో, కౌంటింగ్ అధికారులు, సూపర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించి మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల నిర్వాహణపై ప్రతి అధికారికి తప్పనిసరిగా పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో పోలింగ్ చాలా ముఖ్యమని వివరించారు. పోలింగ్‌కు సంబంధించిన అన్ని రకాల పత్రాలను సమకూర్చుకోవాలన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతవరణంలో నిర్వహించేలా అదికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజ గౌడు, నోడల్ అధికారి రవి కుమార్ తదితరులు ఉన్నారు.

# దొంగతనం కేసులో దంపతుల అరెస్టు



**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఉన్న కోదండ రామాలయంలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో దంపతులను పట్టుకుని వారి వద్ద బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రఘు చందర్ శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జగిత్యాల రూరల్ మండలం లో తాటిపెల్లి గ్రామానికి చెందిన వద్దూరి నాగరాజు రజిత అనే దంపతులు జిల్లా కేంద్రంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. విచారణలో ఆలయ చోరీ కేసులో నిందితులుగా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టౌన్ సీఐ కరుణాకర్ తదితరులు ఉన్నారు.

# ఉరేసుకొని వృద్ధురాలు ఆత్మహత్య

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన ఓగులాపురం లింగవ్వ అనే వృద్ధురాలికి పలు అనారోగ్య సమస్యలు ఉన్నాయి. వయోభారం వల్ల నడవలేకపోవడంతో గురువారం సాయంత్రం తన ఇంట్లోని ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి మనుమడు ఓబులాపురం రఘు ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



4వ వార్డులో గడప గడపకూ ఎన్నికల ప్రచారం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/వేములవాడ:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వేములవాడ పట్టణంలోని 4 వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట రాజుకు మద్దతుగా శుక్రవారం గడప గడపకు ఎన్నికల ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, వేములవాడ మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఈసందర్భంగా నాలుగో వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట రాజు మాట్లాడుతూ నాలుగో వార్డు ప్రజలకు అందుబాటులో ఉండి అహర్నిశలు కృషి చేస్తున్నానని, నాపై విశ్వాసంతో ఒకసారి కౌన్సిలర్‌గా అవకాశం కల్పిస్తే నిస్వార్థంగా ఎన్నో సేవలు చేసి మీ మన్ననలు పొందుతానని వాడు అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, మీరందరూ తప్పకుండా ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

# వార్డు సమస్యల పరిష్కారానికి కృషి

### పదో వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గుర్రం సుజిత్



**ప్రజాపక్షం/చొప్పదండి :** వార్డు పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పదో వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గుర్రం సుజిత్ తెలిపారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన వార్డు పరిధిలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తనను ఆదరించి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. రానున్న ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలిపిస్తే వార్డు అభివృద్ధికి బాటలు వేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మేడిపల్ల సత్యం సహకారంతో వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గుర్రం నీరజ, గుంటి స్వరూప, బొడిగె గంగరాజు, నూనె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# 43వ డివిజన్‌లో మద్దెల దినేష్‌కు మద్దతు



ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న సిపిఐ నగర సమితి నాయకులను కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు ప్రజలను, కార్మికులను కోరారు. శుక్రవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ కార్పొరేషన్ లో 9వ డివిజన్ నుంచి రేణికుంట్ల నరేశ్ (ప్రీతం), 16వ డివిజన్ నుంచి కదారి స్వరూప, 41వ డివిజన్ నుంచి మార్కపూరి సూర్య, 47వ డివిజన్ నుంచి కన్నెబోయిన కనకరాజు, అదేవిధంగా 43వ డివిజన్‌లో మద్దెల దినేష్‌లు కార్పొరేటర్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వీరి గెలుపు కోసం ఏఐటియుసి కృషి చేయడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ అడిగిన స్థానాలు ఇవ్వకుండా అధికారం ఉన్నదనే ఆలోచనతో సిపిఐ, ఏఐటియుసిని స్థానిక కాం గ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గుర్తించకపోవడం విచారకరమని వారు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో సిపిఐ స్వంతంగా నాలుగు డివిజన్లలో పోటీ చేస్తుందని, ఈ తరుణంలో ఆయా డివిజన్లలో పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థులకు అదేవిధంగా 43వ డివిజన్‌లో ప్రజలకు అండగా నిలబడుతున్న మద్దెల దినేష్‌కు ఏఐటియుసి మద్దతు తెలుపుతుందని, కార్పొరేటర్‌గా దినేష్‌ను గెలిపించాలని ప్రజలను, కార్మికులను, సిపిఐ, ఏఐటియుసి నాయకులను, కార్యకర్తలను వారు కోరారు. ఈ సమావేశంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎ గౌస్, నాయకులు చెప్యాల భాస్కర్, ఆకునూరి శంకర్, బి.వెంకటేశ్వర్లు, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, నాయిని శంకర్, దాసరి శ్రీనివాస్, ఎర్రగొల్ల చేరాలు, పర్లపెల్లి రామస్వామి, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

# ఇసుక దందాపై అధికారుల చోద్యం

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** గోదావరి పరివాహక ప్రాంతాల గ్రామాలలో నీ గోదావరి నదిలో ఇసుక నిల్వలు భారీగా మేటలు నిల్వ ఉండడంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. నిత్యం పదుల సంఖ్యల ట్రాక్టర్లలో ఇసుకను లోడ్ చేస్తూ అక్రమంగా తరలించి దంపులు దంపులుగా పోసి రాత్రి 9 దాటితే చాలు భారీ వాహనాలైన లారీలలో తరలిస్తున్న సంబంధిత అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నట్లే వ్యవహరిస్తున్నారు. ట్రాక్టర్లలో ఇతర మండలాలకు అక్రమంగా తరలిస్తూ అధికారులకు కంటపడిన పట్టింపే లేనట్లు చూస్తున్నారు. ఇసుక అక్రమ వ్యాపారానికి సంబంధిత శాఖలోని కొందరు అధికారుల సహకారం ఉండడంతోనే వీరి అక్రమ దందాను అడ్డుకునే నాధులే కరువయ్యారు. పగలు రాత్రి తేడా లేకుండా అక్రమంగా ఇసుక ట్రాక్టర్లు రోడ్డు ఎక్కుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. పొద్దంతా ట్రాక్టర్లలో తరలిస్తూ రాత్రివేళ లారీలలో జంపు చేయిస్తున్న ఇసుక అక్రమ దందాపై అధికారులు ఇప్పటికైనా దృష్టి సారిస్తారో లేక మమ అనిపిస్తారో చూడాలి మరి.

# అభివృద్ధిని చూసి ఓటు వేయండి

### మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** హుస్నాబాద్ పట్టణంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయండి, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని బిసి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఓటర్లను కోరారు. శుక్రవారం పట్టణంలో పలు వార్డుల్లో భారీ ర్యాలీగా కార్యకర్తలు, మహిళలతో కలిసి ఇంటింట ప్రచారంలో ప్రజా పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని మంత్రి పొన్నం ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ హుస్నాబాద్‌ను పెద్ద నగరంగా మార్చేలా కార్యాచరణతో ముందుకు పోతున్నామని అన్నారు. ఆ దిశగా గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేస్తామన్నారు. పట్టణంకు అతి సమీపంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు పారిశ్రామికీకరణ ఇలా ఎన్నో అంశాల్లో కార్యాచరణతో ముందుకు పోతున్నామని అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని 20 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి మున్సిపల్‌లో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేడం లింగమూర్తి, బొల్లి శెట్టి శివయ్య, చిత్తారి రవిందర్ పద్మ, అయా వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు.

# జాకబ్ ఆశయ సాధన కోసం కృషి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఇప్టా జాతీయ నాయకులు, ప్రజా కళాకారుడు అమరజీవి కామ్రేడ్ జాకబ్ ఆశయ సాధన కోసం మనమంతా కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. జాకబ్ 5వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం గోదావరిఖని న్యూ అశోక్ టాకీస్ వద్ద ఉన్న జాకబ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ జాకబ్ గోదావరిఖని ప్రాంతంలో సింగరేణి ఉద్యోగిగా ఉంటూ, గని కార్మికుల కోసం, పేద ప్రజల కోసం పాటలు, నాటికల ద్వారా చైతన్యం కల్గించారని అన్నారు. అదేవిధంగా సిపిఐ నాయకునిగా కూడా విశేష సేవలు అందించారని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్టా జాతీయ నాయకులు, ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కే.స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్, ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర ప్రజానాట్య మండలి నాయకులు కన్నం లక్ష్మి నారాయణతో పాటు ప్రజా సంఘాల నాయకులు పడాల కనకరాజు, ఎర్రగొల్ల చేరాలు, బూడిద మల్లేష్, లక్ష్మి రాజం, ఏఐటియుసి ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# పేదల అండ.. ఎర్ర జెండా

### సిపిఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీరు సత్యనారాయణ పిలుపు

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** పేదల అండ ఎర్ర జెండా, సిపిఐ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని సిపిఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీరు సత్యనారాయణ పట్టణ ఓటర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిపిఐ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గడిపె మల్లేశ్, కొయడ కొమురయ్య, లక్ష్మి నారాయణ, కనకవ్వలతో కలిసి పట్టణంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేసే సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌరవెల్లి ప్రాజెక్టు, వరద కాల్వ సాధించాం, అలాగే పట్టణంలో డిపో కాలనీలో, కొమటి రాజవీరుకాలనీల్లో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను ఇప్పించామన్నారు. అందుకే పట్టణంలో ఎర్రజెండాను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, సంజీవరెడ్డి, మల్లారెడ్డి, కనకవ్వ, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం




మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి
మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ నగర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీని గెలిపిస్తే అధిక నిధులు కేటాయించి నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు అవకాశముంటుందని డిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కార్పొరేషన్ ఎన్నికల సమన్వయకర్త, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇంచార్జ్ ఉట్కూరు నరేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహమత్ హుస్సేన్, మాజీ శాసనసభ్యులు ఆరేపల్లి మోహన్, కోడూరు సత్యనారాయణ గౌడ్, మాజీ హౌస్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేడిపల్లి సత్యం మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత పదేళ్లలో కార్పొరేటర్లపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపించి, తరువాత వారిని పార్టీలలో చేర్పించుకున్న ఘటనలను ప్రజలు మరిచిపోలేదని, స్థానిక నాయకులు ఢిల్లీలో ఒక మాట, గల్లీలో మరో మాట మాట్లాడితే ప్రజలు నమ్మరని విమర్శించారు. గత బీఆర్ఎస్ కార్పొరేటర్లు విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడ్డారని, భూములను కబ్జాలు చేశారని ఆరోపించారు. కోట్లాది రూపాయలు స్మార్ట్ సిటీ పేరిట దండుకున్నారని విమర్శించారు. మళ్లీ కొందరు టిఆర్ఎస్ నుంచి బిజెపిలో చేరి ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అడుగుతున్నారని పేర్కొన్నారు. కచ్చితంగా కరీంనగర్ జిల్లాలో కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు చొప్పదండి, జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని మేడిపల్లి సత్యం ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకరులు సమావేశంలో ఆకారపు భాస్కర్ రెడ్డి, ఏండి తాజ్, సిరాజు హుస్సేన్, వెన్న రాజ మల్లయ్య, కుంభాల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇవిఎం గోదాంల పరిశీలన



మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్‌కు సెలవు

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి కలెక్టరేట్ సమీపంలోని ఈవిఎం గోదాంను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నెలవారి పరిశీలనలో భాగంగా గోదాంలను పరిశీలించారు. లాగ్‌బుక్ చెక్ చేసి విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం చుట్టు సిసి కెమెరాల పనితీరు, పోలీసు అధికారులు 24/7 గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూఅధికారులు తరుచు గోదాం పరిసర ప్రాంతాన్ని పర్యవేక్షణ చేయాలని సూచించారు.

**ఈనెల 11న సెలవు ప్రకటించిన కలెక్టర్**

2వ సాధరణ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించేందుకు ఎన్నికలు నిర్వహించనున్న మున్సిపల్ ప్రాంతాల్లో ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల పోలింగ్ రోజు ఈనెల 11న సెలవును ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హైమావతి తెలిపారు. ఈనెల 11న ఎన్నికలు జరుగనున్న జిల్లాలోని హుస్నాబాద్, చేర్యాల, గజ్వేల్ ప్రజ్ఞాపూర్, దుబ్బాక మున్సిపాల్టీల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ. ప్రైవేటు సంస్థలకు హాలిడేను అమలు చేయటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు.పరిశ్రమలు. వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేసేలా ఉత్తర్వులు జారీ చేయటం జరిగిందన్నారు. అలాగే ఎన్నికలు పోలింగ్ నిర్వహించనున్న అన్ని భవనాలు, సంస్థలకు 10న సెలవు ప్రకటించినట్లు తెలిపారు. ఎన్నికలు సజవుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఓటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరు తమ ఓక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# మార్చిలోపు మరో 500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** మార్చి 2026 నాటికి మరో 500 ఎకరాలలో ఆయిల్‌పామ్ పంట సాగు జరగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయిల్‌పామ్ పంట సాగుపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పెద్దపల్లి జిల్లాలో ఇప్పటి వరకు నూతనంగా మనం 525 ఎకరాల ఆయిల్ పామ్ పంట సాగు చేశామని అన్నారు. మార్చి నాటికి మరో 500 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు పూర్తి చేయాలని, దీనికి తగిన విధంగా డ్రిప్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని లక్ష్యం చేరుకోవాలని అన్నారు. 10 ఎకరాల పైగా ఉన్న ప్రతి రైతు ప్రత్యేకంగా టార్గెట్ చేయాలని అన్నారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి, ఉద్యాన విస్తరణ అధికారి, ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్‌లు, డ్రిప్ సిబ్బందికి లక్ష్యాలు కేటాయించాలని అన్నారు. ఆయిల్ పామ్ మొక్కలతోపాటు, డ్రిప్ ఏర్పాటుకు కూడా రైతుల నుంచి డీడీలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో వచ్చే ఆదాయం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ ఏర్పాటు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌తో పాటు డ్రిప్ ఏర్పాటుకు సమాంతరంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, హార్టికల్చర్ అధికారులు మహేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆ.. విధానాలు వెనక్కి తీసుకోవాలి

### రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోట్లను రద్దు చేయాలని విద్యుత్ సవరణ చట్టం 2025, విబిజి రాంజీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసిలో 100% విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకరమైన నిర్ణయాలను ఉపసంహరించాలని కార్మిక ప్రజా రైతు వ్యవసాయ కూలీ వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలు ఈనెల 12న జరిగే జరిపే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్‌లో జగిత్యాల కార్మిక రైతు వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని, ఈ సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఇందూరి సులోచన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై లెల్లెల బాలకృష్ణ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకొస్తున్నదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఇందూరి సులోచన, జిల్లా కార్యదర్శి కోమటి చంద్రశేఖర్, జిల్లా కోశాధికారి వెలుమలపల్లి వెంకటాచారి, టి.యు.సి.ఐ జిల్లా నాయకులు ఆరేళ్ల భీమయ్య, మధ్యాహ్న భోజన నాయకులు పద్మ, స్వాతి పాల్గొన్నారు.


# మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యం



సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 57వ డివిజన్ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ అభ్యర్థిని లతశ్రీ కసిరెడ్డినే గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున కరీంనగర్ నగరంలోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులతో పాటు సిపిఐ అభ్యర్థిని గెలిపించి మేయర్ పీఠాన్ని కాంగ్రెస్‌కు అప్పగించేందుకు కాంగ్రెస్ సిపిఐ శ్రేణులంతా కలిసి పని చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లోని 57వ డివిజన్ గణేష్ నగర్‌లో లతశ్రీ గెలుపు కోసం ఇంటింటా తిరుగుతూ చాడ వెంకట్ రెడ్డి, నరేందర్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి, నరేందర్ రెడ్డిలు మాట్లాడుతూ.. దేశంలో మొట్టమొదటి పార్టీలుగా కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి భారత దేశ స్వాతంత్రం కోసం ఈ దేశ ప్రజల ప్రగతి కోసం, సంక్షేమం కోసం పనిచేసిన పార్టీలని ఈ రెండు పార్టీల వల్లనే ప్రజాస్వామ్యం ఇంకా మనుగడ కొనసాగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు సిపిఐ అభ్యర్థిని కూడా గెలిపించాలని ఓటర్లకు వెంకటరెడ్డి, నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో 57వ డివిజన్ అభ్యర్థిని లతశ్రీ కసిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, నాగెల్లి లక్ష్మారెడ్డి, న్యాలపట్ల రాజు, గూడెం లక్ష్మి, బోయినీ తిరుపతి, సహాయ కార్యదర్శి పైడిపెల్లి రాజు, కాంగ్రెస్ నాయకులు పున్నం మహేశ్, మల్లిఖార్జున శైలజ, బత్తినీ చంద్రయ్య, కాళిదాస్ రేణుకతోపాటు సిపిఐ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు



ఎస్పి జానకి షర్మిల హెచ్చరిక

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వంలో సోషల్ మీడియా వేదికగా విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా,అభ్యంతర కర పోస్టులు పెట్టినాఇష్టానుసారం వ్యవహరించినా ఊరుకునేది లేదని జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఐపీఎస్ కఠిన హెచ్చరికలు జారీ చేశారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు.ఎంఐఎం అభ్యర్థి,నాంపల్లి ఎమ్మెల్యేపై కేసు నమోదు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక వివాదాస్పద ఘటనను ప్రస్తావిస్తూ,పట్టణంలోని ఎంఐఎం వార్డు అభ్యర్థితో పాటు,నాంపల్లి ఎమ్మెల్యే పై ఇప్పటికే కేసు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఎవరైనా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితేపోలీసులకు సమాచారం అందించాలని, శాంతిని కాపాడటంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

## కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు

డిసిపి భాస్కర్



**ప్రజాపక్షం/హాజీపూర్ :** రానున్న ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు అత్యంత కీలకమని డిసిపి భాస్కర్ అన్నారు. హాజీపూర్ మండలం ముల్కల గ్రామంలోని ఐజ ఇంజనీరింగ్ కళాశాలను ఏసిపి ప్రకాష్, సిఐ అశోక్ తో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు.డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన బందోబస్తు చర్యలపై విస్తృతంగా పరిశీలన చేశారు. కేంద్రాల ప్రవేశ ద్వారాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు, పోలింగ్ సామగ్రి నిల్వ చేసే స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాల్స్‌ను సమగ్రంగా తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి పాయింట్ వద్ద సరిపడా పోలీస్ సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. సిసి కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, విద్యుత్ సరఫరా లోపం తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏ చిన్న అనుమానం వచ్చినా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు.ఎస్ఐ కిరణ్ కుమార్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## గజ్వేల్ మున్సిపల్‌పై కాంగ్రెస్ జెండా ఎగరవేద్దాం

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేద్దామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ షరీఫ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాల ఫలితంగా రింగ్ రోడ్డు నిర్మాణంతోపాటు మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర పనులు అసంపూర్తిగా ఉన్నాయని విమర్శించారు. అంతేకాకుండా తాగునీటి సమస్య, లోపించిన పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అయితే మల్లన్న సాగర్ నిర్మాణంతో సర్వం కోల్పోయిన ముంపు బాధితులు బిఆర్ఎస్ నేతలను నిలదీయాలని పిలుపు ఇచ్చారు. నిర్వాసితులను నమ్మించి గొంతు కోసిన కేసీఆర్, హరీష్ రావులు ఆర్ అండ్ ఆర్ కాలనీ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడాన్ని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాలు పేదలకు వరప్రసాదమేనంటూ ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తేవాలని, వాటి పరిష్కారం కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కన్నా యాదవ్ పాల్గొన్నారు.

## మండల సమాఖ్య భవనానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/రెబ్బెన :** రెబ్బెన మండలం గోలేటి మండల సమాఖ్య కార్యాలయ నూతన భవన నిర్మాణానికి గంగాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వేలువోజీ వెంకటేశం చారి భూమి పూజ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పది లక్షల రూపాయల నిధులతో మంజూరైన ఈ భవనానికి శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గంగాపూర్ గ్రామ పంచాయతీలో చేపట్టే అభివృద్ధి పనులకు అందరూ కలిసికట్టుగా సహకరించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్ టిఏ మెంబర్ లావుడ్యా రమేష్, మండల నాయకులు మోడెం చిరంజీవి గౌడ్, ఐకెపీ ఏపీఎం దుర్గయ్య, మండల సూపరింటెండెంట్ వాసు, మండల ఏఈ, సమాఖ్య అధ్యక్షురాలు వనిత, ఐకెపి, సిసిలు కాశయ్య, తిరుపతి, శంకర్, ఉప సర్పంచ్ సర్ఫరాజ్, వార్డు సభ్యులు వినోద్ సంజీవ్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌తోనే పట్టణాల అభివృద్ధి

ఎమ్మెల్యే చింతాప్రభాకర్

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ,బిఆర్ఎస్ పార్టీతోనే పట్టణాల అభివృద్ధి సాధ్యమని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని 20,21 వార్డుల బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా రజక సంఘం అధ్యక్షులు శివరాజ్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలవి కాని హామీలతో మభ్యపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపు నిచ్చారు. రెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమి లేదని విమర్శించారు. మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ,ఆయా వార్డుల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట

బిసిల అభివృద్ధిని అడ్డుకున్న బిఆర్ఎస్ పార్టీ

పేదలకు వరంలా కాంగ్రెస్ చరిత్రాత్మక పథకాలు

మాజీ ఎమ్మెల్యే,కూన శ్రీశైలం గౌడ్



**ప్రజాపక్షం / గజ్వేల్ :** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి చారిత్రాత్మక పథకాలతో పేదలను ఆర్థికంగా తీర్చిదిద్దుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే, గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్చార్జి కూన శ్రీశైలం గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు సారిక శ్రీనివాస్ రెడ్డి, గాడిపల్లి నవ్యశ్రీ, షహనాజ్ సమీర్, గాజుల భారతమ్మ, కొండల్ రెడ్డి తదితరులకు మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా ఆరు గ్యారెంటీలు అమలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఏకకాలంలో రూ. 2 లక్షల పంట రుణమాఫీ చేసిన ఘనత దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ భర్తీతోపాటు, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తూ 42 శాతం రిజర్వేషన్ అమలుకు కట్టుబడి ఉండగా, బిఆర్ఎస్ పార్టీ నేతలు కోర్టుల్లో కేసులు వేయించి వారి అభ్యున్నతిని అడ్డుకున్నట్లు ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్లకు అనుకూలమని దొంగ మాటలు చెప్పిన బిఆర్ఎస్ బుట్టెంగారి మాధవరెడ్డితో కేసులు వేయించి బీసీల అభ్యున్నతి అడ్డుకున్నట్లు చెప్పారు. గజ్వేల్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని, తద్వారా సీఎం రేవంత్ రెడ్డి నుండి అధిక నిధులు సాధించవచ్చని చెప్పారు. అంతేగాకుండా మల్లన్న సాగర్ ముంపు బాధితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాల ఫలాలు పేదలకు చేర్చుతుండడంతో వారి వారి జీవితాల్లో వెలుగులు కనిపిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పెద్దిరెడ్డి అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## స్ట్రాంగ్ రూమ్‌లో.. ఇంటర్ ప్రశ్నపత్రాలు భద్రపర్చాలి

కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ప్రశ్న, జవాబు పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి పటిష్ట పోలీస్ బందోబస్తు కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. శుక్రవారం జిల్లాకు కేటాయించిన ప్రశ్న, జవాబు పత్రాల వాహనాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుండి మార్చి 31 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో పరీక్షల నిర్వహణ కోసం 19 కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 9,716 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్షా పత్రాల భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని అధికారులను హెచ్చరించారు. పరీక్షల సజావుగా నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేయాలని జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అధికారి రాందాస్‌ను ఆదేశించారు.ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా కేంద్రాల వద్ద వసతులు కల్పించాలని సూచించారు.

## నిర్మల్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచార హోరు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మున్సిపల్ ఎన్నికల వేళ నిర్మల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం హోరెత్తుతోంది.నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుచాడి శ్రీహరి రావు,కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి నేతృత్వంలో శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి వివరిస్తూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.31వ వార్డులో అపూర్వ స్పందన శాస్త్రి నగర్,బోయివాడ ప్రాంతాల్లో 31వ వార్డు కాంగ్రెస్ అభర్థి ధర్మాజీ శ్రీనివాస్ గెలుపును కాంక్షిస్తూ నేతలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన చైర్మన్ అభ్యర్థి అప్పాల కావ్య,మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల అనురాధ గణేష్‌లతో పాటు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.అడప వి జయలక్ష్మి పోశెట్టి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ చింతకుంట వాడ,సోమక్షత్రియ సంఘం ఏరియా ,సునార్ గల్లీ,బంజాయిండ్లు,పాత కస్బా స్కూల్ ప్రాంతాల్లో కుచాడి శ్రీహరిరావు,వేణుగోపాల చారి,పిసిసి ప్రధాన కార్యదర్శి అంబడి రాజేశ్వర్ పర్యటించారు.మధ్యాహ్నం జోహారానగర్ కాలనీ మసీదు,పాత బస్టాండ్ ప్రాంతంలోని జామ మసీదు వద్ద మైనారిటీ సోదరులను నేతలు వ్యక్తిగతంగా కలిశారు. ప్రార్థనల అనంతరం వారితో ముచ్చటించి,మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని వివరిస్తూ ఈ ఎన్నికల్లో తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారుఎర్రవోతురాజేందర్,కొట్టె శేఖర్,మాజీ జెడ్‌పిటిసి మారుతి, పుదరి అరవింద్,సభకలీం, అతీక్,అడప పోశెట్టి, విగ్నేష్ తేజ పాల్గొన్నారు.



## కార్మిక డిమాండ్ల సాధన పోస్టర్ ఆవిష్కరణ

ఏఐటియుసి

జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, కార్మిక న్యాయమైన డిమాండ్ల సాదనకై ఈనెల 12న చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. శుక్రవారం ఏఐటియుసి ఆద్వర్యంలో సమ్మెకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు.కార్మిక సంఘాలు పోరాడి సాధించిన చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిన 44 రకాల కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలని, కార్మికుల కనీస వేతనం రూ. 26 వేలు నిర్ణయించి అమలు చేయాలని, కనీస పెన్షన్ 9 వేలు అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టం పేరు మార్పును ఉపసంహరించుకొని యథాతథంగా కొనసాగించాలని, ఎల్ఐసిలో వంద శాతం ప్రయివేటు పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, రైతు వ్యతిరేక మూడు చట్టాలను రద్దుచేయాలని తదితర డిమాండ్లతో ఈనెల 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మండల కార్యాలయాల ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పి. హనుమాండ్లు, అనిల్, నాయకులు తిరుపతి, ఇమ్రాన్ అలీ, పిరోజ్ అలీ, భారతి, భాగ్యలక్ష్మి , అరుణ, రమేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/మంచిర్యాల :** వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ సూచించారు. పాత మంచిర్యాల అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎన్‌టిఆర్ నగర్, రాంనగర్ వాడలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఇంటింటికీ తిరిగి వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వాతావరణ మార్పులతో జ్వరాలు, దగ్గు, సర్ది రావడమే కాకుండా చిన్నపిల్లలకు ఒంటిపై ర్యాష్ వస్తోందని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా రాకుండా దోమలు పెరగకుండా, కుట్టకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వివరించారు. మంచినీటిని కాచి చల్లార్చి వడపోసి తాగాలని, ఆహార పదార్థాలను వేడివేడిగా తీసుకోవాలని సూచించారు. జీవనశైలిలో మార్పుల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఆరోగ్యకరమైన పరిసరాలను ఉంచుకోవడం ద్వారానే రోగాలను దరిచేరకుండా చూసుకోవచ్చని పేర్కొన్నారు. సుమన్, డిటి హెచ్ఎన్ఆర్ఎస్ పద్మ,ఆరోగ్య కార్యకర్తలు పద్మ, అంజలి పాల్గొన్నారు.

## ఇవిఎం గోడౌన్ సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును గమనించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు బాలరాజు, సిబ్బంది సాత్విక్, విజయేందర్‌రెడ్డి ఉన్నారు.

## అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

**ప్రజాపక్షం/రామాయంపేట:** అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం రామాయంపేట పట్టణంలోని 6,10,12 వార్డుల్లో అభ్యర్థులు పుట్టి సందీప్, ఎనిశెట్టి శ్రీవాణి అశోక్, పోచమ్మల నవనీత గణేష్‌లకు మద్దతుగా వార్డుల్లో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు.బిఆర్ఎస్ నాయకులు గత పది సంవత్సరాల్లో అభివృద్ధి చేయకుండా మళ్లీ ఏం మొహం పెట్టుకొని ఓట్లు అడుతున్నారని ప్రశ్నించారు. మేము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టామని నిరుపేదలకు ఉచిత బియ్యం, రేషన్ కార్డులు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ఘనత రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. అలవికాని హామీలతో మళ్లీ బిఆర్ఎస్ నాయకులు ఓట్ల కోసం వస్తున్నారని గతంలో ఎందుకు చేయలేదో నిలదీయాలని పిలుపునిచ్చారు. మైనంపల్లి కుటుంబం అధికారంలో ఉన్నా, లేకున్నా సేవా కార్యక్రమాలు చేశామని ప్రతి గ్రామంలో ఇప్పటికి చేస్తునే ఉన్నామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 12వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే నేనే దగ్గరుండి రామాయంపేట పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు దత్తత తీసుకొని ఇక్కడకు వచ్చిన నిదులను సిద్దిపేటకు తరలించారని స్థానికంగా ఉన్న పద్మాదేవేందర్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదన్నారు. గజవాడ నాగరాజు, మైపాల్‌రెడ్డి, సరాఫు యాదగిరి, దేమె యాదగిరి, చింతల స్వామి, విప్లవ్‌కుమార్, చిలుక స్వామి, ఎనిశెట్టి అశోక్, యాదనాగరాజు, ఇసుక ప్రకాష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## సిపిఐ అభ్యర్థులను గెలిపిస్తేనే పట్టణాభివృద్ధి

**ప్రజాపక్షం/బెల్లంపల్లి:** బెల్లంపల్లి పట్టణం అభివృద్ధి చెందాలంటే భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ కోరారు. మున్సిపాలిటీలోని 10వ వార్డు సిపిఐ అభ్యర్థి గుర్రాల శారద సారయ్య గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం రైల్వే స్టేషన్ పెద్దనపల్లి ప్రాంతంలో ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. అవినీతిపరులైన బూర్జువా పార్టీల అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ పేద ప్రజల అభ్యున్నతికి నిరంతరం పోరాటాలు చేసే సిపిఐని ఆదరించి కంకి కొడవలి గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా పక్షాన నిలిచే అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారానే వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పేదలకు అండగా ఉండే పార్టీగా సిపిఐకి పట్టం కట్టాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, 10వ వార్డు అభ్యర్థి గుర్రాల శారద, గుర్రాల సారయ్య, గోలేటి రాయలింగు, నస్పూర్ భీమయ్య, మారాలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.







**నిజామాబాద్ :** ప్రజల సమస్యలు పట్టని పార్టీలను ఓడించి నిత్యం పేద బలహీన వర్గాల ప్రజల కోసం పని చేసే సిపిఐ పార్టీ అభ్యర్థి స్వప్నను గెలిపించాలని జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓమయ్య అన్నారు. శుక్రవారంనగర కార్పోరేషన్ సిపిఐ పార్టీ 17వ డివిజన్ అభ్యర్థి బి. స్వప్నకు మద్దతుగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఇంటికెళ్లి ఎన్నికల ప్రచారంనిర్వహించారు. మ తోన్మాదాన్ని ఓడించాలని, ధనార్జనే తప్ప ప్రజల సమస్యలు పట్టని పార్టీలను ఓడించి నిత్యం పేద బలహీన వర్గాల ప్రజల కోసం పని చేసే సిపిఐ పార్టీ అభ్యర్థి స్వప్న కంకి కొడవలి గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓమయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాలనీలో ప్రజలు సీపీఐ అభ్యర్థికి మద్దతుగా స్వచ్ఛందంగా పాల్గొనటం అభినందనీయమని ఖచ్చితంగా కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించుకుని తమ డివిజన్ సమస్యలు పరిష్కరించుకుంటామని ప్రజలు హామీనిస్తున్నారన్నారు. జిల్లా కమిటీ సభ్యులు ఇమ్రాన్‌అలీ, నాయకులు ఫిరోజ్ తిరుపతి, సుజాత, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా.. వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండలంలోని మామిడిపల్లి గ్రామశివారు ప్రాంతంలోని అపురూప వెంకటేశ్వర స్వామి ఆలయంలో 3వ రోజు పాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా వెంకటేశ్వర స్వామివారికి నియమ నిష్టలో మేళతాళాల మధ్య శ్రీవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ బ్రహ్మోత్సవాల కార్యక్రమాల్లో జిల్లాలో నలుమూలాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వ్యవస్థాపకురాలు అమృతలతరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం స్వామివారికి ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించటం జరిగిందని భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసి వెంకటేశ్వర స్వామి వారిని నియమి నిష్టలతో బ్రహ్మోత్సవాలను నిర్వహించామన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు సోమవారం స్వామివారికి నిత్య హోమం, శ్రీవారికళ్యాణోత్సవాల్లో భాగంగా అపురూప వెంకటేశ్వర ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందన్నారు. స్వామిని భజన కార్యక్రమాల మధ్య శ్రీవారికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకురాలు అమృతలత తెలిపారు. కార్యక్రమంలో అమృతలత, ప్రభాదేవి, సుజాత, వసంత, విజయ, సునీత, సురేందర్‌రెడ్డి, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# అండర్-19 వన్డే వరల్డ్ కప్‌లో ఆరోసారి

# ఛాంపియన్‌గా టీమిండియా



పురుషుల అండర్–19 వన్డే వరల్డ్ కప్‌లో భారత కుర్రాళ్లు టైటిల్ పట్టేశారు. తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన భారత జట్టుకు ఆరో టైటిల్ కట్టబెట్టారు. ఇంగ్లంగ్‌తో ఫైనల్లో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(175) విధ్వంసక శతకంతో విరుచుకుపడగా.. బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటర్లను బెంబేలెత్తించారు. అంబ్రిష్(3–56) విజృంభించగా 100 పరుగుల తేడాతో ప్రత్యర్థిని మట్టికరిపించింది. 174కే ఏడు వికెట్లు పడినా.. టెయిలెండర్ ఫాల్క్నర్(115) వీరోచిత సెంచరీ బాదినా సరిపోలేదు. కనిష్క్ ఓవర్‌లో ఖిలాన్ పటేల్ డైవింగ్ క్యాచ్ అందుకోగా ఆరోసారి అండర్–19 ఛాంపియన్‌గా నిలిచింది టీమిండియా.
ఇటీవల రైజింగ్ స్టార్స్ ఎమర్జింగ్ ఆసియా కప్, ఆసియా కప్‌లో తేలిపోయిన భారత జట్టు ఏనుగు కుంభస్థలాన్ని కొట్టింది. అజేయంగా అండర్–19 ప్రపంచకప్ ఫైనల్‌కు దూసుకెళ్లిన టీమిండియా అదిరే ఆటతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి టైటిల్‌ను ఒడిసిపట్టింది.
టాస్ గెలిచిన భారత్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(175) వీరకొట్టుడుకు ఆయుష్ మాత్రే (53), అభిగ్యాన్ కుందు(40) మెరుపులతో 411 పరుగులతో ఇంగ్లాండ్‌పై మానసికంగా పైచేయి సాధించింది. కొండంత స్కోర్ కొట్టిన టీమిండియాకు ఛేదనలో ఇంగ్లండ్ ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. టాపార్డర్ విఫలమవ్వగా ఇంగ్లండ్ ఓటమి ఖాయమైంది. కానీ, టెయిలెండర్లు అసమాన పోరాటంతో భారత బౌలర్లను విసిగించారు. కానీ.. అంబ్రిష్(3–56), కనిష్క్(2–63), దీపేశ్(2–64) అద్భుతమైన బౌలింగ్‌తో ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లారు. రికార్డు ఛేదనలో ఇంగ్లండ్‌కు ఐదో ఓవర్లోనే అంబ్రిష్ షాకిచ్చాడు. ఓపెనర్ జోసెఫ్ మూరెస్ (17)ను బౌల్ చేసి టీమిండియాకు బ్రేకిచ్చాడు. అనంతరం బెన్ మేయ్స్(45) జతగా బెన్ డాకిన్స్(66) బౌండరీలతో చెలరేగాడు. అర్ధ శతకానికి చేరువైన.. బెన్ స్వీప్ షాట్ ఆడిన హెనిల్ పటేల్ క్యాచ్ పట్టగా వెనుదిరిగాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా క్రీజ్‌లో పాతుకుపోయిన డాకిన్స్‌ను ఆయుష్ మాత్రే బోల్తా కొట్టించాడు. రాల్ఫీ ఆల్బర్ట్(0) క్రీజులోకి రావడమే ఆలస్యం రనౌటయ్యాడు. కవర్స్‌లో ఆడిన బంతిని ఆపిన వైభవ్ మెరుపు వేగంతో వికెట్ కీపర్ కుందు వైపు విసిరాడు. అతడు వికెట్లను గిరాటేయగా..174కే ఇంగ్లండ్ సగం వికెట్లు కోల్పోయింది. ఆ కాసేపటికే దీపేశ్(239) ఓవర్లో ఫర్హాన్ అహ్మద్(1) కుందు చేతికి చిక్కాడు. సెబాస్టియన్ మోర్గాన్ సైతం అతడికే రిటర్న్ క్యాచ్ ఇవ్వగా ఇంగ్లండ్ ఓటమి ఖాయమైంది.
**దంచేసిన ఫాల్క్నర్** ...మిడిల్ ఓవర్లలో వరుస వికెట్లతో ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టిన భారత బౌలర్లకు ఫాల్క్నర్(115), జేమ్స్ మింటో(28) చుక్కలు చూపించారు. ప్రధాన బ్యాటర్లు ఔటైనా వీరు మాత్రం దీటుగా ఆడారు. ఫాల్క్నర్ ఎడాపెడా ఫోర్లతో విరుచుకుపడ్డాడు ఎనిమిదో వికెట్‌కు 92 రన్స్ కలిపిన ఈ జోడీని అంబ్రిష్ విడదీసి బ్రేకిచ్చాడు. సిక్సర్లతో రెచ్చిపోయిన ఫాల్క్నర్ సెంచరీ తర్వాత కనిష్క్ ఓవర్లో వెనుదిరిగాడు. ఖిలాన్ పటేల్ ముందుకు డైవ్ చేస్తూ క్యాచ్ అందుకోగా 311 వద్ద ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. 100 పరుగుల తేడాతో గెలుపొందిన టీమిండియా తొమ్మిదోసారి ఛాంపియన్‌గా నిలిచింది.

## పాకిస్థాన్ జట్టుపై నిషేధం విధించాలి

### ఐసిసిని కోరిన బిజెపి ఎంపి ఠాకూర్



భారత్, శ్రీలంక వేదికగా రేపటి నుంచి టి–20 ప్రపంచకప్ షురూ కానుంది. వామప్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన భారత జట్టు తొలి లీగ్ మ్యాచ్‌లో యుఎస్‌ఎతో తలపడనుంది. కానీ.. భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు మాత్రం అనిశ్చితి కొనసాగుతోంది. ఇండియాతో మ్యాచ్ బాయకాట్ చేస్తామని పాకిస్థాన్ ప్రభుత్వం వెల్లడించగా.. మేము ఆడేందుకు సిద్ధమే అని భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తేల్చి చెప్పాడు. ఈ నేపథ్యంలో బిసిసిఐ మాజీ అధ్యక్షుడు, బిజెపి ఎంపి అనురాగ్ ఠాకూర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. కొలంబోలో ఇండియాతో మ్యాచ్ ఆడకుంటే పాక్ జట్టుపై నిషేధం విధించాలని ఆయన పేర్కొన్నాడు. భారత్‌లో వరల్డ్ కప్ ఆడబోమని బెట్టు చేసినందుకు బంగ్లాదేశ్‌కు వేటు పడింది. అప్పటి నుంచి ఆ దేశ క్రికెట్ బోర్డుకు మద్దతిస్తున్న పాకిస్థాన్ మెగా టోర్నీలో భారత జట్టుతో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తామని తెలిపింది. అయితే.. టీమిండియా కెప్టెన్ మాత్రం కొలంబో వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకున్నామని.. ఫిబ్రవరి 15న పాక్‌తో మ్యాచ్ ఆడేందుకు స్టేడియానికి వెళ్తామని చెప్పాడు. శ్రీలంక బోర్డు సైతం ఇండియాతో మ్యాచ్ ఆడాలని పాక్ బోర్డుకు లేఖ రాసింది. లాహోర్ దాడిని గుర్తు చేస్తూ మ్యాచ్‌ను బాయ్‌కాట్ యొద్దని కోరింది. అయినా సరే పాక్ బోర్డు స్పందించలేదు. దాంతో, ఎంపిక పద్ధతిన ప్రపంచకప్ ఆడాలనుకున్న పాక్‌పై చర్యలు తీసుకోవాలని బిజెపి ఎంపీ, మాజీ బిసిసిఐ అధ్యక్షుడు ఠాకూర్ అన్నాడు.

## సైన్స్

# మెదడుపై కాలం ప్రభావం!



జీతాలు ఆలస్యం వచ్చినట్టు... తీర్చాల్సిన అప్పుల గడువు చాలా తొందరగా వచ్చినట్టు అనిపించడం సగటు జీవి జీవితంలో సహజం. అయితే, నిజంగానే కాలం అనేది వివిధ వయసుల వారిపై వేరువేరుగా ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. చిన్నతనంలో ఒక రోజు చాలా సుదీర్ఘంగా ఉన్నట్టు.. వయసు పెరిగిన కొద్దీ కుదించుకుపోతున్నట్టు అనుభవం శాస్త్రపరంగా నిర్ధారించిన విషయమే అంటున్నాయి ఆధునిక న్యూరోసైన్స్ పరిశోధనలు. తాజా సిద్ధాంతాలను అనుసరించి, చిన్న వయసులో ఒక రోజు కూడా చాలా పొడవుగా అనిపించడం, సెలవులు అంతులేనివిగా భావించబడటం అనేవి యాదృచ్ఛిక అనుభూతులు కావు. ఆ దశలో మన మెదడు నిరంతరం కొత్త సమాచారంతో నిండిపోతూ ఉంటుంది. కొత్త ముఖాలు, కొత్త పరిసరాలు, కొత్త భావోద్వేగాలు మెదడును అప్రమత్తంగా ఉంచుతాయి. ప్రతి అనుభవం ప్రత్యేకంగా నమోదు అవుతుంది. ఈ అధిక జ్ఞాపక సాంద్రత కారణంగానే ఆ కాలాన్ని వెనక్కి చూసినప్పుడు అది విస్తృతంగా, నెమ్మదిగా సాగినట్టుగా అనిపిస్తుంది. వయసు పెరిగేకొద్దీ జీవితం ఎక్కువగా పునరావృత నమూనాల్లోకి మారుతుంది. ఒకే రకమైన పని విధానాలు, ఒకే మార్గాలు, ఒకే తరహా సంభాషణలు మెదడుకు కొత్తగా అనిపించవు. కొత్త సమాచారాన్ని నిల్వ చేయాల్సిన అవసరం తగ్గిపోతుంది. దాంతో జ్ఞాపకాలలో స్పష్టమైన సూచికలు లేదా గుర్తింపులు తగ్గుతాయి. ఫలితంగా, ఆ కాలాన్ని తిరిగి గుర్తు చేసుకునేటప్పుడు అది కుదించుకుపోయినట్టుగా, ఖాళీగా గడిచినట్టుగా అనిపిస్తుంది. అందుకే ఒక సంవత్సరం క్షణాల్లో ముగిసిపోయినట్టుగా మనకు అనుభూతి కలుగుతుంది. ఇక్కడ ముఖ్యంగా గ్రహించాల్సిన విషయం ఏమిటంటే, మెదడు కాలాన్ని గడియారంతో కొలవదు. అది కాలాన్ని జ్ఞాపకాల పరిమాణం మరియు వాటి సాంద్రత ఆధారంగా అంచనా వేస్తుంది. ఇటీవలి బ్రెయిన్ ఇమేజింగ్ అధ్యయనాలు ఈ భావనకు బలమైన ఆధారాలు అందిస్తున్నాయి. ఒక నిర్దిష్ట కాలం మనకు ఎంత పొడవుగా లేదా చిన్నగా అనిపించిందన్నది, ఆ కాలంలో ఎంత కొత్త సమాచారం మెదడులో నమోదయ్యిందన్నదానిపై ఆధారపడి ఉంటుంది. రోజులు ఒకేలా ఉంటే నెలలు క్షణాల్లో గడిచినట్టుగా అనిపిస్తాయి.. అదే కాలంలో మార్పులు, కొత్త అనుభవాలు ఎక్కువగా ఉంటే అదే సమయం విస్తృతంగా అనిపిస్తుంది. దృష్టి పాత్ర ఇక్కడ అత్యంత కీలకం. ఆటోపైలట్ స్థితిలో, ఒకేసారి అనేక పనులు చేస్తూ ఏ ఒక్కదానిపైనా పూర్తి శ్రద్ధ పెట్టకుండా జీవించినప్పుడు, మెదడు కాలాన్ని మరింత కుదించి నమోదు చేస్తుంది. కానీ కొత్త నైపుణ్యాన్ని నేర్చుకున్నప్పుడు, కొత్త ప్రదేశాన్ని అన్వేషించినప్పుడు లేదా సాధారణ పనినే అయినా సంపూర్ణ దృష్టితో చేసినప్పుడు, కాలం మళ్లీ విస్తరించినట్టుగా అనిపిస్తుంది. అందుకే శాస్త్రవేత్తలు కాలాన్ని నెమ్మదింపజేయాలంటే గడియారాన్ని మార్చడం కాదు, జీవన విధానాన్ని మార్చడం అవసరమని సూచిస్తున్నారు. కాలం నిజంగా వేగంగా పోవడం లేదు... మారింది మన అనుభూతి మాత్రమే. జీవితంలో అర్థవంతమైన క్షణాలు ఇంకా కాలాన్ని ఆపగలవు. మనం ఎంతగా గమనిస్తామో, అంతగా కాలం మనకు తిరిగి కనిపిస్తుంది. కాలం మనపై విజయం సాధించలేదు. మన దృష్టి దాన్ని వదిలేసింది అంతే.

## గతంపై ప్రస్తుత నిర్ణయాల ప్రభావం?



క్వాంటం సిద్ధాంతం విస్తరిస్తున్న కొద్దీ ఎవరి అంచనాలకూ అందని రీతిలో సిద్ధాంతాలు, అభిప్రాయాలు మారిపోతున్నాయి. రోజుకో ప్రతిపాదన ముందుకొస్తున్నది. అయితే, ఒక చిన్న వాస్తవానికి అభూత కల్పనలు జోడిస్తూ, వివిధ సామాజిక మాధ్యమాల్లో విచిత్రమైన ఆలోచనలు సిద్ధాంతాల రూపంలో దర్శనమిస్తున్నాయి. అలాంటి అంచనాల్లో 'గతంపై ప్రస్తుత నిర్ణయాలు ప్రభావితం చేస్తాయి' అనే ఆలోచన ఒకటి. ఈ ప్రశ్న వినడానికి తాత్వికంగా అనిపించినా, దాని వెనుక ఉన్న శాస్త్రీయ నేపథ్యం క్వాంటం భౌతికశాస్త్రంలో జరుగుతున్న నిజమైన పరిశోధనల నుంచే వస్తోంది. కోపెన్‌హేగన్ సహా పలు అంతర్జాతీయ పరిశోధనా కేంద్రాల్లో జరిగిన ప్రయోగాలు కాలం గురించి మనకు అలవాటైన 'కారణం–ఫలితం' (లేదా చర్య, ఫలితం) వరుసను ప్రశ్నిస్తున్నాయి. సాధారణంగా మనం భావించే గతం స్థిరంగా ఉంటుంది. భవిష్యత్తు మాత్రమే మారుతుంది. కానీ అణు, ఉపఅణు స్థాయిలో ఈ భావన ఎప్పుడూ సరిపోకపోవచ్చు. ఇక్కడ 'తిరోగమనం' అనే ఆలోచన ప్రస్తావనకు వస్తుంది. అంటే భవిష్యత్తులో చేసే కొలత ఒక కణం గతంలో ఎలా ప్రవర్తించిందో నిర్ణయించినట్టుగా ఫలితాలు కనిపించడం. 'డిలేయిడ్‌ఛాయిస్', 'క్వాంటమ్ ఎరేజర్' ప్రయోగాల్లో, ఒక ఫోటాన్ తరంగంలా లేదా కణంలా ప్రవర్తించిందన్నది మనం తరువాత ఎలా కొలుస్తామన్నదానిపై ఆధారపడినట్టు గణితపరంగా తేలింది.

## సమాంతర విశ్వంపై ఊహాగానాలు



కెనడా ఎనర్జీ రెస్పాన్స్ బెనెఫిట్ (సెర్న్) 'సెర్న్' శాస్త్రవేత్తలు సమాంతర విశ్వాన్ని కనుగొన్నారంటూ ఇటీవల ప్రచారం జోరుగా సాగుతున్నది. కానీ, ఇది శాస్త్రీయంగా సరైనది కాదు. 'సెర్న్'కు చెందిన పరిశోధకులు స్వయంగా స్పష్టం చేసినట్టు, ఇది మరో విశ్వాన్ని ప్రత్యక్షంగా గుర్తించిన అధ్యయనం కాదు, పూర్తిగా సిద్ధాంతాత్మక క్వాంటం సిమ్యులేషన్లపై ఆధారపడిన పరిశోధన మాత్రమే. ఇందులో శాస్త్రవేత్తలు అత్యంత క్లిష్టమైన గణిత నమూనాలను శక్తివంతమైన కంప్యూటర్లలో నడిపి, ప్రకృతిలో ఇప్పటివరకు సృష్టించలేని తీవ్రమైన పరిస్థితుల్లో కణాలు ఎలా ప్రవర్తించవచ్చో అంచనా వేశారు. ఇవి ఆధునిక భౌతిక సిద్ధాంతాలు సూచించిన పరిస్థితులే అయినా, ప్రయోగశాలలో నేరుగా పరీక్షించడానికి ఇంకా సాధ్యం కావు. క్వాంటం సిమ్యులేషన్లు అనేవి ప్రయోగాలు కావు. అవి సిద్ధాంత సమీకరణాలను మోడళ్లుగా మార్చి పరీక్షించే పద్ధతులు. కొన్ని సందర్భాల్లో ఈ ఫలితాలు మల్టీవర్స్ లేదా మెనీ వరల్డ్స్ వంటి సిద్ధాంతాల్లో ఊహించిన నమూనాలను తలపిస్తాయి. కానీ, ఇది గణితపరంగా ఇలా జరగవచ్చని చూపించడమే తప్ప, ప్రకృతిలో నిజంగా ఇలా జరిగిందని నిరూపించడం కాదు. సెర్న్' చేసిన ఈపని సిద్ధాంతాత్మక భౌతిక శాస్త్రంలో ఒక ముందడుగు మాత్రమే. సమాంతర విశ్వాల ఉనికిని నిర్ధారించే ఆధారం కాదు. ప్రత్యక్షంగా గమనించినది రెండూ ఒకటే కావని ఈ అధ్యయనం స్పష్టంగా గుర్తు చేస్తుంది.

# మానుకోటలో బిఆర్‌ఎస్‌తో అవగాహన

### ఏడు స్థానాలలో పోటీ

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మహబూబాద్ జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌తో సిపిఐ అవగాహన చేసుకోవడం జరిగిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం రాత్రి బిఆర్ఎస్ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవితతో సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్, సిపిఐల మధ్య జరిగిన అవగాహన వివరాలను తక్కళ్లపల్లి శ్రీనివాసరావు వెల్లడించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ఏడుస్థానాల్లో సిపిఐ పోటీ చేస్తుందన్నారు. 18,21,22, 23,25, 33, 36, వార్డుల్లో నామినేషన్ వేసినట్లు మిగతా వార్డుల్లో బిఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నాట్లు ఆయన తెలిపారు. 18,23 వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు ఉపసంహరించుకుని సిపిఐకి మద్దతు తెలపడంపట్ల బిఆర్ఎస్‌ను అభినందించారు. సిపిఐ పోటీ చేయని వార్డుల్లో బిఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలపడం జరుగుతుందని ఆయన తెలిపారు. మిత్రదోహం చేసిన కాంగ్రెస్‌కు మున్సిపాలిటీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. పరస్పర అవగాహనతో కొన్ని స్థానాలు సిపిఐకి మరికొన్ని స్థానాల్లో బిఆర్ఎస్‌తో కలిసి అవగాహనతో మానుకోట మున్సిపల్ ఎన్నికల్లో ముందుకు పోతామని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ అవగాహన వివరాలను తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి, బీరవెల్లి భరత్ కుమార్‌రెడ్డి, పంజాల రమేష్ ,సిపిఐ, బిఆర్ఎస్ అభ్యర్థులు పెరుగుకుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, యాళ్ళ మురళీధర్ రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ఎండి ఫాతిమా ,నాగేల్లి యాకమ్మ, నర సంధ్య, చింతకుంట్ల శ్రీదేవి, మేక వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులు గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం

### సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ 41వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మార్కాపూర్ సూర్యకు మద్దతుగా శుక్రవారం వందలాది మందితో డివిజన్‌లో భారీ ర్యాలీ, డప్పు చప్పులతో ఎల్బీనగర్‌లోని సిపిఐ జెండా వద్ద భారీ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి, కలవేన శంకర్ హాజరై మాట్లాడుతూ ఉజ్వల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిపిఐ నాయకుడు తిరుపతి కుమారుడు మార్కాపూర్ సూర్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డివిజన్ ప్రజలను కోరా రు. విద్యావంతుడు, యువకుడు, విద్యార్థి, యువజన నాయకుడిగా ఎదిగి కమ్యూనిస్టు పార్టీలో ఫుల్ టైంగా పని చేస్తున్న సూర్యను గెలిపిస్తే డివిజన్‌లో రక్షకుడిగా ఉంటూ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటాడని తెలిపారు. గతంలో సిపిఐ తిరుపతి కౌన్సిలర్ గా గెలిచి 19వ వార్డును అనేక రకాలుగా అభివృద్ధి చేశారని, కమ్యూనిస్టు పార్టీ గెలిస్తే అభివృద్ధి జరుగుతుందని చాడ తెలిపారు. ఇతర బూర్జువ పార్టీలలాగా స్వార్థానికి కాకుండా ప్రజల కోసం పనిచేసే ప్రజాప్రతినిధులు కేవలం కమ్యూనిస్టు పార్టీ ప్రజా ప్రతినిధు లు మాత్రమేనన్నారు. డివిజన్ ప్రజలంతా కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి అయిన మార్కపురి సూర్యను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు ప్రజా ఆమోదయోగ్యమైన పనులు చేయడంలో విఫలమయ్యారని, కమ్యూనిస్టు పార్టీని ఎన్నికల సమయంలో దగ్గర తీసి, అనంతరం అధికార అహంతో దూరం పెట్టడం సరైంది కాదన్నారు, అలాంటి వారికి మునిసిపల్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు మడ్డి ఎల్లాగౌడ్, పార్టీ ప్రజాసంఘాల నాయకులు శనగరపు చంద్రశేఖర్, అబ్దుల్ కరీం, శనిగరపు లక్ష్మీ నారాయణ, ఎజ్జ రాజయ్య, రణవిని సుధీర్ కుమార్, డప్పు రాజు, జూలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై పోరాడే అజయ్‌సారథిరెడ్డికి మద్దతు ఇవ్వండి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మానుకోట 33వ వార్డులో సిపిఐ అభ్యర్థి, మాజీ మున్సిపల్ సిపిఐ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి శుక్రవారం ఇంటింటికీ ముమ్మర ప్రచారం చేశారు. గెలుపు దిశగా ఆయన ప్రచారం పరుగులు తీస్తోంది. మానుకోట మున్సిపాలిటీలో అజయ్‌సారధిరెడ్డి లేకుంటే ప్రశ్నించే గొంతుకే ఉండదని పలువురు భావిస్తున్నారు. అత్యధిక మెజారిటీతో అజయ్‌సారధిరెడ్డిని గెలిపిస్తామని ఓటర్లు హామీ ఇస్తున్నారు. వార్డు ప్రచారంలో ఎక్కడికి వెళ్ళిగా అజయ్‌సారధిరెడ్డిని ఆప్యాయంగా పలకరిస్తున్నారు. ప్రచారానికి వారే స్వాగతిస్తూ ముందుకు వస్తున్నారు. నిత్యం ప్రజాసమస్యలపై పోరాడే ప్రజా యుద్ధనౌకగా అజయ్‌సారథిరెడ్డికి మంచిపేరున్న నేపథ్యంలో, మానుకోట సమస్యలపై ఉద్యమించే సిపిఐ అభ్యర్థిగా 33వ వార్డులో నిలబడడం, మిత్రద్రోహి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిందేనంటూ ఓటర్లు కూడా అజయ్‌సారథిరెడ్డికి అండగా నిలుస్తామంటున్నారు. అజయ్‌సారథిరెడ్డి రావాలి అభివృద్ధి జరగాలంటూ 33వ వార్డు ప్రజలు సిపిఐ ప్రచారానికి నీరాజనాలు పలుకుతున్నారు. డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు, తండా సందీప్, ఎండి మహమూద్, పడిదల కవిత,నీది గొండ సత్యం, పురం భాగయ్యమ్మ, నక్క నాగార్జున, ఉస్మాన్, ముదుసు రాణి, నీలం వెంకన్న, యూసూఫ్, గుగులోత్ కుమార్, మంజునాథ్, కొమ్ము యాకన్న, అనిత, యశోద తదితరులు పాల్గొన్నారు.



# గుట్టలో మిత్రపక్షాల ప్రచార జోరు



### కంకికొడవలికి ఓటు వేయాలని ఎమ్మెల్సీ సత్యంతో కలిసి ఎమ్మెల్యే బీర్ల, మోత్కుపల్లి ప్రచారం

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** కంకి కొడవలికి ఓటు వేయాలని యాదగిరిగుట్ట పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, ఎమ్మెల్సీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నెల్లికంటి సత్యం శుక్రవారం ప్రచారం నిర్వహించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని 12వ వార్డులో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి బబ్బురి శ్రీధర్‌ను గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ వారు ఓట్లను అభ్యర్థించడంతో ప్రచారం ఊపందుకుంది. పట్టణంలోని 2, 3, వార్డులలో వారు చేసిన ప్రచారం మిత్రపక్షాల కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. యాదగిరిగుట్ట పట్టణంలో అభివృద్ధి కొరకు సిపిఐ చేసిన పోరాటాలు, పంపిణీ చేసిన ఇంటి స్థలాలు, బంజరు భూముల పంపిణీ ప్రజలకు పోరాటాల ద్వారా అందించిన ఫలితాలను వివరిస్తూ సిపిఐ నాయకులు ఓట్లను అడిగారు. పట్టణ అభివృద్ధి నిరంతరాయంగా సాగాలంటే మిత్రపక్షాల అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ 'చేయి' గుర్తుకు, సిపిఐ అభ్యర్థి కంకి కొడవలి గుర్తులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజయ్య, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ,మండల కార్యదర్శులు మహేందర్, గాదగాని మాణిక్యం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కానుగు బాలరాజు, పట్టణ అధ్యక్షులు బిక్షపతి పాల్గొన్నారు.

### ఇమ్రాన్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**భువనగిరి :** భువనగిరి పట్టణంలోని 10వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న ఎండి ఇమ్రాన్ విజయానికి మద్దతుగా సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం పార్టీల ఉమ్మడి మద్దతుతో పోటీ చేస్తున్న ఇమ్రాన్ తరఫున ఆయన గడపగడపకూ వెళ్లి, 'సిలిండర్' గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సామల శోభన్ బాబు, సామల భాస్కర్, గాదెగాని మాణిక్యం, చింతల మల్లేష్, బద్దం వెంకట్ రెడ్డి, షర్ఫోద్దీన్, సతీష్, అదిల్, ఇర్ఫాన్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ గెలుపుతోనే సమస్యలు పరిష్కారం

### 10వ వార్డు అభ్యర్థిని మమత జ్యోతిబసును గెలిపించండి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ మున్సిపాలిటీకి జరుగుతున్న ఎన్నికల్లో 10వ వార్డులో పోటీ చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిని జూలూరి మమత జ్యోతిబసు కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం 10వ వార్డులో ముమ్మరంగా ఇంటింటికి ప్రచారం నిర్వహించి సిపిఐ అభ్యర్థిని మమత జ్యోతిబసును గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రజల కోసం నిత్యం పోరాడే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా వార్డు సమస్యల పరిష్కారం కోసం పాలకవర్గాలపై వత్తిడి తీసుకొచ్చి పరిష్కరిస్తారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకను గెలిపిస్తే నిజాయితీగా ప్రజల కోసం పని చేస్తారని, 10వ వార్డు ప్రజలు మమత జ్యోతిబసు కంకికొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అభ్యర్థిని జూలూరి మమత జ్యోతిబసుతో పాటు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రామస్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యులు రంగారెడ్డి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల నాయకులు యాదయ్య, మైనోద్దీన్, కృష్ణారెడ్డి, మల్లయ్య, మహేష్, శ్రీనివాస్, నగేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చేస్తున్న మోదీ సర్కార్

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి



**ప్రజాపక్షం/శాయంపేట :** కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ ఊడిగం చేస్తున్నదని, దీని ఉదాహరణే మొన్న ప్రవేశ పెట్టిన కార్పొరేట్ వర్గాల అనుకూల కేంద్ర బడ్జెట్ అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి విమర్శించారు. శుక్రవారం శాయంపేట మండల కేంద్రంలో సిపిఐ శాయంపేట మండల ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ నాయకులు ఎండి అంకుశావలి అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ ను పరుస్తూ లక్షల కోట్ల రూపాయలను రాయితీలు ఇస్తూ ప్రజల సంక్షేమం మరిచారని అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ లో పేద మధ్యతరగతి వర్గాలకు ఒరిగిందేమీ లేదని, సబ్ కే సాత్, సబ్ కా వికాస్ మాటలకే పరిమితమని, కార్పొరేట్ కే సాత్ కార్పొరేట్ కా వికాస్ అన్న చందంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ ఎ స్టాలిన్, ఐత్తిని సదానందం, అశోక్, రమేష్, సాంబయ్య, రాజు, బోగి రమేష్, బరిబోయిన నరేష్, బోగి రామదేవి, ఈగల కల్పన, వైదుల రమా, మున్నుల సరోజన తదితరులు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



**ప్రజాపక్షం/హనుమకొండ :** దేశంలో విద్యను హక్కు నుంచి వ్యాపారంగా మార్చే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హన్మకొండ అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, భాష బోయిన సంతోష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ అధికారికంగా విద్య బిల్లు కాకపోయినా, దాని వెనుక ఉన్న అమలు చేయబోయే విద్యా రంగ విధానాలు విద్య ప్రైవేటీకరణకు దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యా నిధుల కోత, స్కాలర్‌షిప్‌ల తగ్గింపు, ప్రభుత్వ యూనివర్సిటీల నిర్లక్ష్యం, ప్రైవేటు, కార్పొరేట్ యూనివర్సిటీలకు ప్రోత్సాహం వంటి చర్యలు కలిసి ఒక "డీ ఫాక్టో విద్య బిల్లు" రూపం దాలుస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఈ విధానాల వల్ల పేద, గ్రామీణ, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మక్కల కుమార్, వేల్పుల చరణ్, జక్కుల భాను ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి, జిల్లా సమితి సభ్యులు సిపతి వినయ్,యూనివర్సిటీ అధ్యక్షులు కొమ్ము సాయి, జిల్లా నాయకులు కొండ చరణ్, రమేష్, పవన్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను నిండు మనసుతో ఆశీర్వదించండి



**ప్రజాపక్షం/స్టేషన్‌ఘన్‌పూర్ :** తనకు రాజకీయ జన్మనిచ్చి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజల ఋణం ఎన్ని జన్మలెత్తినా, ఎన్ని అభివృద్ధి పనులు చేసినా తీర్చుకోలేనని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1, 12, 13, వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ సహకారం ఉంటేనే మన ఘన్‌పూర్ మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకోగలమని కావున చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. అలాగే 14, 15వార్డులలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ప్రజలు ఈ నెల 11జరిగే మున్సిపల్ ఎన్నికలలో చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వారు మీకు అందుబాటులో ఉండి మీకు సేవ చేసే విధంగా చూసే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు అందరూ ఒక్క తాటి ఉండి ఘనపూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురావేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల అభ్యర్థులు, వార్డు ఇంచార్జ్ లు, కో ఆర్డినేటర్లు, మున్సిపాలిటీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం: రిజ్వాన్ బాష



**ప్రజాపక్షం/జనగామ:** ప్రతిభావంతులపై క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించనుందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. సిఎం కప్‌లో భాగంగా శక్రవారం స్థానిక ధర్మకంచ మినీ స్టేడియంలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి పోటీలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాలు తమ దినచర్యలు భాగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుండి వెల్లె క్రీడాకారులు తమ ప్రతిభ చూపి పేరు తేవాలని, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. సమయాన్ని వృదా చేయకుండా విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడల్లో పాల్గొనాలని, ఓడినా నిరాశ పడకుండా గెలుపు కోసం ప్రయత్నించాలన్నారు. పోటీలో పాల్గొన్న క్రీడాకారులకు కలెక్టర్ పరిచయం చేసుకొని ఉత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కోదండరాములు, తహాశీల్దార్, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

# అధికారం మనదే..అభివృద్ధి బాధ్యతా మనదే...

ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/స్టేషన్‌ఘన్‌పూర్:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14, 15వ వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటి ఇంటికీ వెళ్లి స్థానిక ప్రజలు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ప్రభుత్వం మనదే అధికారం మనదే అభివృద్ధి చేసే బాధ్యత కూడా మనదే నని వరంగల్ ఎంపీ కడియం కావ్య స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధి చేసే సత్తా కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందని, అధికారం మన చేతుల్లో ఉన్నప్పుడు మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీ పేర్కొన్నారు. ప్రతిపక్షం అభివృద్ధి చేయకపోగా నిధులను దుర్వినియోగం చేస్తుందని విమర్శించారు.ఈ నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేసి ఘనపూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్ల క్రితం ప్రజల ఆశీర్వాదాలతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, రైతు భరోసా, రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు.మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలపై కాంగ్రెస్ అభ్యర్థులకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. వారిని గెలిపిస్తే మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపించగలమన్నారు. గతంలో కడియం శ్రీహరిని నమ్మి ఓటేసిన ప్రజల విశ్వాసాన్ని ఆయన అభివృద్ధి పనులతో నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. గత పాలకులు మాటలకే పరిమితమైతే, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన పనులు ప్రజల ముందే కనిపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికే స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. రూ.50 కోట్లతో పనులు చేపట్టడం కాం గ్రెస్ పాలనకు నిదర్శనమని చెప్పారు. స్టేషన్ ఘనపూర్ ప్రజలు అవినీతిపరులను పక్కనపెట్టి అభివృద్ధికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 'చేతి గుర్తు'కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని డా.కడియం కావ్య ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు అభ్యర్థి క్రిష్ణవేణి, 15 వార్డు అభ్యర్థి లక్ష్మి , వార్డు అబ్జర్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోరాడే పార్టీకే పట్టం

హోరా హోరీ ప్రచారంలో దూసుకెళ్తున్న సిపిఐ అభ్యర్థులు

కమ్యూనిస్టులకు ప్రజలల్లో విశేష స్పందన



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** నిత్యం కార్మిక, ప్రజా సమస్యలపై పోరాడే సిపిఐ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా 5,7,24 28వ వార్డు లలో కాంగ్రెస్ పార్టీ, సిపిఎం పార్టీలు బలపరిచిన సిపిఐ అభ్యర్థిలు సోతుకు ప్రవీణ్ కుమార్, నూకల భూలక్ష్మి చంద్రమౌళి, గంగసరపు శ్రీనివాస్, వేముల జ్యోతి శ్రీకాంత్ లు గెలుపును కాంక్షిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏడవ వార్డు అభ్యర్థి నూకల భూలక్ష్మి చంద్రమౌళి టి2 క్వార్టర్స్‌లో కార్మికులను ఇంటింటికి కలుస్తూ ఓటును అభ్యర్థించారు. ఐదో వార్డ్ అభ్యర్థి గంగసరం శ్రీనివాస్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. 24వ వార్డు అభ్యర్థి వేముల జ్యోతి శ్రీకాంత్ తన వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను అభ్యర్థించారు. ఈసారి జరిగే మున్సిపల్ ఎన్నికల్లో నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే సిపిఐ పార్టీని ప్రజలు ఆదరించి 11న జరిగే ఎన్నికల్లో సిపిఐ కంకి కొడవలి గుర్తుకు అమూల్యమైన ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని సిపిఐ అభ్యర్థులు ఓటర్లను అభ్యర్థించారు. సిపిఐ అభ్యర్థుల్లో వార్డులో తిరుగుతున్న సందర్భంలో ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుంది.

## నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజా ప్రభుత్వానికి సహకరించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ నగరంలోని 34వ డివిజన్ శివనగర్ ఇసుక అడ్డా వద్ద గల జంక్షన్‌లో విన్ లైఫ్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ శుక్రవారం ముఖ్య అతిథిగా మంత్రి కొండా సురేఖ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యం కోసం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైద్యం కోసం అధిక నిధులు కేటాయిస్తూ పేద ప్రజలకు భరోసా కల్పిస్తున్నారని అన్నారు. నగరంలోని ప్రయివేట్ హాస్పటల్స్ అనవసర ఫీజులు పేరిట ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడా డాక్టర్ కడియం కావ్య, ఎంఎల్‌ఏ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, డిఎంహెచ్ఓ డాక్టర్ డి సాంబశివ రావు, హాస్పటల్స్ డాక్టర్లు గన్ను విజయ్‌కుమార్, ఎంఎస్ ఆర్థోపెడిక్ సర్జన్, డాక్టర్ ఎన్ఎస్ రామరాజు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ డాక్టర్ ఘటిక రంజిత్‌కుమార్, ఎండి చర్మ వైద్య నిపుణులు డాక్టర్ వి సాంబరాజు, అనస్థీషియా డాక్టర్ బందెల రాజు, గైనకాలజిస్టు ఎంఎస్ డాక్టర్ కె నివేదిత, ఆర్ఎంఓ డాక్టర్ ఈ ప్రదీప్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ ఎ రమేష్, గన్ను సంపత్, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని మెచ్చి ఆరవ వార్డుకు చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు చింతనిప్పుల బిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో శీలం వేణు, కందికొండ కుమార్, గై వినయ్ కుమార్, గై నరేష్, కొత్తకొండ రాజేష్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు అడువాల వెంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొత్తకొండ రమేష్, పాలకుర్తి మోహన్, గై రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పరకాల పటణాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం: ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/పరకాల :** పరకాల పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని, ఈ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుందాం పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా 1,2,10,11,13 వార్డులలో టిపిసిసి ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య, మాజీ ఎమ్మెల్యే బిక్షపతితో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శుక్రవారం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని పరకాల పట్టణ అభివృద్ధికి తోడ్పడుదాం అన్నారు. కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించడానికి పట్టణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని, టిఆర్ఎస్ బిజెపి నాయకుల మోసపూరిత మాటలను నమ్మవద్దని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కి గెలిపించుకుంటే, పట్టణానికి మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామని డిపిఆర్ వ్యవస్థతో సిసి రోడ్, డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీరు, మరిన్ని వసతులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు అభివృద్ధి సంక్షేమం పేరుతో దోచుకున్నారని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. 200యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూ గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు తదితర సంక్షేమ పథకాల అందిస్తున్నామని తెలిపారు.

## విబిఎస్‌ఎను రద్దు చేయాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్



**ప్రజాపక్షం/ వరంగల్ :** సమాఖ్యవాదం స్వయం ప్రతిపత్తిని విచ్ఛిన్నం చేసే విబిఎస్ఏ ను రద్దు చేయాలని, ఏఐఎస్ఎఫ్విశ్వవిద్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేసే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలి, ఏఐఎస్ఎఫ్ విక్షత్ భారత్ శిక్ష అధిష్టాన్ 2025 బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం సరికాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా శుక్రవారం స్థానిక వరంగల్ జిల్లా రంగశాయిపేట డిగ్రీ కళాశాల ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విక్షత్ భారత్ శిక్ష అధిష్టాన్ (విబిఎస్ఏ) బిల్లు 2025 ను అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈబిల్లు సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య స్వయంప్రతిపతిని, భారతదేశం ఉన్నత విద్య వ్యవస్థ లౌకిక శాస్త్రీయ స్వభావాలపై ప్రత్యక్ష దాడి చేస్తుందన్నారు, శ్రేష్టత కోసం సంస్కరణ కోసం మారువేషంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ యూజీసీ, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఈ) తో సహా ప్రస్తుతం ఉన్న రెగ్యులేటరీ ఆర్కిటెక్చర్ను రద్దు చేయాలని విబిఎస్ఏ బిల్లు ప్రతిపాదిస్తుందన్నారు. దీని స్థానంలో పూర్తిగా కేంద్ర ప్రభుత్వంచే నియంత్రించబడే అత్యంత కేంద్రీకృత కమిషన్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ బిల్లు రాష్ట్రాల, విశ్వవిద్యాలయాల విద్యాపరమైన స్వయం ప్రతిపత్తిని విచ్ఛిన్నం చేస్తుందన్నారు. లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులను, ప్రజాస్వామ్య వాదులను, మేధావులు, విద్యావేత్తలను, ప్రజలను చైతన్యం చేసి పోరాటాలకు శ్రీకారం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శివ కుమార్, సిహెచ్ హరీష్, కార్తీక్, భరత్ తదితరులు పాల్గొన్నారు

## శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమం

ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్



**ప్రజాపక్షం/వరంగల్:** శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలని, కార్మికుల హక్కులను కొల్లగొడుతున్న కేంద్ర ప్రభుత్వం ఏఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్ సికెఎం హాస్పిటల్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలు ఆలంబించడం వల్ల మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో శ్రమ దోపిడీ పెరుగుతుందని, పాలక వర్గాలు కార్పొరేట్ శక్తుల తొత్తుగా మారాయని అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు కనుమరుగై మోదీ సర్కార్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయని ఆయన ఆరోపించారు. ఎన్డీఏ పాలనలో కార్మిక హక్కులు హరించబడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రపంచీకరణ, మతోన్మాదం, కార్మిక చట్టాల సవరణ ఇప్పుడు అత్యంత వేగంగా ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని దీనిని ప్రతిఘటించేందుకు సమరశీల పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లపల్లి జాన్ పాల్, సికెఎంహాస్పటల్ ప్రధాన కార్యదర్శి కలకోట్ల రాజు, సంధ్య, లావణ్య, వీరన్న, సుమతి, సక్కుబాయి, శోభ, రజిత, స్వరూప, మాధవి, రవీందర్, కొమ్మాలు, శ్రీను, శ్రీశైలం, బాబు, కవిత, ప్రవర్ధన్, ఎలిషా తదితరులు పాల్గొన్నారు

## సిఎం పర్యటనకు వేగవంతంగా ఏర్పాట్లు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ఈనెల 8న సిఎం రేవంత్‌రెడ్డి భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు గ్రామ శివారులో నిర్వహించతలపెట్టిన భారీ బహిరంగ సభకు రానున్నారని, అట్టి సభకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం హెలీ ప్యాడ్, వాహనాల పార్కింగ్, విద్యుత్, మంచినీరు తదితర విషయాలపై అధికారులతో చర్చించారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నేతలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే వెంట ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్, చల్లూరి మధు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## భయం..భయం..!

జనగామలో పెద్దపులి సంచారం, లేగదూడలపై దాడులు

రఘునాథపల్లి నుండి బచ్చన్నపేటలోకి

అటవీ శాఖ అధికారులు, పోలీసుల ముప్పుతిప్పలు



**ప్రజాపక్షం/జనగామ:** జనగామ ప్రాంత ప్రజలు వనికి పోతున్నారు. గత మూడు రోజులుగా పెద్దపులి సంచరిస్తూ లేగ దూడల్ని చంపుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందన్న భయం వెంటాడుతుంది. అధికారులు సైతం పెద్దపులి సంచరించి అడుగులు, ఆనవాళ్లను గుర్తించి ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు. ఒంటిరిగా వెళ్లొదండు డప్పు చాటింపు చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నుండి జనగామ జిల్లాలోకి అడగుపెట్టిన పెద్దపులి జనగామ, రఘునాథపల్లి మండలాల్లోని పలు గ్రామాల మీదుగా బచ్చన్నపేట మండలం కొడ్వటూరు ప్రాంతానికి చేరినట్లు పాదముద్రల్ని బట్టి అధికారులు గుర్తించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నుండి జనగామ మండలంలోని సిద్దెంకి ప్రాంతంలో సంచరించిన పెద్దపులి పెంబర్తి మీదుగా ఆలేరు మండలం శారాజీపేటకు చేరింది. అక్కడి నుండి జీడికల్ మీదుగా గురువారం లింగాలఘనపురం మండలంలోని కుందారం, పలేట్‌గూడెం, రఘునాథపల్లి మండలంలోని నవాబుపేట గ్రామాల్లో సంచరించినట్లు అధికారులు తెలిపారు. గురువారం రాత్రి జనగామహ న్మకొండ హైవే రోడ్డు దాటి మండెలగూడెం చేరుకొని అక్కడ ఓ లేగదూడను చంపింది. అక్కడి నుండి రామచంద్రగూడెం చేరుకోగా అక్కడి నుండి బచ్చన్నపేట ప్రాంతానికి చేరినట్లు అధికారులు గుర్తించారు. అయితే గత మూడు రోజుల క్రితం బచ్చన్నపేట మండలం కొడ్వటూర్‌లో ఒక రైతుపై గుర్తు తెలియని జంతువు దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. ఏ జంతువు దాడి చేసిందన్నది తెలియకుండా ఉంది. అదే గ్రామంలో పులి కాళ్ల ముద్రలు కనిపించడంతో పులి అక్కడకు చేరినట్లుగా అధికారులు భావిస్తున్నారు.

**ఒకటా..రెండా:** జనగామ ప్రాంతంలో సంచరించేవి ఒకటా..రెండా అన్న అనుమానాలు వస్తున్నాయి. రెండు రోజుల క్రితం పులి ఆలేరు మండలం శారాజీపేట గ్రామ ప్రాంతంలో సంచరించినట్లు గుర్తించగా అదే రోజు బచ్చన్నపేట మండలం కొడ్వటూరు ప్రాంతంలో ఓ రైతుపై గుర్తు తెలియని జంతువు దాడి చేసింది. రెండు ప్రాంతాల దూరం 25 కిలో మీటర్లుకు పైగా ఉంటుంది. పైగా గురువారం లింగాలఘనపురం, రఘునాథపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సంచరించి లేగదూడల్ని చంపింది. శుక్రవారం ఉదయం మండలగూడెంలో పులి ఆనవాళ్లు కనుక్కొగా మధ్యాహ్నం బచ్చన్నపేట మండలం కొడ్వటూర్ లోనూ పులి సంచరించిన ఆనవాళ్లు కనిపించాలి. దీనితో పెద్ద పులి ఒకటా..రెండా అన్న అనుమానాలు వస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జనగామ జిల్లాలోని రఘునాథపల్లి, లింగాలఘనపురం, రఘునాథపల్లి, నర్మెట, తరిగొప్పుల మండలాల్లోన్ని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అడవి శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. రాత్రి పూట బయట తిరొగొద్దని, ఒంటిరిగా ఎవరు బయటకు రావొద్దన్నారు. అవసరం అయితేనే బయటకు రావాలని కోరారు. కాగా రఘునాథపల్లిలో పులి సంచరించినట్లు అటవి శాఖ అధికారులు గుర్తించగా జనగామ డిసిపి రామచంద్రనాయక్‌తో పాటు పోలీస్ అధికారులు పులి సంచరించినట్లు ఆనవాళ్లు ఉన్న ప్రాంతాలను పరిశీలించి ప్రజల్ని అప్రమత్తం చేశారు.

## బిఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఏదులాపురంలో మాజీ ఎంఎల్ఎ కందాళ ఉపేందర్‌రెడ్డి శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదవ వార్డులో సిపిఎం బలపర్చిన బిఆర్ఎస్ అభ్యర్థి బెందు జ్యోతిని గెలిపించాలని కోరుతూ కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కందాళ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిందన్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ వంటి పథకాలను అమలు చేసిందన్నారు. మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. కారు గుర్తుపై ఓటేసి జ్యోతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దొంగ హామీలను ఇచ్చిన కాంగ్రెస్ నాయకులను ఓట్ల కోసం వస్తే నిలదీయాలన్నారు.

## బాలిక ఆత్మహత్య

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కడుపునొప్పి తాళలేక బాలిక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. కడుపునొప్పి తాళలేక తీవ్ర మనస్తాపానికి గురై గురువారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సిఐ తెలిపారు.

## మేయర్‌ను కలిసిన పువ్వాడ నగర్ సర్పంచ్



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని పువ్వాడ నగర్ సర్పంచ్ షేక్ సిద్ధిఖ్ శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ నీరజను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పువ్వాడ నగర్ గ్రామంలో నూతనంగా ప్రారంభించిన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు లేని విషయం జిల్లా కాంగ్రెస్ యూత్ నాయకులు తుమ్మల యుగంధర్‌కు తెలపగా ఖమ్మం కార్పొరేషన్ నుండి రెడీమెడ్ టాయిలెట్స్‌ను కేటాయిస్తామని తెలిపారు. పాఠశాలలో మరుగుదొడ్ల ఏర్పాటుకు సంబంధించి మేయర్‌ను కలిసి సర్పంచ్ వినతి పత్రం సమర్పించారు. విద్యార్థుల కోసం వెంటనే టాయిలెట్లు ఏర్పాటు చేయాలని మేయర్‌ను కోరారు. స్పందించిన మేయర్ త్వరలో టాయిలెట్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్ము సుధాకర్, సాధిక్‌పాషా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సహాయ పడాలని ఖమ్మం డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, టిజివో అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, ఖమ్మం ఎస్టివో, టిజివో జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి తెలిపారు. శుక్రవారం కృషి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఖమ్మం నగరానికి చెందిన తుములూరి సత్యనారాయణ సరిత దంపతుల కుమార్తె వైద్య విద్యను అభ్యసిస్తున్న తుములూరి నవ్య ఉషస్వినికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక చేయూతగా అందిస్తున్న రూ. 20వేల చెక్కును ట్రస్ట్ ఛైర్మన్ పరిశ పుల్లయ్యతో కలిసి కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రిలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలో ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూతనందిస్తున్న పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌జిపిఎటి జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఊడుగు సుధాకర్‌రావు, వెంకటాచారి, బచ్చు జగ్గయ్య, విద్యార్థిని తల్లి తుములూరి సరిత తదితరులు పాల్గొన్నారు.

## వార్డు అభివృద్ధి కోసం పనిచేస్తా

**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఫణితి సైదులు వార్డు అభివృద్ధి సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని అంటున్నారు. ఈ నెల11న వైరా మున్సిపాలిటీలో జరగనున్న ఎన్నికల్లో చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. ఈ సందర్భంగా ఫణితి సైదులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా వార్డు ప్రజలతో ఉన్న సంబంధం అందరూ నన్ను వారి కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నారని, ఏ చిన్న సమస్య వచ్చినా వారికి అండగా ఉంటా అన్నారు. భవిష్యత్తులో కూడా అలాగే ఉంటానని అన్నారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో వార్డును మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతానని తెలిపారు. ఇందిరమ్మ పాలనల్లో సంక్షేమం అభివృద్ధి అనేది ప్రతి ఇంటికి చేరుతుందని, ఇల్లు లేని ప్రతి పేద వాడికి వార్డులో ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని ఆయన అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వార్డు ప్రజలు మా కుటుంబానికి అందించిన సహాయ సహకారాలు ఎప్పటికి మరిచిపోలేని , మరిచిపోను, నిరంతరం మీరిచ్చిన సపోర్ట్‌తో వార్డు అభివృద్ధితో పాటు మీలో ఒకడిగా కుటుంబ సభ్యుడిగా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఫణితి సైదులు తెలిపారు.

## ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ మృతి

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె. వెంకటేశ్వర్లు (61) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతిచెందారు. సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో సుమారు 25 ఏళ్లగా వివిధ హోదాల్లో వైద్య సేవలు అందిస్తూ ప్రస్తుతం ఆస్పత్రి సూపర్డెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయం ఇంటి వద్ద తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వెంటనే సత్తుపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించగా ఆస్పత్రి డయాలసిస్ విభాగంలో వైద్యులు సిపిఆర్ సేవలు అందిస్తుండగా మృతి చెందినట్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. కె.వెంకటేశ్వర్లు 2016 నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ కొనసాగిస్తున్నారు. వెంకటేశ్వర్లు మృతి విషయం తెలుసుకున్న సత్తుపల్లి ఎంఎల్‌ఎ రాగమయి పట్టణంలోని వారి నివాసానికి చేరుకొని వెంకటేశ్వర్లు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఏదులాపురంలో సిపిఐ విస్తృత ప్రచారం



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఏదులాపురం మున్సిపాలిటీలో సిపిఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సిపిఐ నేతలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. సిపిఐ నేతలు బాగం హేమంతరావు, మహ్మద్ మౌలానా, దండి సురేష్ లతో పాటు రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆయా వార్డుల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏదులాపురంలో మున్సిపాలిటీ ఏర్పాటుకు ముందు ఆయా పంచాయతీల్లో సిపిఐ చేపట్టిన అభివృద్ధిని ఓటర్లకు వివరిస్తున్నారు. ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలంటే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని నేతలు విజ్ఞప్తి చేశారు. గతంలో ఏనాడు తమ ముఖం చూపించని వారు, ఇబ్బందుల్లో ఉంటే కన్నెత్తి చూడని వారు ఎన్నికల సమయంలో వచ్చి పెద్ద పెద్ద హామీలు ఇస్తున్నారని వారు ఓటర్లకు వివరిస్తున్నారు. కాలనీల నిర్మాణం తదితర విషయాల్లో ప్రజలకు అండగా నిలిచిన విషయాన్ని గుర్తుకు తెస్తున్నారు. సిపిఐ తరుపున బరిలో ఉన్న దండి రంగారావు, చెరుకుపల్లి పవిత్ర, దండి శ్రీజ, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, సునావత్ పాండురంగా, సత్తి శ్రీలక్ష్మి, గూదె వీరభద్రం, చెరుకుపల్లి రజని, మిడికంటి అరుణశ్రీ, మిడికంటి ధనలక్ష్మి, రెంటాల శ్రీరాములు తదితరులను కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచార పర్వంలో సిపిఐ అభ్యర్థులకు విశేష ప్రజాదరణ లభిస్తుంది. ప్రజలు స్వాగతం పలుకుతూ అభ్యర్థులను ఆదరిస్తున్నారు.

**వైరా 15వ వార్డులో సిపిఐ విస్తృత ప్రచారం :** వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో 15వ వార్డు నుంచి బిఆర్ఎస్, సిపిఎం బలపర్చిన సిపిఐ అభ్యర్థి నల్లమోతు శైలజ గెలుపును కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కంకి కొడవలి గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యులు తాతా మధుసూదన్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల పక్షాన నిలిచి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేసే సిపిఐ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ నాయకులు యర్రాబాబు, బిఆర్ఎస్ నాయకులు బానోత్ చంద్రావతి, గిరిబాబు, దొండపాటి రమేష్, యమాల గోపాలరావు, సిపిఎం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిఆర్ఎస్, సిపిఐ, సిపిఐ(ఎం) అభ్యర్థుల విజయంతోనే మధిర అభివృద్ధి



**ప్రజాపక్షం/ మధిర :** బిఆర్ఎస్ పార్టీ మిత్రపక్షం సిపిఐ, సిపిఎం ప్రజాప్రతినిధులతోనే మధిర పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని బిఆర్ఎస్ నేత వేల్పుల శివ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 20వ వార్డు సిపిఐ, సిపిఎం బలపర్చిన బిఆర్ఎస్ అభ్యర్థి తన సతీమణి రామాల కవిత గెలుపును కాంక్షిస్తూ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వేల్పుల శివ మాట్లాడుతూ విద్యావంతురాలైన రామాల కవితని వార్డు ప్రజలు ఆదరించి గెలపించాలని కోరారు. కవితను గెలిపిస్తే 20వ వార్డులో ప్రజా సమస్యలను పరిష్కరించటంలో ముందుంటామన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై ఉండే బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం కూటమికి ప్రజా సమస్యలపై ఎక్కువ అవగాహన ఉంటుందని, మధిర అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# హోరెత్తిస్తున్న ప్రచారం

### 47వ, డివిజన్‌లో దూసుకుపోతున్న జివిఆర్



**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ డివిజన్‌లో సిపిఐ, తెలుగుదేశం పార్టీలు బలపరిచిన అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. 47వ డివిజన్‌లో జి. వెంకటేశ్వర్లు తమ ప్రచార పర్వాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. వందలాది మంది అభిమానులు, కార్యకర్తలతో ఎర్రజెండాలతో ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రతీ ఓటరును పేరు పేరునా ఆప్యాయంగా పిలుస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. శుక్రవారం ప్రచారంలో భాగంగా పాత పాల్వంచ మెయిన్ రోడ్, బిసిఎం రోడ్‌లో చిరు వ్యాపారులను కలిశారు. పాన్ షాపులో కిల్లీలు కడుతూ ..కిరాణ షాపులో సరుకులు విక్రయిస్తూ , ఇస్త్రీ షాపులో ఇస్త్రీ చేస్తూ కంకి కొడవలి గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. గత మూడు దశాబ్దాలుగా ఎన్నికల మోహం ఎరుగని పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు తీసుకొచ్చిన ఘనత ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావుదేనని చెప్పారు. పాల్వంచకు మెరుగైన అభివృద్ధి కావాలంటే, పాత పాల్వంచ మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోవాలంటే ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావుకు మద్దతు తెలుపుతూ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. డివిజన్‌లో నెలకొన్న అంతర్గత రహదారుల నిర్మాణం, డ్రైనేజీల సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. ఈ ప్రచారంలో జిల్లా నాయకులు వైఎస్ గిరి, శాఖ కార్యదర్శి బర్ల వెంకటరత్నం, మేడిద రూపాస్, కూరపాటి పెదరాజు. పుట్టి వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విధులను పకడ్బందీగా నిర్వహించాలి

### నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
### నగరంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్
### ఖమ్మం కార్పొరేషన్ పనితీరుపై కలెక్టర్ సమీక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నగర పాలక సిబ్బంది తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ అను



దీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రజ్ఞా సమావేశ మందిరంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పనితీరుపై సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కారణంగా కొంత మేర మంచి ఫలితాలు వచ్చాయని మరోసారి ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణకు ప్రణాళిక తయారు చేయాలన్నారు. చెత్త రవాణా వాహనాలకు జిపిఎస్, ఫ్యూయల్ సెన్సార్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వాహనాలకు మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలని, పారిశుధ్య కార్మికుల హాజరు నమోదులో ఎఫ్ఆర్ఎస్ విధానం అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా నగరంలో కనీసం వెయ్యి ఓపెన్ ప్లాట్లను గుర్తించి అక్కడ పిచ్చి మొక్కలను తొలగించాలని, చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో బ్రిడ్జి మీద ప్రచార హోర్డింగ్‌లు, పోస్టర్లు అనుమతులు లేకుండా పెట్టడానికి వీలులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నగరంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సర పన్ను వసూలు 32 శాతం మాత్రమే ఉందన్నారు. నోటీసులు జారీ చేసినప్పటికీ ఆస్తి పన్ను చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుని సీజ్ చేయాలన్నారు. పన్ను కట్టని వ్యాపారస్తుల ట్రేడ్ లైసెన్స్‌లను రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మున్సిపల్ ఎస్ఇ రంజిత్, మున్సిపల్ ఇఇ కృష్ణలాల్, సహాయ మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్, మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఇవిఎం గోదాం వద్ద పటిష్ట నిఘా ఉండాలి**

ఇవిఎం గోదాం వద్ద పటిష్ఠనిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోదాంను కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి తనిఖీ చేశారు. ఇవిఎం గోదాం సీళ్లను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలు పని చేస్తున్నాయి లేనిది అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సైరన్ మోగుతున్నది లేనిది పరిశీలించారు. భద్రతా సిబ్బంది విధుల గురించి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. ప్రహారీ గోడ నిర్మాణం, ఎఫ్ఎల్‌సి చేపట్టుటకు కావాల్సిన భవన నిర్మాణం గురించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎంఎ రాజు, ఆర్‌అండ్‌బి డిఈ లఖన్ నాయక్, ఎన్నికల డిటి అన్సారీ, ఆర్‌అండ్‌బి ఏఈ లలిత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# 15వ వార్డులో మాత్రమే సిపిఐ పోటీ

### బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ కూటమిగా ఏర్పాటు
### సరికొత్త నాందికి పునాది
### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/వైరా :** వైరా ఖమ్మం జిల్లాలో ఒక రాజకీయ కేంద్రం, ఇక్కడ చైతన్యవంతమైన ప్రజలు ఉన్నారు అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. శుక్రవారం వైరా మున్సిపాలిటీలో మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్‌తో కలిసి 6వ వార్డు సిపిఎం కౌన్సిలర్ అభ్యర్థి మాదినేని రజిని, 5వ వార్డులో బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కట్టా స్వరూపరాణిని, 12వ వార్డులో బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి మాదినేని సునీతను గెలిపించాలని బాగం హేమంతరావు అన్నారు. ఈ సందర్భంగా వైరా గాందిచౌక్‌లో జరిగిన కూడలి సభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం ఒక రాజకీయ ఒరవడికి నాంది పలికాయి. వైరా మున్సిపాలిటీలో 15వ వార్డులో మాత్రమే సిపిఐ పోటీ చేస్తుంది. మిగతా 19 వార్డుల్లో బిఆర్ఎస్, సిపిఎం అభ్యర్థులు పోటీలో ఉన్నారు. సిపిఎం పార్టీ సుత్తికొడవలి గుర్తుకు, బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని హేమంతరావు తెలిపారు. మున్సిపాలిటీలోని సిపిఐ శ్రేణులు అందరూ 15వ వార్డులో కంకికొడవలి గుర్తుకి మిగతా అన్ని వార్డుల్లో బిఆర్ఎస్ కారు గుర్తుకి, సిపిఎం సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు రాబోయే రోజుల్లో రాజకీయాల్లో సరికొత్త మార్పు తీసుకురాబోతుంది. వైరా ప్రాంతం అంటే స్వర్గీయ అమరజీవి బోడేపూడి వెంకటేశ్వరరావు లాంటి మహానుభావులు గుర్తొస్తారు. అలాంటి మహానుభావులు ఆశయాలను మనం బ్రతికించుకోవాలి అంటే వైరా మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా కట్టా స్వరూపరాణిని ఎన్నుకునేందుకు ప్రతిఒక్కరూ కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా అందరూ సమన్వయంతో ముందుకు పోయి కూటమని విజయబాటలో నడిపించాలని బాగం హేమంతరావు కోరారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ అధ్యక్షతన జరిగిన సంయుక్త సమావేశంలో ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు, టియుసిఐ, ఐఎఫ్‌టియు, బిఆర్‌టియు నాయకులు పాల్గొని సమ్మెపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 12న సమ్మెలో భాగంగా ఉదయం 10గంటలకు పెవిలియన్ మైదానంలో కార్మిక సంఘాల సంయుక్త సభ జరగనుందన్నారు. ఈ సభకు ఆయా సంఘాల, రాజకీయ పక్ష నాయకులతో పాటు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. సభ అనంతరం పెవిలియన్ మైదానం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని కార్మికులంతా ఈ సభ, ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల రైతులతో పాటు కార్మికుల హక్కులను హరించడంతో పాటు సంక్షేమాన్ని కూడా విస్మరించే అవకాశం ఉందన్నారు. ఆ చట్టాలను, కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేపట్టాలన్నారు. అందులో భాగంగానే సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, ఐఎన్‌టియుసి నగర అధ్యక్షులు నరాల నరేష్‌నాయుడు, ఏఐటియుసి కార్యనిర్వాహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మా విష్ణువర్ధన్, జిల్లా నాయకులు ఉపేందర్, ప్రసన్న, టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు షేక్ సుబాని, బిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు ఎండి వై. పాషా, నాయకులు సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ యువత చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

### అన్ని రంగాల్లో ముందుండేలా పోలీసుల కృషి
### సిఎం కప్ ప్రారంభోత్సవంలో కలెక్టర్, ఎస్‌పి



**ప్రజాపక్షం/చర్ల :** ఏజెన్సీ ప్రాంతాల్లో యువత చదువులతో పాటు క్రీడల్లో ముందుండాలని, ఏజెన్సీ యువతకు ఎల్లప్పుడూ పోలీసుల అండదండలు ఉంటాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. చర్ల మండల పరిధిలోని పూజారిగూడెం శివారులోని ఎస్‌సిఎ నిధుల సహకారంతో చర్ల పోలీసుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన క్రీడా మైదానంలో సిఎం కప్ ప్రారంభోత్సవానికి శుక్రవారం కలెక్టర్, ఎస్‌పి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం పోటీలను ఘనంగా ప్రారంభించారు. భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాలకు చెందిన యువత ఈ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల పట్ల మక్కువ ఉన్న ఏజెన్సీ యువత తమ ప్రతిభను చాటుకునేందుకు ఈ పోటీలు మంచి అవకాశం అన్నారు. ఇక్కడి నుండి ఎందరో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, ఈ ప్రాంత యువత క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి పేరు తేవాలన్నారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ ఏజెన్సీ యువత అన్ని రంగాల్లో రాణించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంత మారుమూల ప్రాంతాల వారి కోసం పోలీసు శాఖ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయల కల్పనకు ఇతరుల సహకారంతో పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం చర్ల మండలంలోని ఒద్దిపేట, పూసుగుప్ప గ్రామాల మధ్య నూతనంగా నిర్మింతమవుతున్న చెక్‌డ్యామ్‌ను పరిశీలించారు. అదే విధంగా దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పరిసరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమలో ఎఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జిల్లా స్పోర్ట్స్ కార్యదర్శి పరందామ రెడ్డి, సిఐ రాజువర్మ, ఎస్‌ఐలు నర్సిరెడ్డి, కేశవతో పాటు ఇతరు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విబిఎస్ఎను రద్దు చేయాలి

### ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వికసిత్ భారత్ శిక్షా అభిష్టాన్ బిల్లును వెంటనే రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎఐఎస్ఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఖమ్మంలోని కాకతీయ విశ్వవిద్యాలయం అనుబంధ పిజి కళాశాల ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ బిజెపి నేతృత్వంలోని ఎన్డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ శిక్షా అభిష్టాన్ బిల్లును ఎఐఎస్ఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ బిల్లు సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య స్వయం ప్రతిపత్తిని, భారతదేశం ఉన్నత విద్య వ్యవస్థ యొక్క లౌకిక, శాస్త్రీయ స్వభావాలపై ప్రత్యక్ష దాడి చేస్తుందన్నారు. విశ్వ విద్యాలయాల విద్యాపరమైన స్వయం ప్రతిపత్తిని విచ్ఛిన్నం చేస్తుందన్నారు. శ్రామిక, అట్టడుగు వర్గాల పేదలకు విద్యను అందుబాటులో లేకుండా చేస్తుందన్నారు. విద్యను ప్రైవేటు వస్తువుగా మార్చే ఈ బిల్లును బిజెపి ప్రవేశపెట్టిందన్నారు. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని లేని యెడల ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా, జిల్లా నాయకులు చిన్నంశెట్టి ఆకాష్, గోపి, పవన్, వర్షిణి, అంజలి, నూతన, కవిత, ఉజ్వల తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

### సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి
### జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారం రాథోడ్
### మణుగూరులో ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిశాంత్ రావు శుక్రవారం మణుగూరు పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రుల పనితీరును పర్యవేక్షించేందుకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ పలు ఆసుపత్రులలో తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయా లేదా అనే అంశాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. సాధారణ ప్రసవాలపై సూచనలు తనిఖీల్లో భాగంగా మొదట స్ప్రింగ్ ప్రసూతి ఆసుపత్రిని సందర్శించిన జిల్లా వైద్యాధికారి, అక్కడ గర్భిణీలకు సంబంధించిన నమోదు పత్రాలను (ఎఫ్‌ఫారమ్) తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డుల నిర్వహణను పరిశీలించిన ఆయన, గర్భిణీ స్త్రీలను సాధారణ ప్రసవం అయ్యేలా ప్రోత్స



హించాలని వైద్యులకు సూచించారు. సాధారణ ప్రసవం వల్ల కలిగే లాభాలను వివరించే సమాచార మరియు అవగాహన సామగ్రిని ఆసుపత్రిలో ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని ఆయన ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ఈ తనిఖీలని, నిబంధనలు అతిక్రమించే ఆసుపత్రులపై చర్యలు ఉంటాయి అన్నారు. తనిఖీల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిశాంత్ రావు, మోహన్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్మెంట్ అధికారి గొంది వెంకటేశ్వర్లు, ఆరోగ్య విద్యాధికారి పరంగని తదితరులు పాల్గొన్నారు.

“100 మిలియన్ ప్లస్ వ్యూస్‌తో సరికొత్త కంటెంట్‌తో ఆడియెన్స్‌ను థ్రిల్ చేస్తున్న ఆహా ఓటిటి అందించిన మరో ఎగ్జైటింగ్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'ధూల్ పేట్ పోలీస్ స్టేషన్'. 50 ఎపిసోడ్స్ ఉన్న ఈ సిరీస్ సూపర్బ్ రెస్పాన్స్ దక్కించుకుంటోంది. తెలుగుతో, తమిళంలలో సిరీస్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.”



## టెలివిజన్ రికార్డులను బద్దలు కొట్టిన మిరాయ్



సూపర్ హీరో తేజసజ్జా 'మిరాయ్' జైత్రయాత్ర కొనసాగిస్తోంది. థియేటర్‌లలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం, ఓటిటి, ఇప్పుడు టెలివిజన్‌లోనూ సంచలన రికార్డులు సృష్టిస్తూ అరుదైన ఘనతను సాధించింది.కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో బ్యాన్న టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన మిరాయ్ ఫాంటసీ, ఎమోషన్, యాక్షన్‌తో థియేటర్‌లలో బ్లాక్‌బాస్టర్‌గా నిలిచింది. అనంతరం హాట్ స్టార్ ఓటిటి ప్లాట్‌ఫామ్‌లనూ యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల నుంచి భారీ వ్యూయర్షిప్‌ను దక్కించుకుంది. 2026లో ఇప్పటివరకు ఏ సినిమాకు లభించని అత్యధిక టిఆర్‌పిగా ఇది రికార్డ్ అయింది. ఓటిటి రిలీజ్‌ల కారణంగా టీవీ వ్యూయర్షిప్ తగ్గుతున్న ఈ రోజుల్లో మిరాయ్ అద్భుతం చేసింది. మిరాయ్ హిందీ వెర్షన్ కూడా 2025లో ప్రసారమైన టాప్ రేటెడ్ చిత్రంగా నిలిచింది. దేశవ్యాప్తంగా సినిమాకు వచ్చిన ఈ స్పందన, సిక్వెల్ పై ఆసక్తి, డిమాండ్‌ను మరింత పెంచింది.థియేటర్‌లో ఓటిటి, శాటిలైట్.. మూడు మాధ్యమాల్లోనూ ఘన విజయాలు సాధించిన మిరాయ్, తేజ సజ్జాను భారతీయ సినిమా పరిశ్రమలో మోస్ట్ ప్రామెసింగ్ యంగ్ స్టార్ గా నిలబెట్టింది.

## 'వెంకట్రామయ్య గారి తాలూకా 'ఫస్ట్ లుక్ లాంచ్

### – ఆవిష్కరించిన నిర్మాత దగ్గుబాటి సురేష్



సీనియర్ నటుడు మురళీధర్ గౌడ్, సీనియర్ నటి సుధ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా'. 'జయమ్మ పంచాయతీ' మూవీ ఫేమ్ దినేష్ కుమా ర్ హీరోగా, ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గ నటించారు. తండ్రి, పిల్లల మధ్య భావోద్వేగాల నేపథ్యంలో వారి వారి బాధ్యతలను తెలియజేసేలా రూపొందిన ఈ సినిమాను డైరెక్టర్ సతీష్ ఆవాల తెరకెక్కిస్తున్నారు. కోమలి క్రియేషన్స్ బ్యాన్న కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం పల్లెటూరి నేపథ్యంలో సాగే క్యూట్ లవ్‌స్టోరీతో పాటు ఫాదర్ సెంటిమెంట్ ప్రధానంగా ఉండనుంది. ఈ చిత్రంలో సీనియర్ దర్శకుడు, రచయిత, నటుడు యనమదల కాశీవిశ్వనాథ్, మిర్చిమాధవి, జబర్దస్త్ ఫేం సత్యశ్రీ, మొగలిరేకులు సీరియల్ ఫేం ఇ క్బాల్, జీవ నప్రియ, గౌరీనాయుడు, హరీష్ టెక్కలి, హాసిని యామిని కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీ టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ పోస్టర్ను తాజాగా తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు, ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీనియర్ నటుడు మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ..''ఈ చి త్రంలో వెంకట్రామయ్య గారు పాత్రను నేను పోషించా. నేను మనసు పెట్టి ఆత్మతో చేసిన సినిమా ఇది. తల్లిదండ్రుల ఆవేదన, పిల్లల బాధ్యతను చెప్పే సినిమా ఇది. గొప్ప కుటుంబ కథా చిత్రంగా ఉ ంటుంది.'' అని చెప్పారు. నిర్మాత కోమలి మాట్లాడుతూ..''సింగర్ అ యిన నేను ఈ సినిమాతో నిర్మాతగా మారాను. ఈ సినిమాలో నటించిన అందరూ నాకు బాగా సపోర్ట్ చేశారు. వీని ఉగాది సందర్భంగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సతీష్, నటి మిర్చి మాధవి, నటి సత్యశ్రీ,క్రియేషన్స్ నిర్మాతలు: కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ పాల్గొన్నారు.

## 'ఆల్–టైమ్' రీజినల్ ఇండస్ట్రీ హిట్




సంక్రాంతి పండుగ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన మెగాస్టార్ చిరంజీవి 'మన శంకర వర ప్రసాద్ గారు' బాక్సాఫీస్ సంచలనంగా మారింది. ఈ చిత్రం థియేటర్‌లలో విజయవంతంగా 25 రోజులు పూర్తి చేసుకుని, అన్ని ప్రాంతాలలోనూ అద్భుతంగా కొనసాగుతోంది. ఈ చిత్రం ఇప్పటికే ఎన్నో రికార్డులను బద్దలు కొట్టింది.ప్రపంచవ్యాప్తంగా 375 కోట్ల మార్కును దాటిన ఈ చిత్రం ఇప్పుడు ఆల్‌టైమ్ రీజినల్ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచి, అద్భుతమైన వసూళ్లను నమోదు చేస్తూనే ఉంది. ఇది చిరంజీవి, అనిల్ రావిపూడి ఇద్దరికీ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ముఖ్యంగా, ఇది బుక్మైషోలో అత్యధిక టిక్కెట్ల అమ్మకాలతో కొత్త రీజినల్ రికార్డును కూడా నెలకొల్పింది. విదేశాలలో 3.5 మిలియన్ డాలర్ల మైలురాయికి చేరువలో ఉంది.విక్టరీ వెంకటేష్ కీలక పా త్రలో నటించినీ చిత్రం మరో మైలురాయిని చే రుకోవడానికి సిద్ధమౌతోంది. 400 కోట్ల మార్కును చేరుకునే దిశగా దూసుకుపోతోందని నిర్మాతలు సుస్మిత కొణిదెల, సాహు గారపాటి తెలిపారు.

## 'టాక్సిక్' హక్కుల ఖరీదు రూ.120 కోట్లు



రాకింగ్ స్టార్ యశ్ ప్రెస్టీజియస్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్ అప్స్'. మార్చి 19న ఈ మూవీ వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ కానుంది. రిలీజ్‌కు ముందే ఈ సినిమా సరికొత్త రికార్డ్‌ను క్రియేట్ చేస్తోంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యాన్న ప్రొడ్యూసర్ దిల్ రాజు ఈ సినిమా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన హక్కులను రూ.120 కోట్ల (అడ్వాన్స్ ఆన్ కమీషన్ బేసిస్)కు సొంతం చేసుకోవటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. నాన్ తెలుగు సినిమాకు జరిగిన ఆల్టైమ్ బిగ్గెస్ట్ బిజినెస్ డీల్‌గా మారింది. ఈ ఏడాది విడుదల కానున్న మోస్ట్ అవెయిటెడ్ మూవీగా టాక్సిక్ కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో టాక్సిక్ నిర్మాతల(కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టార్ మైండ్ క్రియేషన్స్)కు శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్కు మధ్య ఈ హిస్టారికల్ డీల్‌తో సినిమాపై బజ్ మరింతగా పెరిగింది. సినిమా రూపొందుతోన్న స్కేల్, సినిమాపై ఉన్న క్యూరియాసిటీ, బాక్సాఫీస్ రేంజ్ ట్రే ఉన్న గట్టి నమ్మకాన్ని ఇది మరింత స్పష్టంగా తెలియజేస్తోంది. ఎపి, తెలంగాణ హక్కుల కోసం మూడు అగ్ర సంస్థలు పోటీ పడగా చివరకు దిల్ రాజు నేతృత్వంలోని శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్‌కు ఈ డీల్ దక్కింది. దీంతో ఇటీవల ఇండియన్ సినీ హిస్టరీలో అత్యంత కీలకమైన డిస్ట్రిబ్యూషన్ డీల్స్‌లో ఒకటిగా నిలిచింది. రాకింగ్ స్టార్ యశ్ టాక్సిక్ సినిమాకు ఎపి, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వస్తోన్న భారీ స్పందన ఇవన్నీ చూస్తుంటే సినిమా ప్రారంభమైనప్పటి నుంచే దీనికి ఊహించని స్థాయిలో భారీ బజ్ క్రియేట్ అయ్యిందనే దానికి ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. ప్రాంతాలకు అతీతంగా యశ్కు వస్తోన్న ఆదరణ చూస్తుంటే ఓ స్టార్ హీరో కోసం దేశం యావత్తు ఏకమవుతోందనే అరుదైన ఫీలింగ్ కలుగుతోంది. కెజియఫ్ 2 తర్వాత యశ్ నెకట్స్ మూవీ కోసం ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారనేవిషయం ఇప్పటికే నెంబ ర్స్ రూపంలో, ప్రీ రిలీజ్ హైప్ రూపంలో స్పష్టంగా తెలుస్తోంది. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ దిల్ రాజు మాట్లాడుతూ ''ఇండియన్ సినీ ఇండస్ట్రీలోని పెద్ద స్టార్స్‌లో యశ్ ఒక రు. కెజియఫ్ 2 తర్వాత ఆయన మార్కెట్ మరింతగా పెరిగింది. ఆయన నెకట్స్ సినిమా టాక్సిక్ కోసం ఆడియెన్స్ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. నాలుగేళ్ల తర్వాత వస్తోన్న ఈ సినిమాపై ఉన్న అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇలాంటి ప్రెస్టీజియస్ మూవీని మా ఎస్వీసీ బ్యాన్న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకు రానుండటం చాలా ఆనందంగా ఉంది. యశ్తో ఇలాగే మరిన్ని సినిమాలు చేయాలని ఆశిస్తున్నాం'' అన్నారు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ భాగస్వామ్యం కావటం వల్ల టాక్సిక్ సినిమాపై నమ్మకం మరింతగా పెరిగింది. అందుకు కారణం దిల్ రాజు నేతృత్వంలోని ఎస్వీసీ బ్యానర్‌రు ఎన్నో భారీ చిత్రాలు, కంటెంట్ బేస్ద్ సినిమాలను రూపొందించి ఘన విజయాలను సాధించింది. నేషనల్ అవార్డ్స్ సాధించిన సినిమాలు, బ్లాక్ బస్టర్స్ సాధించిన సినిమాలను రూపొందించిన ఈ సంస్థపై ట్రేడ్ వర్గాలలో మంచి నమ్మకం ఉంది. టాక్సిక్ సినిమాతో ఎస్వీసీ బ్యానర్ జత కట్టటం అనేది కథ, స్కేల్, భారీగా థియేటర్స్‌లో సినిమా రన్ కావటం అనే అంశాలపై ఉన్న నమ్మకాన్ని మరింత స్పష్టం చేసింది. సినీ ఇండస్ట్రీకి ఎపి, తెలంగాణ ప్రాంతాలు ఎంతో కీలకమైనవి. కారణం, ఇక్కడ సినిమాను ప్రేక్షకులు ఎంతగానో ఆదరిస్తారు, గుండెలలో పెట్టుకుంటారు. కాబట్టి ఈ భాగస్వామ్యం టాక్సిక్ సినిమా ప్లస్ అయ్యిం ది. ప్రేక్షకులకు భారీ రిలీజ్, స్ట్రాంగ్ ప్రమోషన్లు, థియేటర్‌లలో ఫుల్ మాస్ ఫీలింగ్ గ్యారంటీ అనే ఫీలింగ్ వచ్చింది. యశ్, గీ తూ మోహన్దాస్ కలిసి కథను రాసి.. గీతూ మోహన్దాస్ దర్శకత్వం వహిస్తున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' సినిమాను ఇంగ్లిష్, కన్నడ భాషల్లో ఒకేసారి చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాను హిందీ, తెలుగు, తమిళం, మలయాళం సహా మరికొ న్ని భాషల్లో డబ్బింగ్ చేసి విడుదల చేస్తున్నారు. దీంతో ఈ చిత్రంపై అంతర్జాతీయ స్థాయిలో భారీ అంచనాలున్నాయి. 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' సినిమాను కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్స్పై వెంకట్ కె.నారాయణ, యష్ నిర్మిస్తున్నారు. సినిమా 2026 మార్చి 19న ఈద్, ఉగాది, గుడి పడ్వా పండుగలు కలిసి వచ్చే లాంగ్ వీకెండ్ సమయంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్కు సిద్ధమవుతోంది.

## 'మావందే' తొలి షెడ్యూల్ పూర్తి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్‌ను 'మా వందే' టైటిల్ తో సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు ప్రొడ్యూసర్ వీర్ రెడ్డి.ఎం. ఈ చిత్రంలో నరేంద్ర మోదీ పాత్రలో మలయాళ స్టార్ హీరో ఉన్ని ముకుందన్ నటిస్తున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్నిస్తూ ప్రధాని మోదీ జీవితాన్ని యదార్థ ఘటనల ఆధారంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు క్రాంతికుమార్.సీహెచ్. ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యున్నత సాంకేతిక విలువలు, వీఎఫ్ఎక్స్ తో రూపొందుతోంది. 'మా వందే' చిత్రాన్ని పాన్ ఇండియా భాషలతో పాటు ఇంగ్లీష్ లోనూ రిలీజ్ చేయనున్నారు. తాజాగా ఈ సినిమా హైదరాబాద్ లో ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. ఈ మొదటి షెడ్యూల్ షూటింగ్ లో సినిమాలోని పలు కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. 'మా వందే' టీమ్ మెంబర్స్ నెకట్స్ షెడ్యూల్ కోసం కాశ్మీర్ వెళ్తున్నారు. మ400 కోట్ల రూపాయలకు పైగా హ్యూజ్ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఈ స్టోరీ డ్రివెన్ మూవీని ప్రపంచంలో తొలిసారిగా తొలిసారి ఆరి అలెక్సా 265 జెంట్రీ, కుకీ లెన్స్ కెమెరాతో తెరకెక్కిస్తుండటం విశేషం. హాలీవుడ్ బ్లాక్ బస్టర్ మూవీ ఆక్వామ్యాన్ లో హీరోగా నటించిన జేసన్ మమొవాను 'మా వందే' చిత్రంలో ఓ కీలక పాత్రకు సంప్రదిస్తున్నారు. రవీనా టాండన్, జగపతి బాబు, శరత్ కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. స్టంట్ కొరియోగ్రాఫర్ కింగ్ సోలామన్ , ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్, ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్, డీవోపీ కె.కె. సెంథిల్ కుమార్, మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రుర్ ఈ సినిమాకు పని చేస్తున్నారు.యాక్షన్ కింగ్ సోలొమన్, ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్, ఎడిటింగ్ శ్రీకర్ ప్రసాద్, డీవోపీ కె.కె. సెంథిల్ కుమార్, మ్యూజిక్ రవి బస్రుర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ గంధాధర్ ఎన్ ఎస్, వాణిశ్రీ .బి.లైన్ ప్రొడ్యూసర్ టీవీఎన్ రాజేశ్.

## ఉగాదికి గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్

### ఇండస్ట్రీ ప్రభుత్వాన్ని సొంతం చేసుకోవాలి
### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రదానం చేస్తున్న తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల వేడుకను ఈసారి ఉగాది పర్వదినాన ప్రదానం చేస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రసాద్ ల్యాబ్ లో గద్దర్ ఫిలిం అవారడ్స్ 2025 బ్రోకర్ ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత సామాజిక మార్పు కోసం కళల ద్వారా కృషి చేసిన వ్యక్తి గద్దర్ అని చెప్పారు. ఆయన పేరు మీద అవార్డులు ఇవ్వాలని సీఎం రేవంత్ ఆలోచన అని తెలిపారు. గతేడాది కూడా ఉగాదికే అవార్డులు ఇవ్వాలనుకున్నాం కానీ అప్పుడు సమయం చాలక కుదరలేదన్నారు.ఈ ఏడాది మాత్రం ఉగాది పర్వదినానే అవార్డులు ఇస్తున్నాం అని స్పష్టం చేశారు. సినిమా ఇండస్ట్రీ పెద్ద ఎత్తున హైదరాబాద్‌లో వ్యవస్థీకృతం కావాలన్నారు. హైదరాబాద్ నగరం బేస్‌గా సినిమా హబ్ ఏర్పాటు చేయాలనే ప్రగాఢమైన సంకల్పం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని చెప్పారు. సినిమాకి అనుకూలమైన వాతావరణం, పరిస్థితులు హైదరాబాద్‌లోనే ఎక్కువ, ఈ అనుకూలమైన పరిస్థితులను పెద్ద ఎత్తున పాజిటివ్‌గా మలచుకోవాలి, దీని ద్వారానే హైదరాబాద్‌ని ఫిల్మ్ ఇండస్ట్రీ హబ్‌గా మార్చాలని అన్నారు. సామాజిక పరమైన సందేశాలివ్వవచ్చు, రాష్ట్ర ఆదాయ వనరులు సమకూర్చుకోవచ్చు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు సినిమాల ద్వారా కల్పించవచ్చు అని తెలిపారు. తెలుగు సినిమా ఇండస్ట్రీ ప్రపంచస్థాయికి ఎదగడం, అవార్డులు పొందడం ఆనందదాయకం, ముందు చూపుతో తెలంగాణ ప్రభుత్వం బ్లూ ప్రింట్‌తో ముందుకు సాగుతుందని అన్నారు. ఫిల్మ్ ఇండస్ట్రీకి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ వెన్నంటి ఉంటుంది, సహాయ సహకారాలు అందిస్తుంది, ఆర్థికపరమైన, సామాజిక పరమైన, లా అండ్ ఆర్డర్‌కి సంబంధించిన, ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ పరమైన అవసరాలను తీర్చడానికి మేం రెడీగా ఉన్నాం, అర్ధరాత్రి తలుపు తట్టిగా సహకరిస్తాం అని స్పష్టం చేశారు. ఏ అవసరాలు వచ్చినా సినిమాటోగ్రఫీ మినిస్ట్రీ ముం దుంటుంది, సినిమా ఇండస్ట్రీ ప్రభుత్వాన్ని సొంతం చేసుకోవాలని కోరారు. మేం కూడా సినిమా ఇండస్ట్రీని సొంతం చేసుకుంటున్నాం అని భట్టి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు, 2025 జ్యూరి కమిటి చైర్మన్, సంగీత దర్శకుడు మణిశర్మ, ఎఫ్ డి సి అధికారి కిషోర్ బాబు పాల్గొన్నారు.



## ఈ–ఆఫీస్ విధానం ద్వారా ఫైల్లు సత్వర పరిష్కారం

### సివి ఆనంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈఆఫీస్ విధానం ద్వారా ఫైళ్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని, పరిపాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సివి ఆనంద్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విభాగాధిపతుల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి. ఆనంద్ శుక్రవారం లక్డీకాపుల్ లోని ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డైరెక్టరేట్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన 'ఈఆఫీస్' అప్లికేషన్‌ను ప్రారంభించారు. సివి ఆనంద్ మాట్లాడుతూ.. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా రాష్ట్రంలో కాగిత రహిత (పేపర్‌లెస్) పాలనను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రాసిక్యూషన్ విభాగంలో ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేసిన డైరెక్టర్‌ను, సిబ్బందిని ఆయన అభినందించారు. అనంతరం, ప్రాసిక్యూషన్ విభాగం కోసం రూపొందించిన 'ముఖ గుర్తింపు ఆధారిత హాజరు నిర్వహణ వ్యవస్థ'ను ఆయన ప్రారంభించారు. ఈ డిజిటల్ విధానం వల్ల సిబ్బంది హాజరులో క్రమశిక్షణ, పారదర్శకత పెరుగుతుందని ఆయన తెలిపారు. కొత్త చట్టాల సమర్థవంతమైన అమలుకు తీసుకోవాల్సిన మరిన్ని చర్యలపై దిశానిర్దేశం చేశారు.

## చెన్నైలో నిలువెత్తు కార్ల్ మార్క్స్ విగ్రహం

ఆవిష్కరించిన సిఎం ఎం.కె.స్టాలిన్

హాజరైన సిపిఐ, సిపిఎం, ఎండిఎంకె నాయకులు




**చెన్నై :** చెన్నైలో ఏర్పాటు చేసిన జర్మన్ తత్వవేత్త, మార్క్సిజం, శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతకర్త కార్ల్ మార్క్స్ విగ్రహాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ శుక్రవారం ఆవిష్కరించారు. గత ఏడాది ఏప్రిల్‌లో తమిళనాడు అసెంబ్లీలో ఆయన ప్రసంగిస్తూ ప్రపంచ విప్లవాత్మక నాయకుడిగా అభివర్ణించిన కార్ల్ మార్క్స్‌ను గౌరవించాలని, స్మరించుకోవాలని ద్రవిడ నమూనా ప్రభుత్వం సంకల్పించిందని ప్రకటించారు. ఆ మేరకు ఎగ్మోర్ మ్యూజియం కాంప్లెక్స్‌లో గ్రంథాలయం ఎదుట రూ.85.80 లక్షలతో మార్క్స్ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీనిని మంత్రివర్గ సహచరులతో కలిసి ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. వీరపాండియన్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం, విసికె అధ్యక్షులు తోల్ తిరుమావళవన్, ఎండిఎంకే అధినేత వైకో, తమిళనాడు పిసిసి అధ్యక్షుడు కె.సెల్వపెరుంతగైతో సహా వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరితో కలిసి మార్క్స్‌కు వీరవణక్కం (వీర వందనం) అంటూ స్టాలిన్ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొన్నెమారా పబ్లిక్ లైబ్రరీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్ల్ మార్క్స్ ఫోటో ఎగ్జిబిషన్‌ను స్టాలిన్ తిలకించారు. మార్క్స్ జీవితంపై ఎఐతో రూపొందించిన ప్రత్యేక వీడియోను ఆయన వీక్షించారు. 'మార్క్స్ విగ్రహ స్థాపన ప్రగతిశీల ఆదర్శాల పట్ల రాష్ట్ర నిబద్ధతకు ప్రతీక' అని తన సోషల్ మీడియా పోస్ట్‌లో స్టాలిన్ పేర్కొన్నారు. 'మార్క్స్‌ను ప్రతిష్ఠిస్తున్నాం. అసమానతను తొలగిస్తున్నాం. చెన్నై మరోసారి ఎరుపు రంగును పునరుద్ఘాటిస్తోంది. కార్ల్ మార్క్స్ గంభీరమైన విగ్రహం ఇప్పుడు చెన్నైలోని కొన్నెమారా పబ్లిక్ లైబ్రరీలో కొలువై ఉంది' అని ఆయన అన్నారు. 'ప్రగతిశీల ఆలోచనలు ఎక్కడి నుంచి వచ్చినా, వాటి నుండి మేము శక్తిని పొందుతాము. ఆధిపత్య శక్తులు ప్రబలడానికి ప్రయత్నించినప్పుడు, మేము వాటిని ప్రతిఘటిస్తాము. ఇదే మా ద్రవిడ నమూనా యొక్క సారాంశం.' అని సిఎం స్టాలిన్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో స్పష్టం చేశారు.

## ఒమాన్ మధ్యవర్తిత్వం

(మొదటి పేజీ తరువాయి)

అలాగే అమెరికా మధ్యప్రాచ్య ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లతో సమావేశమయ్యారని తెలిపింది. ఈ సంప్రదింపులు దౌత్య, సాంకేతిక చర్చలను తిరిగి ప్రారంభించేందుకు అనుకూల పరిస్థితులను సృష్టించడంపై, దీర్ఘకాలిక భద్రత, స్థిరత్వం సాధించడంపై కేంద్రీకృతమయ్యాయని ఒమాన్ వ్యాఖ్యానించింది. ఈ చర్చలు ముగిసాయా? లేదా? అన్నది స్పష్టంగా తెలియకపోయినా, అమెరికా ప్రతినిధులు వెళ్లిన వెంటనే ఒమాన్ అధికారులు కూడా రాజ ప్రాసాదాన్ని విడిచిపెట్టారు. కాగా, ఇదే భవనాన్ని 2025లో జరిగిన ఇరాన్–అమెరికా చర్చల కోసం కూడా ఒమాన్ ఉపయోగించింది. ఈసారి, ముందుగా టర్కీలో ప్రాంతీయ దేశాల భాగస్వామ్యంతో చర్చలు జరపాలన్న యోచనలు గందరగోళంగా మారాయి. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకారం, 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరాన్ పాలక వ్యవస్థ ప్రస్తుతం అత్యంత బలహీన స్థితిలో ఉందని అభిప్రాయం. గత నెల జరిగిన దేశవ్యాప్త నిరసనలు సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ పాలనకు అతిపెద్ద సవాలుగా మారాయి. వాటిని అణచివేయడానికి జరిగిన కఠిన చర్యల్లో వేల మంది మరణించగా, పదివేల మంది అరెస్టయ్యారని నివేదికలు చెబుతున్నాయి. దీనితో ట్రంప్ మరోసారి ఇరాన్‌పై సైనిక దాడుల హెచ్చరికలు జారీ చేశారు. అయితే, ప్రస్తుత చర్చల్లో ఇరాన్ అణు కార్యక్రమమే ప్రధాన అంశమని తేహరాన్ స్పష్టం చేసింది. కానీ, మూడు సంవత్సరాలు యురేనియం శుద్ధిని నిలిపివేయడం, అధికంగా శుద్ధి చేసిన యురేనియాన్ని దేశం వెలుపలికి పంపడం వంటి ప్రతిపాదనలు ఉన్నట్లు సమాచారం. ఇరాన్ కీలక సలహాదారు అలీ షమ్ఖానీ మాత్రం అలాంటి ప్రతిపాదనలను అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. అమెరికా మాత్రం అణు కార్యక్రమంతో పాటు బాలిస్టిక్ క్షిపణులు, ప్రాంతీయ మిలీషియాలకు మద్దతు, మానవ హక్కుల అంశాలన్నీ చర్చల్లో ఉండాలని కోరుతోంది.

ఈ నేపథ్యంలో మస్కట్ చర్చలు భవిష్యత్తులో అణు ఒప్పందం పునరుద్ధరణకు దారితీస్తాయా అన్నది కీలకంగా మారింది.

## యథాతథం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. 2025లో ఆర్‌బిఐ వడ్డీరేట్లలో గణనీయమైన మార్పులు చేసింది. ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లో ఒక్కోసారి 25బేసిస్ పాయింట్లు తగ్గించింది. అనంతరం జూన్‌లో 50బేసిస్ పాయింట్ల భారీ కోత విధించింది. డిసెంబరులో మరో 25 శాతం తగ్గించడంతో మొత్తం ఏడాదిలో రెపో రేటు 1.25 శాతం వరకు తగ్గింది. ఈ తగ్గింపులతో రుణాలు చౌకగా మారి వినియోగం, పెట్టుబడులు పెరిగేలా చర్యలు తీసుకుంది. ఇప్పుడు ఆ ప్రభావాన్ని అంచనా వేసే దశలో ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**వృద్ధి అంచనాలు ఆశాజనకం**

దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని ఆర్‌బిఐ గవర్నర్ పేర్కొన్నారు. కార్పొరేట్ రంగంలో లాభాలు మెరుగుపడటం, అసంఘటిత రంగంలో స్థిరత్వం పెరగడం, తయారీ రంగానికి ఊతమివ్వనున్నాయని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధిరేటు 7.4 శాతం నమోదవుతుందని అంచనా వేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27)లో కూడా వృద్ధి కొనసాగుతుందని భావిస్తున్నారు. తొలి త్రైమాసికంలో 6.9 శాతం, రెండో త్రైమాసికంలో 7 శాతం వృద్ధి నమోదవ్వొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ, దేశీయ డిమాండ్ బలంగా ఉండటం ప్రధాన బలం అని తెలిపారు. ద్రవ్యోల్బణం కూడా నియంత్రణలోనే ఉందని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సగటు ద్రవ్యోల్బణం 2.1 శాతం ఉండొచ్చని అంచనా. అయితే వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో 4 శాతం, రెండో త్రైమాసికంలో 4.2 శాతం వరకు పెరగవచ్చని భావిస్తున్నారు. అయినప్పటికీ ఇది ఆర్‌బిఐ లక్ష్య పరిధిలోనే ఉందని గవర్నర్ తెలిపారు.

**వాణిజ్య ఒప్పందాల ప్రభావం**

భారత్– ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, త్వరలో కుదిరే భారత్– అమెరికా ట్రేడ్ డీల్ దేశ ఆర్థిక వృద్ధికి మరింత బలం చేకూరుస్తాయని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. ఎగుమతులు పెరగడంతో పాటు విదేశీ పెట్టుబడులు పెరిగే అవకాశముందని తెలిపింది. అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ పాత్ర మరింత విస్తరించనుందని గవర్నర్ వ్యాఖ్యానించారు.

## ఆత్మాహుతి దాడి

(మొదటి పేజీ తరువాయి)

పరిసర ప్రాంతమంతా కంపించింది. సంఘటన స్థలానికి వెంటనే పోలీసులు, సహాయతా బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. రాజధానిలోని ఆసుపత్రులన్నింటిలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్న కారణంగా, మృతుల సంఖ్య పెరికే అవకాశం ఉంది. ప్రారంభ నివేదికల ప్రకారం, దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ఏ ఉగ్రవాద సంస్థ వెంటనే ప్రకటించలేదు. అయితే పోలీసు వర్గాల సమాచారం మేరకు దాడి చేసిన వ్యక్తి విదేశీయుడిగా గుర్తించబడినట్టు, అతడికి ఫిత్నా అల్ ఖ్వారిజీగా పిలిచే తెహ్రీక్–ఎ–తాలిబాన్ పాకిస్తాన్ (టిటిపి)తో సంబంధాలు ఉండవచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. కాగా, పేలుడు స్వభావాన్ని ఇంకా లోతుగా దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ ఘటన జరిగిన ప్రాంతాన్ని ఆర్మీ, రేంజర్స్ పూర్తిగా ముట్టడి చేసి భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. పేలుడు జరిగిన ప్రదేశం చుట్టుపక్కల గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇది మూడు నెలల క్రితం ఇస్లామాబాద్‌లోని జిల్లా, సెషన్స్ కోర్టు భవనం సమీపంలో జరిగిన ఆత్మాహుతి దాడి తర్వాత మరో తీవ్రమైన ఘటన. ఇదే సమయంలో ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ పాకిస్తాన్ పర్యటనలో ఉండటం గమనార్హం. ఈ దాడి దేశ భద్రతపై, అంతర్జాతీయ స్థాయిలో పాకిస్తాన్ ప్రతిష్ఠపై ప్రశ్నలు లేవనెత్తింది. ఈ దాడిని అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్, సెనేట్ ప్రతిపక్ష నేత అల్లామా రాజా నాసిర్ అబ్బాస్ తీవ్రంగా ఖండించారు. నిరపరాధ పౌరులను లక్ష్యంగా చేసుకోవడం మానవత్వానికి వ్యతిరేకమని జర్దారి అన్నారు. ప్రార్థనా స్థలాలపై దాడులు మతం, సామాజిక విలువలపై ప్రత్యక్ష దాడులని అబ్బాస్ వ్యాఖ్యానించారు. కాగా, ఖైబర్ పఖ్తూన్ఖ్వా ప్రావిన్స్‌లో పాకిస్తాన్ భద్రతా దళాలు రెండు వేర్వేరు ఆపరేషన్లలో 24 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు సైన్యానికి చెందిన మీడియా విభాగం ఐఎస్‌పిఆర్ తెలిపింది. ఫిబ్రవరి 4–5 తేదీల్లో ఒరక్‌జై, ఖైబర్ జిల్లాల్లో ఈ ఆపరేషన్లు నిర్వహించారు. ఒరక్‌జై జిల్లాలో జరిగిన దాడిలో 14 మంది, ఖైబర్ జిల్లాలో మరో ఆపరేషన్‌లో 10 మంది ఉగ్రవాదులు మరణించారు. వీరంతా నిషేధిత టిటిపికి చెందినవారిగా, ప్రభుత్వ వర్గాలు వీరిని ఫిత్నా అల్ ఖ్వారిజీగా పేర్కొన్నాయి. ఎదురుకాల్పుల అనంతరం మిగిలిన ఉగ్రవాదుల్ని ఏరిపారేసేందుకు ముమ్మర సోదాలు జరుపుతున్నారు. 'అజ్మ్–ఎ–ఇస్తెహ్కామ్' వ్యూహం కింద ఉగ్రవాద ఏరివేత చర్యలు కొనసాగుతాయని సైన్యం స్పష్టం చేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com